RNI.No. APTEL/2014/57702
ESTD: 1999
www.voodayam.com
Postal Regd. No. GTR/117/2025-27




# వుదయం




గుంటూరు | 22-01-2026 గురువారం | సంపుటి : 12 | సంచిక : 329 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Guntur, Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Warangal | Follow us on

## 47 మంది మున్సిపల్ కమిషనర్లు బదిలీ

- సొంత జిల్లాల్లో పని చేస్తున్న, ఒకేచోట సుదీర్ఘ కాలం ఉన్న అధికారులకు స్థానచలనం
- 'పుర'పోరుకు సన్నాహాలు
- ఈ నెల 24 లేదా 27న ఎన్నికల నోటిఫికేషన్

**వుదయం, హైదరాబాద్ బ్యూరో :**

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సన్నాహాలు ముమ్మరం చేసింది. సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో భారీగా మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేసింది. ఈ మేరకు జీవో నెం.87 పేరిట బదిలీ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలన్న ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పురపాలక పరిపాలన శాఖ కార్యదర్శి టీకే శ్రీదేవి తెలిపారు. సొంత జిల్లాల్లో పని చేస్తున్న వారు, ఒకేచోట సుదీర్ఘ కాలం పని చేస్తున్న అధికారులను పరిపాలనా కారణాలతో పాటు పదోన్నతులపై మొత్తం 47 మందిని బదిలీ చేసినట్లు వివరించారు. అందులో సీ.వీ.ఎన్.రాజు ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్3) నుంచి రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ సెక్రటరీగా బదిలీ అయ్యారు. జి.రాజు క్యాతనపల్లి నుంచి

మిగతా 2లో..

# ఏపీ ఖ్యాతి మార్మోగుతోంది

### మన గురించి అంతర్జాతీయ పారిశ్రామిక రంగం చర్చించుకుంటోంది : దావోస్‌లో సీఎం చంద్రబాబు





- మాది పరిశ్రమల ఫ్రెండ్లీ ప్రభుత్వం
- చిత్తశుద్ధితో కష్టపడి పని చేస్తే ఏదైనా సాధ్యమని మేమునమ్ముతాం
- మా విశాఖకు గూగుల్ రాక రాష్ట్ర అభివృద్ధిలో గొప్ప ముందడుగు
- అగ్రిటెక్ విధానాన్ని అమలు చేస్తున్నాం

**దావోస్:**

భారీ లక్ష్యాలు నిర్దేశించుకుని వాటి కోసం నిరంతరం పనిచేయడం తనకు అలవాటు అని ఏపీ సీఎం చంద్రబాబు ) అన్నారు. ముందుచూపుతో వ్యవహరించి.. వినూత్నంగా ఆలోచించి.. చిత్తశుద్ధితో కష్టపడి పని చేస్తే ఏదైనా సాధ్యమని నమ్ముతానని ఉద్ఘాటించారు. దావోస్‌లో మూడో రోజు చంద్రబాబు పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా వివిధ జాతీయ, అంతర్జాతీయ మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి విషయంలో జరుగుతున్న పరిణామాలను, ప్రభుత్వ పాలసీలను మీడియా ప్రతినిధులకు వివరించారు.

"మాది పరిశ్రమల ఫ్రెండ్లీ ప్రభుత్వం. ఈజ్ ఆఫ్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం ద్వారా త్వరితగతిన అనుమతులిస్తున్నాం. పరిశ్రమలకు ప్రోత్సాహకాలిచ్చే విధానాన్ని అమలు చేస్తున్నాం. అనుమతుల నుంచి పరిశ్రమల స్థాపన వరకు ప్రతి అంశాన్ని రియల్ టైంలో మానిటర్ చేస్తున్నాం. విశాఖకు గూగుల్ కంపెనీ రాక ఏపీ అభివృద్ధిలో గొప్ప ముందడుగు. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఈ విషయంలో చూపిన చొరవ, ఫాలో అప్ వల్లే ఆ పెట్టుబడి సాధించగలిగాం.

వ్యవసాయంలో టెక్నాలజీ వినియోగంతో పరిస్థితులు పూర్తిగా మారుతున్నాయి. రాష్ట్రంలో అగ్రిటెక్ విధానాన్ని అమలు చేస్తున్నాం. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ అమ్మోనియా గురించి అంతా చర్చిస్తున్న సమయంలోనే ఏపీలో ఉత్పత్తికి అడుగులు వేస్తున్నాం. విదేశాలకు గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి ఎగుమతి చేసేందుకు ఇప్పటికే ఒప్పందాలు జరిగాయి.

30 ఏళ్ల కిందటే దేశ అభివృద్ధిలో కీలక అడుగులు పడ్డాయి. ఇప్పుడు సంస్కరణలను అందిపుచ్చుకుంటున్నాం. అవే రాష్ట్రంలోని యువతకు అవకాశాలు కల్పించాయి. టెక్నాలజీ, గ్రీన్‌బ్లూ సిటీగా అమరావతిని నిర్మిస్తున్నాం. ఏపీలో గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ ఏర్పాటు చేయాలనేది నా ఆలోచన. ఏపీ అమలు చేస్తున్న విధానాలను, ఆలోచనలను, వేగంగా తీసుకుంటున్న నిర్ణయాలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోంది. ఆ స్థాయిలోనే పారిశ్రామిక రంగం ఏపీ గురించి చర్చించుకుంటోంది. చైనా, జపాన్ సహా అనేక దేశాల్లో ఉన్న ఏజింగ్ సమస్య భారత్‌కు లేదు. సమర్థ మానవ వనరులు, టెక్నాలజీ భారత్ అదనపు బలం" అని చంద్రబాబు అన్నారు.

## పాపం రూ

### తొలిసారి డాలర్‌కు 90 రూపాయలు

**న్యూఢిల్లీ, జనవరి 21:**

ఎన్నడూ లేని విధంగా రూపాయ విలువ బుధవారం నాడు తీవ్రంగా పతనమై, చరిత్రలో మొదటిసారిగా డాలర్‌కు 90 రూపాయల కీలక స్థాయిని దాటింది.

అమెరికన్ డాలర్‌తో పోలిస్తే కరెన్సీ విలువ 90.13 వద్ద కొత్త రికార్డు కనిష్ట స్థాయికి పడిపోయింది. మంగళవారం నాడే



అత్యంత కనిష్ట స్థాయిగా 89.9475ను చేరుకుంది.

భారత్ యుఎస్‌ల మధ్య వాణిజ్యం ఒప్పందంపై పెరుగుతున్న సందేహాలు, బలహీనమైన వాణిజ్యం, పెట్టుబడులు, అమ్మకాల తగ్గడం నడుమ రూపాయి క్షీణత సంభవించింది.

ఈ అంశాలే కరెన్సీని నిరంతర ఒత్తిడిలో ఉంచాయి.

రూపాయ ఇలా కనిష్ట స్థాయికి వెళ్లడం అన్నది దేశీయ ఈక్వెటీ మార్కెట్లపై ప్రభావాన్ని చూపింది. పెట్టుబడిదారులలో అప్రమత్తతను ప్రతిఫలిస్తూ నిఫ్టీ సూచి 26,000 మార్కు దిగువకు పడిపోయింది.

బలహీనపడుతున్న కరెన్సీ వల్ల ద్రవ్యోల్బణం, విదేశీ పెట్టుబడి

మిగతా 2లో..

# ప్రపంచంతో పోటీ పడదాం



- ఆ శక్తి కాంగ్రెస్ ప్రభుత్వానికి మాత్రమే ఉంది
- తెలంగాణ సంపదను ప్రజలకు పంచుతాం
- సమాజం ఉమ్మడి కుటుంబంలా ఎదిగేలా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం
- ధర్మపురి బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి

**వుదయం, జగిత్యాల :**

తెలంగాణను ప్రపంచంతో పోటీ పడేలా చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. ఆ శక్తి కాంగ్రెస్ ప్రభుత్వానికి మాత్రమే ఉందని తెలిపారు .

రాష్ట్రంలో ఉన్న వనరులు, సంపద సమానం పంచబడాలని అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని ముందే గ్రహించిన సోనియాగాంధీ.. రాష్ట్రం ప్రపంచంతో పోటీ పడాలన్న ఆకాంక్షతో తెలంగాణ ఇచ్చారన్నారు. బుధవారం జగిత్యాల జిల్లా ధర్మపురి లో పర్యటించిన భట్టి... అక్కడ రూ. 263 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ రాష్ట్ర వనరులు సంపద ప్రజలకే అంకితం చేస్తామన్నారు. ఇంకొకరికి వీసమెత్తు కూడా అవకాశం ఇవ్వమని స్పష్టం చేశారు. గత పదేళ్లు పరిపాలించిన బీఆర్ఎస్ నేతలు పాలన అంటే దోచుకోవడం పంచుకోవడం అన్నట్టుగా పని చేశారన్నారు. కానీ తమ దృష్టిలో పాలన అంటే సంపద పోగుచేసి రాష్ట్ర ప్రజలకు పంచడమే అన్నారు. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిన తమ ప్రభుత్వం గత రెండున్నరేళ్లలో రైతు భరోసా, రైతు బీమా, రైతులకు యంత్ర పరికరాల పంపిణీ, డ్రిప్

మిగతా 2లో..

# 16 మందికి ఐఏఎస్ హోదా

### పలు కేటగిరీల వారీగా ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ

**వుదయం, హైదరాబాద్ బ్యూరో :**

పదోన్నతుల కోసం సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తోన్న తెలంగాణ సివిల్ సర్వీస్ అధికారులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. వివిధ కేటగిరీల కింద ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తూ మొత్తం 16 మంది అధికారులకు ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ హోదా కల్పిస్తూ కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ బుధవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది, ఇందులో 2022,2023,2024 సంవత్సరాలకు సంబంధించి ఎంపిక చేసిన అధికారులను తెలంగాణ క్యాడర్‌కు కేటాయిస్తూ రాష్ట్రపతి ఆమోదం తెలిపినట్లు నోటిఫికేషన్‌లో పేర్కొంది. 2022 కు చెందిన డి. మధుసూదన్ నాయక్, ఎం.సత్యవాణి, జె.భవానీ శంకర్, జి.లింగయ్య నాయక్, ఎ. నరసింహా రెడ్డిచ, జి. వీరారెడ్డి, జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్, యు.రఘురామ్ శర్మ, పి.చంద్రయ్య, జి.ముకుంద రెడ్డి, ఎ.భాస్కర్ రావు, 2023 కు చెందిన వై.వి. గణేష్, అబ్దుల్ హమీద్, బి.వెంకటేశ్వర్లు, 2024కు చెందిన ఎన్.ఖీమ్యా నాయక్, కె.గంగాధర్ ఎంపికైన అధికారుల ఎంపిక జాబితాలో ఉన్నారు. కాగా ఈ నియామకాలు రాష్ట్ర హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న రిట్ పిటిషన్ (WP No. 32415/2023) తుది తీర్పుకు లోబడి ఉంటాయని కేంద్రం స్పష్టం చేసింది.




### బొగ్గు టెండర్లలో అవినీతి ఆరోపణపై

# విచారణకు సిద్ధం : పొన్నం

- ఈ విషయంలో ఏ విచారణకైనా కాంగ్రెస్ సిద్ధం
- బీఆర్ఎస్ ఆరోపణల్లో వాస్తవం లేదు

**వుదయం, హైదరాబాద్ బ్యూరో :**

బొగ్గు టెండర్ల విషయంలో బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఆ విషయంలో ఎలాంటి విచారణకైనా తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. దీనిపై విచారణ చేయాలని సీఎంను కోరుతామని చెప్పారు. బుధవారం హైదరాబాద్ లోని దోముల గూడలో పర్యటించిన మంత్రి మీడియాతో మాట్లాడారు. కేంద్ర నిధుల కేటాయింపు విషయంలో తెలంగాణకు జరుగుతోన్న అన్యాయం గురించి మోదీ సర్కార్ ను ప్రశ్నిద్దామంటే ప్రతిపక్ష నేతలెవరూ ముందుకురావడం లేదని ఆరోపించారు. నిధులు రాకుండా తెలంగాణలో అభివృద్ధి పడకేసే పరిస్థితి ఉంటే మౌనపాత్ర పోషిస్తోందన్నారు. కేంద్రాన్ని ప్రశ్నించే దమ్ములేని బీఆర్ఎస్ నేతలు సింగరేణిపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో బలీయశక్తిగా ఎదిగిన కాంగ్రెస్ ను ఒంటరిగా ఎదుర్కొనే దమ్ములేని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కయ్యాయని చెప్పారు. బీజేపీతో కలిసి ఉంటేనే తాము సేఫ్ గా ఉంటామని బీఆర్ఎస్ భావిస్తోందన్నారు. అందుకే కాళేశ్వరంపై సీబీఐ విచారణ చేయించాలని డిమాండ్ చేశారన్నారు. తీరా సీబీఐ



విచారణకు ఇస్తే.. కిషన్ రెడ్డి, హరీష్ రావు కలిసి సింగరేణి అంశాన్ని తెరపైకి తెచ్చారన్నారు. ఇప్పుడు ఈ విషయంపై సీబీఐ ఎంక్వైరీకి డిమాండ్ చేస్తున్నారని మండిపడ్డారు. సింగరేణి కేటాయింపులను తెప్పించి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని హరీష్ రావు, కిషన్ రెడ్డిలకు మంత్రి పొన్నం డిమాండ్ చేశారు. 2014 నుంచి సింగరేణిలో ఇచ్చిన ఒకే ఒక్క కాంట్రాక్ట్ తప్ప మిగతా కాంట్రాక్టులన్నీ అదనంగా ఇచ్చారని నిరూపించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఇందుకు హరీష్ రావు సిద్ధమా? అని మంత్రి పొన్నం సవాల్ చేశారు.

## సింగరేణి అక్రమాలపై దర్యాప్తు జరగాల్సిందే



రాష్ట్రం ముందుకొస్తే కేంద్రం సహకరిస్తుంది : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

5లో..

# ప్రాజెక్టుల స్పీడ్ పెంచండి

- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలి
- ఎస్.ఎల్.బి.సి టన్నెల్ పూర్తికి ప్రత్యేక విభాగం
- తుమ్మిడిహట్టి బ్యారేజ్ డిపిఆర్ తయారీకి వేగవంతంగా సర్వేలు,అధ్యయనం
- కాళేశ్వరం పునరుద్ధరణ డిజైన్లు నెలలోపు పూర్తి
- నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాలకై పర్యావరణ అనుమతులకు ఒత్తిడి పెంచాలి
- పూడిక తీత పనులకు ప్రాధాన్యం
- ఇరిగేషన్ అధికారులకు మంత్రి ఉత్తమ్ దిశానిర్దేశం



**వుదయం, హైదరాబాద్ బ్యూరో :** రాష్ట్రంలో ప్రధాన ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు శరవేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షలు నిర్వహిస్తూ... పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నఎస్ఎల్బీసీ టన్నెల్ పనులను కొనసాగించడానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రమాదవశాత్తు జరిగిన ఘటనలో టన్నెల్ లో చిక్కుకున్న టన్నెల్ బోరింగ్ మెషీన్ శకలాలను పూర్తిగా తొలగించామన్న ఆయన ప్రస్తుతం టన్నెల్ లో రైలు ట్రాక్ సహాయంతో మరమ్మతులు

మిగతా 2లో..



## ఘనంగా ఎంవీ కృష్ణారావు శత జయంతి



అవనిగడ్డ జనవరి21(వుదయం ప్రతినిధి): దివిసీమ గాంధీ, ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం అవనిగడ్డలోని వంతెన సెంటరులో కృష్ణారావు విగ్రహానికి నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, శత జయంతి కమిటీ ప్రతిని ధులు, గాంధీ క్షేత్రం సభ్యులు, మండలి అభి మానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, కోడూరు మండల జనసేన నాయకులు రెడ్రౌతు కృష్ణబాబు, గాంధీ క్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, ప్రముఖ న్యాయవాది బొప్పన వెంకట సుబ్రహ్మణ్యేశ్వ రరావు, సొసైటీ చైర్మన్ యర్రంశెట్టి సుబ్బా రావు, గాంధేయవాది గరికపాటి సీతారా మయ్య, దివిసీమ లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్, కూటమి నాయకులు బండే రాఘవ, మురాద్, హరిబా బు, బడే సుబ్బారావు, మండలి రామ్మోహన రావు, మెగావత్ గోపి, గుగ్గిలం శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ దాతృత్వం



ఆత్మకూరు (వుదయం ప్రతినిధి) జనవరి 21 తేదీఆత్మకూరు పట్టణంలో శ్రీ నిత్యన్న దాత, శ్రీ కంచి పరమేశ్వర రెడ్డి గారు చేసిన దాతృత్వం చాటారు. పలు వార్డుల్లో పలువురు చనిపోగా ఆ కుటుంబాలను ప్రత్యక్షంగా పరా మర్శించిన నిత్యాన్నదాత, శ్రీ కంచి పరమేశ్వర రెడ్డి ఒక్కొక్కరికి రూ.10,000 వంతున మొత్తం రూ.60,000 దాతృత్వం చేశారు. ఈ సందర్భంగా శ్రీ కంచి పరమేశ్వర రెడ్డి మీ కుటుంబాలకు నేనెప్పుడూ అండగా ఉంటానని భరోసా కల్పించాడు. లబ్ధి పొందిన కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఈనాడు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎందరో మాలాంటి పేదవారి ఆకలిని తీరుస్తూ బస్టాండ్, నెల్లూరు పాలెం మరియు హాస్పిటల్ ఎదురుగా మంచినీరు మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేసి ఎంతోమంది దాహార్తిని తీరుస్తూ ఈనాడు మా కుటుంబ సభ్యులు మరణిస్తే మాకు రూ.10,000 దాతృత్వం చేసిన నిత్య న్నదాత శ్రీ కంచి పరమేశ్వర రెడ్డి గారికి తమ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



## సంక్రాంతి కెమెరా విన్నర్ నాగార్జునకు ఆత్మీయ సత్కారం



అవనిగడ్డ జనవరి21(వుదయం ప్రతినిధి): సంక్రాంతి పండగ సందర్భంగా మచిలీపట్నం వేద డిజిటల్స్ ఆధ్వర్యంలో నిర్వ హించిన లక్కీ డ్రాలో మొదటి బహుమతిగా నికాన్ జెడ్.సిక్స్.టు కెమెరాను గెలుచుకున్న దివి ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యుడు, శ్రీదుర్గ డిజిటల్ స్టూడియో అధినేత వడుగు నాగార్జునకు దివి ఫోటోగ్రాఫర్స్ అసోసియే షన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు రూ.1 లక్ష 70 వేల విలువైన ఈ కెమెరా నాగార్జునకు లభించిన సందర్భంగా అవనిగడ్డలోని రెవిన్యూ హాలులో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేద డిజిటల్స్ అధినేత ప్రసాద్ హాజరై కార్యక్ర మాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా కెమెరా పితామహుడు లూయిస్ డాగూరే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దివి ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తద నంతరం నాగార్జునకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో దివి ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్అ ధ్యక్షులు అంజంతా శ్రీనివా సరావు, సీనియర్ ఫోటోగ్రాఫర్లు లతా మోహన్, శంకర్, వీనస్ రాజారావు, రత్నానంద్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ సంస్థాగత కమిటీల ఏర్పాటుపై సమావేశం




ఆత్మకూరు ఉదయం ప్రతినిధి జనవరి 21వ తేదీ ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మకూరు పార్టీ కార్యాలయంలో మంగళవారం నియో జకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతి థులుగా నెల్లూరు జిల్లా వైఎస్సార్ సీపీ పార్టీ అధ్యక్షుడు కాకాని గోవర్ధన్ రెడ్డి , తిరుపతి పార్లమెంటు సభ్యుడు, నెల్లూరు జిల్లా పార్టీ టాస్క్ ఫోర్స్ కమిటీల సభ్యుడు మద్దెల గురుమూర్తి, పార్లమెంటు పార్టీ పరిశీలకులు జంకె వెంకటరెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు పేర్నాటి కోటేశ్వర రెడ్డి, తది తరులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో పార్టీ కమిటీలు ఏర్పాటు అయ్యాయని, ప్రస్తుతం గ్రామాల స్థాయిలో ఏర్పాటు అవుతు న్నట్లు, ఉత్సాహంగా పనిచేసే వారిని ఎన్నుకో వాలని ఆయన కోరారు. పార్టీ కష్టకాలంలో జెండామోసే వారందరికి భవిష్యత్తో వైఎస్ జగ న్మోహన్ రెడ్డి తగువైన గుర్తింపునిస్తారన్నారు. సంగం, నెల్లూరు బ్యారేజీలు వైఎస్సార్సీపీ హయాంలో పూర్తి చేసి సంగం బ్యారేజీకి మేకపాటి గౌతమ్రెడ్డి పెడితే ఓర్వలేని కూటమి నాయకులు ఆ పేరు తొలగించడం దారుణమ న్నారు. ప్రస్తుతం పార్టీ నాయకులు, కార్యకర్త లపై ఎన్ని కేసులు పెట్టినా, ఎంత వేధించినా ఆ వ్యక్తులను, అధికారులను మా డిజిటల్ బుక్ నమోదు చేస్తున్నట్లు వారిని వదిలే ప్రసక్తేలేదని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైఎస్ఆర్సిపి నాయకులు ఆత్మకూర్ నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ నాయకులు కార్య కర్తలు పాల్గొన్నారు.



## హిందూయిజంపై బీజేపీ,ఆర్ఎస్ఎస్ మోసం బహిర్గతం

**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ ధ్వజం**

కడప, జనవరి 21, (వుదయం ప్రతినిధి) హిందువులు, హిందూ మతం, హిందూ సంస్కృతి, సంప్రదాయం పట్ల రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, భారతీయ జనతా పార్టీ మోసం బహిర్గతమైందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ ఆరోపించారు. ఇటీవల శంకరాచార్యుల పట్ల ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సంయుక్తంగా చేసిన అమానుషం ప్రతి భారతీయుడిని కలచి వేసిందన్నారు. కడపలోని తన కార్యాల యంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు రోజుల కిందట ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగరాజ్ లో సంగం పవిత్ర నదిలో మౌని అమావాస్య సందర్భంగా పవిత్ర స్నానానికి వెళుతున్న అవిముక్తేశ్వరా నంద్ సరస్వతి శంకరాచార్యుల వారిని ఉద్దేశ పూర్వకంగా సీఎం యోగి అధికారుల ద్వారా అడ్డగించారన్నారు. అంతేకాకుండా శంకరా చార్యుల వారిని పల్లకి దిగి వెళ్లాల్సిందిగా పోలీసులు ఆదేశించ డాన్ని తప్పుపట్టారు. పల్లకిలో సంగం వద్దకు వెళుతున్న పీఠాధిపతి పట్ల పోలీసులు అరాచకంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అట్లూరు మండల అధ్యక్షుడు శీలం గంగయ్య, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మయాన రహమతుల్లా ఖాన్, 23వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆబిద్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎస్. హమీద్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి కమల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## మెగా రక్తదాన శిబిరం

ఆత్మకూరు (వుదయం ప్రతినిధి) జనవరి 21 తేదీనెల్లూరు విద్యుత్ శాఖ కార్యాలయ సూపరిడెంట్ ఇంజనీర్ కె రాఘవేంద్రరావు మరియు ఆత్మకూరు డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. భాను నాయక్ ఆధ్వర్యంలో ఆత్మకూరు విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయ పరిధిలోని ఆత్మకూరు, కలిగిరి, ఉదయగిరి సబ్ డివిజన్ అధికారులు ఏడిఇ, ఏఈలు, విద్యుత్ శాఖ సిబ్బంది సౌజన్యంతో ఇండియన్ రెడ్ క్రాస్ వారి సహకారంతో ఆత్మకూర్ డివిజన్ కార్యాలయంలో బుధవారం ఉచిత స్వచ్ఛంద మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నాము. ఈ రక్తదానా నికి కార్యాలయ పరిధిలో ఉద్యోగస్తుల తో పాటు పట్టణ ఖాతాదారులు ప్రజలు కూడా స్వచ్ఛందంగా రక్తదానం చేయవలసిందిగా కోరడమైనది. రక్తదానం ప్రాణదానం తో సమానం అని ఆయన తెలియజేశారు.

# పథకాలను పారదర్శకంగా అమలు చేయండి

- ఆంధ్రప్రదేశ్ శాసనసభ కమిటీ చైర్మన్ గౌరు చరితారెడ్డి
- వివిధ సంక్షేమ పథకాల పురోగతి పై అధికారులతో సమీక్ష సమావేశం




తిరుపతి, జనవరి 21, వుదయంప్రతినిధి: మహిళలు, పిల్లలు, వికలాంగులు మరియు వృద్ధుల సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ పలు కీలక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు సక్రమంగా చేరేలా అధికారులు బాధ్యతాయు తంగా పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ మహిళలు, పిల్లలు, వికలాంగులు , వృద్ధుల సంక్షేమ కమిటీ చైర్మన్ గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా సచివాలయం లోని సమావేశ మందిరంలో జిల్లాలో మహిళలు, పిల్లలు, వికలాంగులు , వృద్ధుల సంక్షేమంపై అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల పురోగతి పై శాసన సభ డిప్యూటీ సెక్రటరీ ఆర్ వనిత రాణి, జిల్లా కలెక్టర్. డా వెంకటేశ్వర్, కమిటీ సభ్యులతో కలసి చైర్మన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావే శంలో జిల్లా అధికారులు ఆయా శాఖల ద్వారా అమలవుతున్న పథకాల వివరాలను కమిటీకి సమర్పించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షే మానికి పెద్దపీట వేస్తూ స్వయం సహాయక సంఘాల బలోపేతం, ఆర్థిక స్వావలంబన కార్యక్రమాలు, మహిళల భద్రత, పోషణ పథకాలు, గర్భిణీ మహిళలు మరియు బాలిం తలకు అందుతున్న వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. మహిళలపై జరుగు తున్న హింస నివారణకు తీసుకుంటున్న చర్యలను మరింత ప్రభావవంతంగా అమలు చేయాలని సూచించారు. పిల్లల సంక్షేమంలో భాగంగా బాలల హక్కుల పరిరక్షణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల సంరక్షణ గృహాల నిర్వహణ, విద్యా–ఆరోగ్య సేవల నాణ్యత పై అధికారులను అడిగి తెలుసుకు న్నారు. ప్రతి బాలుడు విద్య, ఆరోగ్యం పొందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవే క్షణ పెంచాలని కమిటీ ఆదేశించింది.

### ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

వికలాంగుల సంక్షేమానికి సంబంధించి దివ్యాంగుల పింఛన్లు, ఉపకర ణాల పంపిణీ, విద్యా మరియు ఉపాధి అవకా శాలు, ప్రభుత్వ భవనాలు దివ్యాంగులకు అను కూలంగా ఉండేలా సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. వికలాంగుల సమస్యల పరిష్కా రంలో ఆలస్యం జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. వృద్ధుల సంక్షే మానికి సంబంధించి వృద్ధాప్య పింఛన్లు, ఆరోగ్య సేవలు, వృద్ధాశ్రమాల నిర్వహణ, సామాజిక భద్రతా చర్యల అమలుపై కమిటీ సభ్యులు అధికారులతో చర్చించారు. వృద్ధుల పట్ల గౌరవం, సంరక్షణతో కూడిన సేవలు అందేలా చర్యలు మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను పారదర్శకతతో సమర్థవంతంగా అమలు చేస్తూ లబ్ధిదారులకు సకాలంలో ప్రయోజ నాలు అందేలా జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత చురుకుగా నిర్వహించాలని ఆదేశించారు. ఈసమావేశంలో శాసనసభ కమిటీ సభ్యులు పల్లె సింధూర రెడ్డి, లోకం నాగమాధవి, వరపుల సత్యప్రభ, నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీలు కావలి గ్రీష్మ రెడ్డి, కల్పలత, మధు సూదన్, డిఆర్ఓ జి నర్సింహులు, వికలాం గుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి. వినోద్ కుమార్, ఐసిడిఎస్ అధికారిని వసంత బాయి, సోషల్ వెల్ఫేర్ డిడి విక్రమ్ కుమార్ రెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి రాజా సోము, బీసీ వెల్ఫేర్ డిడి భరత్ కుమార్ రెడ్డి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి చెన్నారెడ్డి, డిఆర్డిఏ పిడి ప్రభావతి, మెప్మా పిడి ఇఫ్రామ్, సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య వ్యవస్థకు బీజేపీ ముప్పు

**సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ**

ఆత్మకూరు (వుదయం ప్రతినిధి) జనవరి 21వ తేదీవామపక్షాలే దేశానికి భవిష్యత్తు అని, ఐక్యతతోనే మతోన్మాదశక్తులను తిప్పికొ ట్టగలమని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ అన్నారు. వామపక్షాలు ఐక్యంగా ఉంటే దేశంలో మూడో అతిపెద్దశక్తిగా ఎదగగలవని పేర్కొన్నారు. మతోన్మాద శక్తులను అడ్డుకోవ డానికి, ప్రజాసమస్యలపై పోరాటానికి ఐక్యత అవసరం అని తెలిపారు. హిందుత్వ శక్తుల పెరుగుదల, మతతత్వ రాజకీయాలను ఎదు ర్కోవడం కమ్యూనిస్టులకు ప్రధాన సవాల్‌గా మారిందన్నారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపులో భాగంగా ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్‌లో మంగళవారం జరిగిన 'నేటి భారత దేశం–వామపక్షాల ముందున్న సవాళ్లు' అంశంపై సెమినార్‌లో బేబీ ప్రసంగించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్‌లో సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ ప్రధాన కార్యదర్శి దేవరాజన్, తెలంగాణ ఉపముఖ్య మంత్రి మల్లు భట్టివిక్రమార్క తదితరులు ప్రసంగించారు.

**దేశ సంపద కార్పొరేట్లకు ధారాదత్తం : దీపాంకర్**

దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్నారని, బిజెపి ప్రభుత్వం అంబాని, అదాని లాంటి కార్పొరేట్ ప్రయోజ నాల కోసమే పని చేస్తోందని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య విమర్శించారు.

**మారని, మాసిపోని సిద్దాంతం కమ్యూనిజం : దేవరాజన్**

మారని, మాసిపోని సిద్ధాంతం కమ్యూని జమని, మారుతున్న కాలానికి అనుగుణంగా పనిచేయడం ద్వారా అద్భుత విజయాలను సాధించవచ్చని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి జి.దేవరాజన్ తెలిపారు. పెరిగిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వామప క్షాలు సద్వినియోగం చేసుకోవాలని, వామప క్షాలన్నీ కేంద్రీకృతమై ఒక అజెండాతో పనిచేస్తే సత్ఫలితాలు వస్తాయని అన్నారు. సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి ఆహుతులను వేదికపైకి ఆహ్వానించారు. సెమినార్లో సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు అమర్ జిత్ కౌర్, గిరీష్ శర్మ, రామ కృష్ణపాండే, సంజరు కుమార్, కె.ప్రకాష్ బాబు, పల్లవ్‌సేన్ గుప్తా, కె.రామకృష్ణ తదిత రులు పాల్గొన్నారు.



## రూరల్ ఎస్ఐగా కె. శ్రీకాంత్ బాధ్యతలు

ప్రొద్దుటూరు, జనవరి 21, (వుదయం ప్రతినిధి) ప్రొద్దుటూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ–1గా, ఎస్.ఐ కె. శ్రీకాంత్ బాధ్యతలు స్వీకరిం చారు. ఇప్పటివరకు విధులు నిర్వహిం చిన బి. అరుణ్ రెడ్డి స్థానంలో ఆయన నియమితులయ్యారు. గతంలో బద్వేలు గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో సమర్థవంత మైన సేవలందించి ప్రత్యేక గుర్తింపు పొందిన ఎస్ఐ శ్రీకాంత్. ప్రొద్దుటూరు రూరల్ పరిధిలోని శాంతి భద్రతల పరిర క్షణకు తన వంతు కృషి చేసి ఉత్తమ సేవలు అందిస్తానని తెలిపారు.

## క్రీడాకారుడు సాయి కిరణ్‌కు డాక్టర్ ప్రణీత్ ప్రోత్సాహం



ఆత్మకూరు (వుదయం ప్రతినిధి) జనవరి 21 తేదీ ఆత్మకూరు మున్సిపాలిటీకి చెందిన యువ క్రీడాకారుడు సాయి కిరణ్ జాతీయస్థా యిపోటీలకు ఎంపికై, వాటిలో పాల్గొనడానికి వెళ్లుతున్న సందర్భంగా గౌరవనీయులు డాక్టర్ ప్రణీత్ ప్రశంసనీయమైన ఆర్థిక సహాయం అందజేశారు. జాతీయస్థాయి పోటీలకు సంబంధించిన పాల్గొనడం ఫీజు మరియు ప్రయాణ ఖర్చుల నిమిత్తం ముందుకు వచ్చి సహాయం చేయడం ద్వారా, యువతలోని క్రీడా ప్రతిభకు అండగా నిలిచే నాయకుడిగా డాక్టర్ ప్రణీత్ థ మరోసారి తన బాధ్యతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రణీత్ సాయి కిరణ్‌ను హృదయపూ ర్వకంగా అభినందిస్తూ, జాతీయస్థాయి పోటీల్లో విజయం సాధించి ఆత్మకూరు ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలి అని ఆకాంక్షించారు. ఈ ఆర్థిక సహాయం డాక్టర్ వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా అందజేయడం జరిగింది.

## దశదినకర్మకు హాజరైన మాజీ ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి



ఆత్మకూర్ రూరల్ మర్రిపాడు, వుదయం ప్రతినిధి జనవరి 21వ తేదీ మర్రిపాడు మండలం డీసీపల్లి గ్రామంలో వైస్సార్సీపీ జిల్లా యాక్టివిస్ట్ కార్యదర్శి శ్రీ చిట్టెం శ్రీనివాసులు తండ్రి చిట్టెం సుబ్బయ్య పెద్ద కర్మ కార్యక్రమా నికి హాజరై అయన చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న .ఆత్మకూరు మాజీ శాసనసభ్యులు శ్రీ మేకపాటి విక్రమ్ రెడ్డి. మర్రిపాడు మండల వైఎస్ఆర్సిపీ నాయకులు కార్యకర్తలు



## శివాలయంలో శివలీలలు హరికథ

ప్రొద్దుటూరు, జనవరి 21, (వుదయం ప్రతినిధి) పట్టణ నడిబొడ్డులో ఉన్న అగస్త్యేశ్వర ఆలయంలో జరుగు తున్న హరికథ సప్తాహములో భాగంగా నాలుగవ రోజు ఆలయ ఈవో మరియు సహాయ కమిషనర్ జే వెంకట సుబ్బయ్య, ఆలయ చైర్మన్ వంగల నారాయణ రెడ్డి, పాలక మండలి సభ్యుల ఆధ్వర్యంలో జరు గుతున్న శ్రీ అన్నమాచార్య కళాపీఠం నాయిని లక్ష్మీకుమారి భాగవతారని వారిచే యడవల్లి రమణయ్య భాగవతర్ వారి సహకారంతో శివ లీలలు హరికథ గానం ఘనంగా నిర్వహించారు. అనంతరం లక్ష్మీ కుమారిని ఘనంగా సత్కరించారు.

## ఎంఆర్ఐ స్కాన్, సిటీ స్కాన్ సేవలు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటు లోకి తేవాలి



ప్రొద్దుటూరు, జనవరి 21, (వుదయం ప్రతినిధి) ఎంఆర్ఐ స్కాన్ సిటీ స్కాన్ సేవలు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటు లోకి తేవాలని ఎంపీజే పట్టణాధ్యక్షులు హుస్సేన్ భాష కోరారు. బుధవారం ఈ విషయమై వారు జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సుజా తకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పేద మధ్యతరగతి ప్రజల వైద్యం కోసం ఏర్పాటుచేసిన జిల్లా ప్రభుత్వాసుప త్రిలో సిటీ స్కాన్ ఎంఆర్ఐ స్కాన్ సేవలు అందుబాటులో లేని కారణంగా ప్రైవేటు స్కానింగ్ సెంటర్లో గానీ లేదంటే కడప కర్నూల్ తిరుపతి ప్రాంతాలకు ప్రిఫర్ చేస్తు న్నారని వివరించారు కావున ఇకనైనా పేద ప్రజల తరఫున ఆలోచించి సిటి స్కాన్ ఎంఆర్ఐ స్కాన్ సేవలు జిల్లా ప్రభుత్వాసుప త్రిలో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్య క్రమంలో ఎంపీజే పట్టణ కార్యదర్శి రఫిక్ అల్లా బకాష్ తదితరులు పాల్గొన్నారు.

## రాణి తిరుమల దేవి డిగ్రీ కాలేజీలో శుక్రవారం మెగా జాబ్ మేళా

ప్రొద్దుటూరు, జనవరి 21, (వుదయం ప్రతినిధి) స్థానిక మైదుకూరు రోడ్డు లోని రాణి తిరుమల దేవి కాలేజ్ ఆఫ్ సైన్సెస్ మైదుకూరు రోడ్ లో ఈనెల 23 శుక్రవారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వారి సహకా రంతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ టీ. చంద్రశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో డోనా ఐటి సొల్యూషన్స్, జోయా లక్కస్ ఇండియా లిమిటెడ్, టాటా ఎలక్ట్రా నిక్స్, ఇన్నోవా సోర్స్ ప్రైవేట్ లిమిటెడ్, కియా ఇండియా, ఆల్ డిక్సన్ యంగ్ ఇండియా,ఏవి స్మాల్ ఫైనాన్స్, శ్రీరామ్ ఫైనాన్స్ లైఫ్ ఇన్సూరెన్స్ బ్యాంక్ మొదల గు అనేక సంస్థలు పాల్గొని తమ కావల సిన ఉద్యోగులను ఎంపిక చేసుకుంటారని వివరించారు వివరించారు. కావున ప్రొద్దుటూరు మరియు పరిసర ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవ కాశాన్ని వినియోగించుకోవాలని సూ చించారు. మరిన్ని వివరాల కొరకు స్కిల్ డెవలప్మెంట్ కో–ఆర్డినేటర్– దినేష్ ని 95 816 70585 ద్వారా సంప్రదించా లని తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డిని పరామర్శించిన ప్రముఖులు



కావలి, జనవరి 21, వుదయం న్యూస్: కావలి మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి చికిత్స అనంతరం కావలికి చేరుకోగా పలువురు ప్రముఖులు ఆయనను బుధవారం పరామర్శించారు. బెంగళూరు లో ఇటీవల హార్ట్ ఆపరేషన్ చేయించుకోవడం జరిగింది. కొద్దిరోజులు బెంగుళూరు నందు విశ్రాంతి తీసుకొని తదు పరి కావలి తన నివాసానికి విచ్చేశారు. కావలి మాజీ శాసనసభ్యులు మరియు నియోజకవర్గ ఇన్చార్జ్ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి రాకను తెలుసుకున్న మాజీ మంత్రివర్యులు సర్వేపల్లి మాజీ శాసనసభ్యులు, జిల్లా వైసీపీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, మాజీ మంత్రివర్యులు కోవూరు మాజీ శాసనసభ్యులు నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి, మాజీ డి.సి.యం.ఎస్ చైర్మన్, వైసిపి నాయకులు వీరి చలపతి, మరియు కావలి నియోజకవర్గం లోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగ క్షేమాలు, ఆరోగ్యం స్థితిగ తులు తెలుసుకున్నారు.

## నమ్మకంతో నిర్మాణం.. నాణ్యతతో అభివృద్ధి

- తులసి ఇన్ఫ్రా – కోహినూర్ హై రైట్స్ సంయుక్తంగా డైరీ ఆవిష్కరణ
- బృందావనం టౌన్‌షిప్ లేఅవుట్ బ్రోచర్ విడుదల



కడప/ఉప్పల్ 21, (వుదయం ప్రతినిధి) నమ్మకాన్ని నిర్మాణంగా నాణ్యత అభివృద్ధికి చిహ్నంగా రియల్ ఎస్టేట్ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ఆశ్రయాలు శ్రమిస్తామని సంస్థ ఎండి పాప గారి సురేష్ తులసి పేర్కొన్నారు. బుధవారం ఉప్పల్ బాగాయత్ లేఅవుట్‌లోని తులసి ఇన్ఫ్రా – కోహినూర్ హై రైట్స్ ప్రాజెక్ట్ కార్యాలయంలో ఇన్ఫ్రా ప్రాజెక్ట్, కోహినూర్ హై రైట్స్ ప్రాజెక్టుల సంయుక్తంగా డైరీ అవి ష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవిష్కరించిన డైరీలను కార్యాలయ సిబ్బంది, రియల్ ఎస్టేట్ ఏజెంట్లకు పంపిణీ చేశారు. అనంతరం యాదాద్రి జిల్లా నెమిలలో అభివృద్ధి చేస్తున్న 'బృందావనం టౌన్‌షిప్' వెంచర్‌కు సంబం ధించిన లేఅవుట్ బ్రోచర్‌ను కూడా విడుదల చేశారు. కార్యక్రమంలో సంస్థ ఎండీ పాపగారి సురేష్ మాట్లాడుతూ, రియల్ ఎస్టేట్ రంగంలో నమ్మకం, నాణ్యతే పునాదిగా అభివృద్ధి కొనసాగాలని తెలిపారు. అలాగే రానున్న 2026వ సంవత్సరం ప్రతి ఒక్కరికీ అనుకున్న విధంగా అనుకూల పరిస్థితులు సాగాలని ఆకాంక్షించారు. మేనేజింగ్ పార్ట్నర్ అశ్వర్ మాట్లాడుతూ, సంస్థ చేపడుతున్న ప్రతి ప్రాజెక్టును ప్రణాళికాబద్ధంగా, కస్టమర్ నమ్మకాన్ని దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో భరత్, మహేష్ రాజు, సుచరిత, హరి, ప్రియాంక తదితర సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

మున్సిపల్ కమిషనర్, ఉద్యోగులతో

## పని చేయించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేదే

**మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి**



ప్రొద్దుటూరు, జనవరి 21, (వుదయం ప్రతినిధి) మున్సిపల్ కమిషనర్, ఉద్యోగులతో పనిచేయించాల్సిన బాధ్యత ఎమ్మెల్యే దే అని మున్సిపల్ మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం లోని చైర్మన్ చాంబర్ లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మున్సిపాలిటీ లో కమిషనర్ నుంచి అటెండర్ వరకు ఉద్యో గులంతా ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తీసుకువ చ్చిన వారేనని, ఆ ఉద్యోగులతో పని చేయిం చాల్సిన పూర్తి బాధ్యత ఎమ్మెల్యే దేనని వివరిం చారు. పని చేయని ఉద్యోగులనుఎందుకు ఇంకా కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. ప్రొద్దుటూరుకు రావడానికే ఉద్యోగులు భయ పడుతున్న పరిస్థితి ఉందని తెలిపారు. మున్సిపల్ ఉద్యోగుల ప్రక్షాళన మొదలు పెట్టాల్సిన పక్షంలో ఎమ్మెల్యే వరదరాలరెడ్డి అనునాయల నుండే మొదలుపెట్టాలని తెలిపారు. ఓ మున్సిపల్ శానిటేషన్ వర్కర్ మున్సిపాలిటీలో జీతం తీసుకుంటూ విధులు మాత్రం ఎమ్మెల్యే వద్ద నిర్వహిస్తున్నారని అదే విధంగా ఎమ్మెల్యే పిఏ మున్సిపాలిటీ ప్రభుత్వం నుండి జీతాలు తీసుకుంటూ పనులు మాత్రం ఎవరి వద్ద చేస్తున్నది తెలియదా అని ప్రశ్నించారు. ఇంకో అధికార పార్టీ నాయకుడు కమిషనర్ కు వాహనం ఏర్పాటు చేసి డీజిల్ డ్రైవర్ను ఏర్పాటు చేయకుండా మున్సిపాలిటీపై భారం వేస్తున్నా రని విమర్శించారు. పెట్రోల్ బంకులో అవినీ తికి పాల్పడిన ఉద్యోగిని ఎమ్మెల్యే పదేపదే సస్పెండ్ చేయాలని పేర్కొనడం సరికాదని, అతను ఎవరెవరికి అయితే అప్పుగా ఇచ్చాడో వారిని పిలిపించి కొంత సమయం ఇచ్చి ఆ కోటి 20 లక్షల రూపాయల మొత్తం రికవరీ చేసి అతనిని సస్పెండ్ చేయాలని స్పష్టం చేశారు.

## చిట్టబ్బాయికి ఎమ్మెల్యేమండలి బుద్ధప్రసాద్ ఘననివాళి

**పలువురికి బుద్ధప్రసాద్ పరామర్శ**



అవనిగడ్డ జనవరి21 (వుదయం ప్రతినిధి): అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ బుధవారం సాయంత్రం మోపిదేవి మండలం మెరకనపల్లి గ్రామంలో పలువురిని పరామర్శించారు. చల్లపల్లి మండల మాజీ జెడ్పిటిసి సభ్యులు ముత్యాల వెంకటరత్నం (చిట్టబ్బాయి) భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. చిట్టబ్బాయి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిట్టబ్బాయి సోదరుడు, గ్రామ ప్రముఖులు ముత్యాల వెంక టరామయ్యను పరామర్శించారు. అనంతరం గ్రామంలో స్వర్గీయ సీపీఎం నాయకుడు శోభిల కోటేశ్వరరావు భార్య శోభిల సీతామ హాలక్ష్మి మృతి చెందగా, ఆమె కుమారుడు శివ నాగ మల్లేశ్వరరావును, కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట కూటమి నాయకులు ఉన్నారు.

## ఆర్థిక సాయం అందజేత



విజయవాడ జనవరి 21 వుదయం న్యూస్ బ్యూరో:– ఉయ్యూరు టౌన్ కు చెందిన అరెళ్ల శ్రీనివాసరావు తల్లి ఇటీవల మరణించడం తో ఈరోజు ఆమె పెద్దకర్మ కార్యక్రమం లో పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించి, వారి కుటుంబసభ్యులకు రూ.10,000 రూపాయల ఆర్థిక సాయన్ని అందించారు. ఈ మొత్తాన్ని ఉయ్యూరు టౌన్ కు చెందిన వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అందించారు.

## ఊరు పొమ్మంటుంది.. కాడు రమ్మంటుంది

- కంప సముద్రంలో కిడ్నీ బాధితులు
- స్పందించిన మంత్రి ఆనం



ఆత్మకూర్ రూరల్ మర్రిపాడు ఉదయం ప్రతినిధి జనవరి 21 తేదీ ఆత్మకూరు నియోజకవర్గం మర్రిపాడు మండలం కంపసముద్రం గ్రామం ఎస్సీ కాలనీలో గత సంవత్సరము నుండి కిడ్నీ బాధితులు ఎక్కువ య్యారని ఎన్ని హాస్పిటల్లో తిరిగిన బాగు కావ ట్లేదని ఈ విషయమై ఊరు ఊరు వణికి పోతుందని మా మొర ఆలకించి మా సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి రామనారాయణరెడ్డి దృష్టికి ఊరు ప్రజలు తీసుకొని పోగా ఈ విషయమై స్పందించిన మంత్రివర్యులు కంపసముద్రం ప్రజలకు మంత్రివర్యులు ధైర్యం చెబుతూ ఆ సమస్యని ఎలా పరిష్కరించాలో నేను చూసు కుంటాను మీరంద రూ ధైర్యంగా ఉండండి మీకు ఎలాంటి ఇబ్బంది జరగదు నేను ఉన్నాను అని వాళ్లకు ఒక భరోసా ఇచ్చారు. వెంటనే జిల్లా డిఎంహెచ్వో కి ఫోన్ చేసి మర్రిపాడు మండలం కంపసముద్రం గ్రామం ఎస్సీ కాలనీలో కిడ్నీ బాధితులు ఎక్కువగా ఉన్నారని డాక్టర్లు పర్యవేక్షించి ఇంటింటికీ టెస్టులు చేయించి అక్కడ పరిస్థితులు ఏమిటి ఆహారం లోపమా లేక నీళ్లలోపమా ఏ విషయ మైనా తేల్చి వెంటనే ఆ బాధితులకు ట్రీట్మెంట్ ఇవ్వాలని వాళ్లకి ధైర్యం కల్పించాలని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశించడం జరిగింది. వెంటనే స్పందించిన డిఎంహెచ్వో మెడికల్ సిబ్బంది ఊరిని సందర్శించి ఎస్సీ కాలనీలో ప్రజలకు ధైర్యం చెబుతూ వాళ్ళ యొక్క బాగోగులు చూసుకుంటూ టెస్టులు చేస్తున్నారు టెస్టులు తదుపరి ఏ కారణం చేతవ్యాధి వస్తుందో తేల్చి వైద్యం చేస్తామని మెడికల్ సిబ్బంది తెలియజేశారు.

## అధికారులు వచ్చి.. సర్వే చేసినా ఫలితం శూన్యం

- జిల్లాలు మారుతున్న బీసీ కాలనీ సర్వే ఎందుకు నిర్లక్ష్యం
- పోలవరం ప్యాకేజి నిమితం భూ సర్వే నెంబర్లు ఎంక్వైరి చేశారు నో ట్రాక్టర్ సర్వే

వీఆర్ పురం జనవరి 21 వుదయం న్యూస్ : పోలవరం జిల్లా వి ఆర్ పురం మండలం బీసీ కాలనీ ప్రజల గోడు పోలవరం సర్వే నిమితం ఏ అధికారి కూడా పట్టించుకన్నా దాఖలాలు కనబడటం లేదు అంటున్న బి సి కాలనీ పోలవరం ప్యాకేజి బాధితులు. అసలు ట్రక్చర్ సర్వే ఎందుకు జరపడం లేదు కారణం ఏంటీ ఐటీడీఏ అధికారులను ఎన్నో సారు ఈ కాలనీ వాసులు కలిసి మాగోడు వివరించాము అయిన ఎదో ఒకటి చెప్పి 3 రోజుల్లో లేక 5 రోజుల్లో సర్వే వారు వస్తారు లెజిబుల్ అయినఅందరికి సర్వే చేస్తారని ఐ టీడీఏ పిఓ చెప్పారు. ఇలా చెప్పి నెలలు, సంవ త్సరాలు గడిసిన ఏమాత్రం స్పందన లేదు .24/12/2025 న ఎస్ టి సి,మరి కొంత మంది సర్వే అధికారులు బి సి కాలనీ వచ్చి అప్పటిలో ఇరిగేషన్ డిపార్ట్మెంట్ వారు వేసిన సర్వే రాళ్లను వెతికారు అలాగే లేండ్ సర్వే నెంబర్లు తనిఖీ చేశారు. బిసి కాలనీ విధులు రోడ్లు అన్ని పరిశీలించి చివరిగా వారం రోజుల్లో ట్రక్చర్ సర్వే వారు వస్తారని బి సి కాలనీ ప్రజలకు భరోసా ఇచ్చారు అప్పటి నుండి ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదు. సర్వేకు అప్రువల్ లో ఉన్న మా ఇళ్ల ఎందుకు సర్వే చేయటం లేదు.111 ఇల్లు సర్వేలో ఉన్నాయి అని చెప్పారు ఎందుకు చెయ్యటం లేదు. బీసీ కాలనీ ప్రజలను ఏంచెయ్యాలనుకుం టున్నారు. దయచేసి పోలవరం సర్వే కు సంబంధిత అధికారుల జవాబు చెప్పాలని బి సి కాలనీ ప్రజలు కోరుతున్నారు.





# సంపన్న వర్గాల పైనే మోడీ ప్రేమ

- మతోన్మాద వ్యతిరేక శక్తులను కూడగడతాం
- మోడీ పాలనలో సంక్లిష్ట స్థితికి దేశం
- ట్రంప్స్ సామ్రాజ్యవాద ధోరణి
- కేరళను కాపాడుకుంటాం – బలాన్ని పెంచుకుంటాం
- సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా

**ఖమ్మంవుదయం బ్యూరో** మోడీకి ఈ దేశంలో రైతులు, కార్మికుల గురించి పట్టదని ఆయన ప్రేమంతా సంపన్న వర్గాలపైనేనని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా తెలిపారు. ట్రంప్ సామ్రాజ్యవాద ధోరణితో వ్యవహరిస్తున్నా కనీసం ఖండించలేని స్థితిలో భారత ప్రధాని మోడీ ఉన్నారని ఆయన తెలిపారు. సిపిఐ జాతీయ కౌన్సిల్ సమావే శాలు ముగిసిన తర్వాత ఖమ్మంలో జరిగిన మీడియా సమావేశంలో రాజా మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయని పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై ప్రదర్శనను, బహిరంగ సభను విజయవంతం చేశార న్నారు. ఈ ఉత్సవాలకు వేదికగా నిలిచిన ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్టీకి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సిపిఐ శాఖలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ట్రంప్ సామ్రాజ్యవాద ధోరణితో వ్యవహరిస్తూ అత్యంత ప్రమాదకారిగా మారుతున్నారని ఈ సమయంలో వెనుజులాకు తాము మద్దతుగా నిలుస్తున్నామన్నారు. వెనుజులాపై దాడి కేవలం ఆయిల్ సంపద కోసమేనని ఆయన స్పష్టం చేశారు. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేయవద్దని భారత్పై ఒత్తిడి తీసుకు వస్తున్నా మోడీ స్పందించడం లేదని నోరు మెదిపే సాహసం కూడా చేయలేకపోతు న్నారని రాజా ఆరోపించారు. పాలస్తీనా, వెనుజులాలకు అంతర్జాతీయ మద్దతు పెరుగుతుందన్నారు.

భారతదేశాన్ని నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మోడీ చెబుతున్నా రని కానీ దేశంలో నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నా యని ఆశ్రిత పెట్టుబడిదారి విధానంతో దేశం విచ్ఛిన్నం దిశగా ప్రయ త్నిస్తుందని రాజా తెలిపారు. అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ శక్తులు శ్రామిక జనులను దోపిడీ చేస్తున్నాయని ఆయన ఆరోపిం చారు. ప్రభుత్వ రంగం నిర్వీర్యం అవుతుందని ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా ప్రైవేట్ పరం చేస్తున్నారని ఇటువంటి సమయంలో ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎయిర్పోర్టులు, ఓడరేవులు, అగ్రికల్చర్, ఎలసి, అణు విద్యుత్ కేంద్రాలను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నారని రాజా తెలిపారు. ఎన్ఆర్ఈజిఎస్ పథకాన్ని పోరాడి సాధించుకుంటే దానిని రద్దు చేసేందుకు బిజెపి కుట్ర చేస్తుందని ఇందుకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతునిస్తూ సమ్మె జయప్రదానికి కృషి చేస్తుందన్నారు. సంఘ్ పరివార్ శక్తులు కులాన్ని, మతాన్ని అడ్డుపెట్టుకుంటున్నాయని వీటికి వ్యతిరేకంగా పోరాడతామ న్నారు.సనాతన ధర్మం, మహిళల పట్ల వివక్ష కొనసాగుతుందని ఆయన తెలిపారు. మతతత్వ శక్తుల కారణంగా దేశంలో లౌకికవాదం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడ్డాయని ఆయన తెలిపారు. గవర్నర్ల వ్యవస్థను సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అనేక రాష్ట్రాల్లో గవర్నర్లు స్థానిక ప్రభుత్వాలను ఇబ్బందులు పెడుతుందని ఆయన తెలిపారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను గవర్నర్ శాసించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



విద్య రంగంలోనూ మతాన్ని చొప్పిస్తున్నారని విద్యా వ్యవస్థను వ్యాపారమయంగా మార్చారని రాజా తెలిపారు. పార్లమెంటును నిర్వీర్యం చేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టివేస్తు న్నారని బిజెపి పాలన ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో సాగుతుందని ఆయన తెలిపారు. దేశంలో లౌకికవాద ప్రజాతంత్ర శక్తులను కలుపుకుని సమిష్టి పోరాటం చేస్తామన్నారు. కేరళను కాపాడుకోవడంతో పాటు త్వరలో ఎన్నికలు జరగనున్న మిగిలిన నాలుగు రాష్ట్రాల్లో కలిసి వచ్చే శక్తులతో కలిసి బలాన్ని పెంచుకుంటామన్నారు. వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమం అంటే త్యాగాలు, పోరాటాలేనని ఈ స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు, పోరాటాలకు సమాయత్తం అవుతామని రాజా తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శులు రామకృష్ణ పాండా, పల్లా వెంకటరెడ్డి, కె. రామకృష్ణ, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, ఎస్కె సాబీర్ పాషా, ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వైద్యులు ..
## డాక్టర్ పుచ్చలపల్లి వెంకట రామచంద్రా రెడ్డి జయంతి

**నెల్లూరు (వుదయం ప్రతినిధి) జనవరి 21వ తేదీ** నెల్లూరు నగరంలో నడుస్తున్న రామచంద్రారెడ్డి ప్రజావైద్య శాల వ్యవస్థాపకుడు పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి జయంతి సందర్భంగా పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి నెల్లూరు పట్టణంలో ప్రజావైద్యునిగా ప్రజలకు ఉచిత వైద్యాన్ని అందించిన వ్యక్తి. ప్రముఖ కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య తమ్ముడు. నెల్లూరు నగరంలో నడుస్తున్న రామ చంద్రారెడ్డి ప్రజావైద్యశాల వ్యవస్థాపకుడు, కావలి పట్టణానికి చెందిన విశ్వోదయ కళాశాలల సహ వ్యవస్థాపకుడు. జనబాహుళ్యంలో డాక్టర్ రాం అన్న పేరుతో సుప్రసిద్ధుడు.



### వ్యక్తిగత జీవితం

21 జనవరి 1915లో జన్మించిన రామచంద్రారెడ్డి పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విడవలూరు మండలం అలగాని పాడు గ్రామంలో జన్మించారు. ఆయన భూస్వామ్య కుటుం బానికి చెందినవారు. తండ్రి వెంకటరామిరెడ్డి, తల్లి శేషమ్మ లకు ఆఖరి సంతానంగా జన్మించారు. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట వీరుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, తెలుగునాట కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన కమ్యూనిస్టు గాంధీ పుచ్చలపల్లి సుందరయ్యకు రామచంద్రా రెడ్డి తమ్ముడు.

### వైద్యరంగం

1935–40 మధ్యకాలంలో రామచంద్రారెడ్డి మద్రాసులో వైద్యవిద్యను అభ్యసించారు. 1940లోనే ఆయన నెల్లూరు పట్టణంలో రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాలను ప్రారంభించి నడిపారు. ప్రజావైద్యశాల ద్వారా పేదలకు ఉచితంగా వైద్యం చేస్తూ నెల్లూరు ప్రాంతంలో ప్రాచుర్యం పొందారు. సాంఘిక వ్యవస్థ, ప్రజల ఆర్థిక జీవన విధానం సమూలంగా మారితే గానీ, తిండి తిప్పల్లో ఒక మార్పు రానిదే ఆరోగ్యం, శుభ్రత చేకూరవు అంటూండే రామచంద్రారెడ్డి ఆ క్రమంలో సమస మాజ స్థాపన కోసమూ తనవంతు కృషిచే శారు. కమ్యూనిస్టు పార్టీలోని కార్యకర్తలం దరికీ కొంత వరకు వైద్యం తెలిసి ఉండాలన్న ఒక పథకం డా.రాం సిద్ధం చేశాడు. గ్రామాలకు వెళ్ళి, బీదల మురికి వాడలకు వెళ్ళి పనిచేసే కమ్యూనిస్ట్ కార్యక ర్తలకు కొంత ప్రథమ చికిత్స, చిట్కావైద్యం, ఇంజెక్షను చేసే నైపుణ్యం ఉండాలని ఆయన అభిప్రాయం.

పేదరికం రోగాన్ని తీసుకువస్తుందని, ఆ పేదరికాన్ని, దానికి కారణమైన వ్యవస్థల్నీ సమూలంగా నాశనం చేయడా నికి సమయం పట్టవచ్చు. దానికోసం ఎన్నో త్యాగాలు చేయాల్సి వస్తుంది, ఎన్నో పోరాటాలు జరగాలి. అంతవరకూ రోగాలు ఆగుతాయా రోగుల ప్రాణాలు నిలిచివుంటాయా పేదరికాన్ని ధ్వంసం చేయడం దీర్ఘకాలిక ప్రణాళిక. దానికి అనుబంధంగా కమ్యూనిస్టు కార్యకర్తలు సత్వర ప్రణాళికగా కొంత వైద్యం నేర్చుకుని బీదల్ని కాపాడాలి అనేవారు డాక్టర్ రాం. ఆయన ఈ పథకం రూపకల్పన చేసి నిర్వహించడంలో అపారమైన కృషిచేశారు. ఆ పథకం ద్వారా ఎందరో బేర్ ఫూట్ డాక్టర్లను తయారుచేశారు. ప్రస్తుతం రామచంద్రారెడ్డి ఆసుపత్రి ఆయన కన్న ఒక కలను నిజం చేస్తూ పోస్టుగ్రాడ్యు యేషన్ కోర్సుల్లో శిక్షణనిచ్చే వైద్యసంస్థగా రూపొందింది.వై ద్యుని వద్దకు రోగి కాక రోగి దగ్గరకే వైద్యుడు వెళ్ళాలనేది రామచంద్రారెడ్డి సిద్ధాంతం. దాన్ని అనుసరిస్తూ పీపుల్స్ పాలీ క్లినిక్, సంచార వైద్యశాల, మాస్ ఎక్స్–రే వంటివి నడిపిం చారు. వైద్యుడైతే సరిపోదని నిపుణుడు కావాలని, ఆ నైపుణ్యా న్ని అట్టడుగు ప్రజల వరకూ ఉపయోగించాలని అనేవారు.

## ఎన్టీఆర్‌పై దుర్భాషలాడిన వారిని వెంటనే శిక్షించాలి



**విజయవాడ జనవరి 21 వుదయం న్యూస్ బ్యూరో:–** దివంగత నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్)పై అత్యంత జుగుప్సాకరమైన భాషతో, అవమానకర వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కంకిపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.తక్షణ చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ అభిమానుల డిమాండ్ నటులు నియోజకవర్గ ఎన్టీఆర్ అభిమానుల తరుపున, తెలుగు వారి ఆరాధ్య దైవం, స్వర్గీయ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) పై అత్యంత అవమానకరమైన, జుగుప్సాకరమైన దుర్భాషలతో కూడిన కామెంట్లు చేస్తూ సెల్ఫీ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న తెలంగాణ రాష్ట్రం, ఖమ్మంకు చెందిన రంగా ప్రవీణ్ కుమార్ రెడ్డి అనే వ్యక్తిపై చర్యలు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఎన్టీఆర్ కేవలం ఒక ప్రాంతం లేదా సామాజిక వర్గానికి మాత్రమే పరిమితం కాకుండా, ఉభయ తెలుగు రాష్ట్రాలు, దేశ-విదేశాల్లోని తెలుగు వారంద రికీ ఆరాధ్య దైవం. ఆయన లెగసీ, త్యాగం, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి, అడుగు బలహీన వర్గాల అభ్యు న్నతికి చేసిన కృషి మనందరికీ ఎంతో స్ఫూర్తిదాయకం. అటువంటి మహనీయునిపై ఉద్దేశపూర్వకంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా సామాన్య ప్రజల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీయడమే కాకుండా, వివిధ సామాజిక వర్గాల మధ్య కుల/మత ద్వేషాలను రెచ్చగొట్టి, శాంతి-భద్రత లకు విఘాతం కలిగించే ప్రయత్నంగా అభివర్ణిస్తూ, సెల్ఫీ వీడియో (పెన్ డ్రైవ్‌లో), సామాజిక ఖాతా వివరాలు జతచేస్తూ, భారతీయ న్యాయ సంహిత 2023 సెక్షన్ 356 (అపకీర్తి), సెక్షన్ 196/197 (సమూహాల మధ్య శత్రుత్వం ప్రోత్సహించడం), మరియు ఐటి యాక్ట్ కింద నేరంగా పరి గణిస్తూ కేసు నమోదు చేసి, ఎఫ్ ఐ ఆర్ ఫైల్ చేసి, సమగ్ర దర్యాప్తు చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సంఘటన సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశమైంది. ఫిర్యాదు చేసిన వారిలో ఎన్టీఆర్ అభిమానసంఘం యలమంచిలి కిషోర్ బాబు, కాకుమాను రమేష్, ఉండి సాంబశివ రాజు, షేక్ బాజీ అహమద్ బీబీ తదితరులున్నారు.




## దళితుడైన కర్ల రాజేష్ లాకప్ డెత్ మీద మంత్రి మౌనం వీడాలి

- చిలుకూరు ఎస్సై పాటు ఘటనలో పాల్గొన్న పోలీసులను సస్పెండ్ చేయాలి
- అఖిలపక్షం నేతలు

**కోదాడ ,జనవరి 21 (వుదయం)** కోదాడ పట్టణంలోని దళిత వర్గానికి చెందిన కర్ల రాజేష్ పోలిసుల చిత్రహింసల వల్ల లాకప్ డెత్ కు గురై మరణించి రెండు నెలలు గడుస్తున్నా రాష్ట్ర మంత్రివ ర్యులు కనీసం నోరువిప్పకపోవడం విచారకరమని , ఇకనైనా మౌనం విడనాడి తక్షణమే స్పందించాలని అఖిలపక్షం నేతలు డిమాండ్ చేశారు. కోదాడ పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరి యంలో కర్ల రాజేష్ లాకప్ డెత్ కు కారకులైన పోలీసులపై మరియు ఇతర శాఖల అధికారులపై చట్టపరమైన చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ఏపూరి రాజు మాదిగ ఎంఎస్పి జిల్లా అధికార ప్రతినిధి, అధ్యక్షత వహించారు.ఈ కార్యక్ర మంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ " కర్ల రాజేష్ ను పోలీసులు చట్టవిరుద్ధంగా అదుపులోకి తీసుకుని తీవ్రంగా చిత్రహింసలు పెట్టడం వల్లనే చనిపోయాడనే విషయం ప్రజలందరికి తెలుసు.అయితే కర్ల రాజేష్ లాకప్ డెత్ కు కారకు లైన పోలీసుల మీద చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కర్ల రాజేష్ లాకప్ డెత్ కు ప్రధాన కారకుడైన చిలుకూరు ఎస్సై సురేష్ రెడ్డిని సస్పెండ్ చేయకుండా అధికారంలో ఉన్నవారు కాపాడుతున్నారని అన్నారు. పోలిసులు నమోదు చేసిన కేసులో ఏ 1 గా ఎస్ఐ సురేష్ రెడ్డి, ఏ 2 గా సిఐ ప్రతాపలింగం లను చేర్చారని , మరి ఎ 2 గా ఉన్న సీఐ ప్రతాప లింగంను సస్పెండ్ చేసినప్పుడు ఏ 1 గా ఉన్న ఎస్ఐ సురేష్ రెడ్డిని ఎందుకు సస్పెండ్ చేయడం లేదని ప్రశ్నించారు.చట్టం అందరికీ సమానంగా పని చేయడం లేదని అన్నారు.రాజేష్ లాకప్ డెత్ లాంటి దారుణమైన సంఘటన మరెక్కడా జరగలేదనిఅన్నారు.అందువల్ల ఇలాంటి దారుణమైన సంఘటన ఇంకా ఎక్కడ కూడా జరగకుండా చూడాలనే ఉద్దేశంతో గత 55 రోజులుగాఎం ఆర్ పి ఎస్ పోరాటం చేస్తుందనిఅన్నారు. ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు.ఈ ఉద్యమంలో అన్ని రాజకీయ పార్టీలు పాల్గొనాలని కోరారు.ఫిబ్రవరి 5 న ఛలో కలెక్టరేట్ పిలు పునిస్తున్నామని, అన్ని పార్టీలు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నుండి జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ , బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి వంగవీటి శ్రీనివాస్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాస్ రావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ములకలపల్లి రాములు, టిడిపి రాష్ట్ర కోశాధికారి ఓరుగంటి ప్రభాకర్,ఎంఐఎం ఎస్.కె రఫీ కోదాడ నియోజకవర్గ ఇన్చార్జితెలంగాణ జాగృతి – సంజీవ్ నాయక్. టిఆర్పి – జిల్లా అధ్యక్షులు మామిడి అంజయ్య బి.ఎస్.పి – గోపాల్ యాదవ్, కాంపాటి వీరస్వామి సీపీఐ (మాస్ లైన్)– గొడ్డలి నరసయ్య, సీపీఐ ఎం ఎల్ –న్యూడెమోక్రసీ–నరసింహా రావు, ఉదయగిరి, సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి ఎం ముత్యాలు ,మాలమహానాడు – పిట్టల బ్యాగ్యమ్మ , వివిధ సంఘాల పార్టీల నాయకులు , కార్యకర్తలు పాల్గొని మద్దతు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పిరాష్ట్రనాయకులు యలమర్తి రాము మాదిగ, కొండపల్లి ఆంజనేయులు, ఏపూరి సత్యరాజు, పిడమర్తి చిన్న వెంకట్రావు, కుడుముల శ్రీను, దుడ్డెల గోపి, పిడమర్తి పెద్ద వెంకట్రావు, కొత్తపల్లి అంజయ్య, పాతకోట్ల నాగరాజు, గుడిపాటి కనకయ్య, లంజపల్లి శ్రీను, కొండపల్లి సూర్య ప్రకాష్, ఆకారపు కొండలు, బొడ్డు కుటుంబరావు, దాసరి రవి, పంది సాయి, కర్ల శివ, జోగు సైదులు, కుడుముల వేణు, కర్ల కమల్, తదితరులు పాల్గొన్నారు.




## సత్తుపల్లి సీఐ శ్రీహరి ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్'

**సత్తుపల్లి, జనవరి 21 (ఉదయం ప్రతి నిధి)** సత్తుపల్లి టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమం భాగంగా సత్తుపల్లి టౌన్ సీఐ తుమ్మలపల్లి శ్రీహరి బుధవారం సత్తుపల్లి బస్టాండ్‌లో ఆటో యూనియన్ సభ్యులకు రవాణా నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ముఖ్యంగా ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. అధిక వేగం, తప్పు దారుల్లో వాహనాలు నడపడం వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా ఇకపై అన్ని రవాణా నిబంధన లను తప్పనిసరిగా పాటిస్తామని ఆటో యూనియన్ సభ్యుల చేత ప్రతిజ్ఞ చేయించారు. రోడ్డు భద్రతపై ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొన సాగుతాయని పోలీసులు తెలిపారు.



## కాంగ్రెస్‌లో చేరికలు

**ఖమ్మం వుదయం బ్యూరో జనవరి 21**నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి 52వ డివిజన్ అధ్యక్షులు గద్దం వెంకటయ్య గారిఆధ్వర్యంలో ఖమ్మం నగర బీజేపీ 2 టౌన్ ఉపాధ్య క్షుడు కొప్పుల లక్ష్మి నరసింహారావు కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానిం చడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో 52వ డివిజన్ నుండి సుమారు 50 మంది కాంగ్రెస్ పార్టీలోకి రావడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో 52వ డివిజన్ కాంగ్రెస్ కమిటీ పాల్గొనడం జరిగింది.. కాంగ్రెస్ పార్టీలో వచ్చినవారు 52 డివిజన్ బీజేపీ బూత్ అధ్యక్షులుకు మ్మరి వీరబాబు. కొప్పుల శ్రీనివాస్. ఫిరంగి శ్రీను. చిరపంగి నాగరాజు. ఆలేటి రవితేజ. బర్ల రవికుమార్. తదితరులు ముఖ్య బిజెపి డివిజన్ నాయకులు పాల్గొనడం జరిగింది.ఈ యొక్క కార్యక్రమంలో బిజెపి మహిళా నాయకులు కూడా పాల్గొనడం జరిగింది. ఈ యొక్క కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఉపాధ్యక్షుడు పిరంగి నరసింహారావు. డివిజన్ సెక్రటరీ గదారి బాబు. డివిజన్ మైనార్టీ సయ్యద్ జిలాని పాష. సుభాని. మహమ్మద్ దస్తగిరి డివిజన్ ఎస్సీ సెల్ కొట్టె నరేందర్ నాని. తదితరులు పాల్గొన్నారు.



## పచ్చదనం-పరిశుభ్రతే లక్ష్యంగా అడుగులు వేయాలి

### స్వచ్ఛ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పురస్కారాలు అందజేత

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (వుదయం ప్రతినిధి)కొత్తగూ డెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆనందఖని నందు జరిగిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో జిల్లా స్థాయిలో ఎంపిక కాబడిన 8 పాఠశాలలకు స్వచ్ఛ పురస్కారాలను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అందజేశారు. జిల్లాలోని మొత్తం 1673 పాఠశాలలు స్వచ్ఛత ఏవం హరిత విద్యాలయ రేటింగ్స్ నందు రిజిస్టర్ చేసుకొనగా, దాని నుండి 6 పాఠశా లలు రూరల్ ఏరియా నుండి, 2 పాఠశాలలు అర్బన్ ఏరి యాలోను, మొత్తం 8 పాఠశాలలను జిల్లా స్థాయిలో ఎంపిక చేసి మెమెంటో, సర్టిఫికెట్స్ ను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని పాఠశా లలన్నీ ఇదేవిధంగా పాఠశాల ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలోనూ, మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందిం చడంలోనూ పోటీపడాలని, అన్ని పాఠశాలలు 5 స్టార్ రేటింగ్ ను పొందాలని సూచించారు. జిల్లా విద్యాధికారి బి. నాగలక్ష్మి మాట్లాడుతూ, జిల్లాస్థాయిలో ఎంపికైన ఈ పాఠ శాలలు రాష్ట్ర స్థాయికి నామినేట్ చేయబడ్డాయని, రాష్ట్రస్థా యిలో కూడా అవార్డును సాధించినట్లయితే జాతీయస్థాయికి ఎంపికై లక్ష రూపాయల నగదు బహుమతి కూడా ఆ పాఠశా లకు అందజేస్తారని తెలియజేశారు.జిల్లా స్థాయి అవార్డు గ్రహీతలు .మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అంజనా పురం బూర్గంపాడు మండలం,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సంజయ్ నగర్ఇల్లందు మండలం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల బుద్దగూడెం బూర్గంపాడు మండలం, భద్రాచలం పబ్లిక్ స్కూల్ బూర్గంపాడు మండలం, సెంట్రల్ గవర్నమెంట్ ఆటమిక్ ఎనర్జీ స్కూల్ అశ్వాపురం మండలం,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మొరంపల్లి బూర్గంపాడు మండలం, కేజీబీవీ.పాల్వంచ, పాల్వంచ మండలం,మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల సత్య నారాయణ పురం ఇల్లందు మండలం. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ శంభు ప్రసాద్, కమ్యూనిటీ మోబిలైజేషన్ అధికారి యస్. కె. సైదులు, అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ నాగరాజు శేఖర్, మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, వివిధ పాఠశాలల ప్రధానో పాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు శిక్షణ తరగతులు ద్వారా నైపుణ్యం

### కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట జనవరి 21(వుదయం)** ఉపాధ్యాయులు శిక్షణ తరగతుల ద్వారా నూతన సాంకేతికత నైపుణ్యం పెంపొం దించుకొని విద్యార్థులకు అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్ ఆర్ ఆర్ ఫంక్షన్ హాల్ నందు మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకే షన్ ఎన్ఐఈపీఏ వారు నిర్వహిస్తున్న ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఎంపవరింగ్ కేజీబీవీ వార్డెన్స్ శిక్షణ తరగతులకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మాస్టర్ ట్రైనర్స్ ద్వారా ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించడం వలన ఉపాధ్యాయులలో నూతన సాంకేతికత పెంపొందించుకొని విద్యార్థులకు సాం కేతిక విద్య ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ ద్వారా విద్య నేర్పించడం జరు గుతుందని, కేజీబీవీ రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివిన విద్యార్థులలో ఉత్తీర్ణత శాతం ఎక్కువగా ఉంటుందని,దీనికి కార ణం ఉపాధ్యాయులు ఎక్కువ సమయం కేటాయించటం విద్యార్థులకు కూడ భోజ నం వసతి కల్పించి ఎక్కువ సమయం ఉపాధ్యాయులతో మమేకం కావడం వలన ఉత్తీర్ణత శాతం ఎక్కువగా ఉన్నద ని, మీరు తీసుకున్న ట్రైనింగ్ ప్రోగ్రామ్ మరల స్కూల్ కి వెళ్ళిన తర్వాత మీ తోటి ఉపాధ్యాయులకు కూడ అందించాలని, రెసిడెన్షియల్ స్కూల్స్ ఇంకా పోటీపడి కార్పొరేట్ స్కూల్ లకు దీటుగా ఉండాల ని విద్యార్థులకు సైన్స్, మాథ్స్ సబ్జెక్టులలో బోధన సామర్థ్యం ఇంకా పెంచాలని రెసిడెన్ స్కూల్లో చదివే ఎక్కువ శాతం మంది పిల్లలు గ్రామీణ ప్రాంతాల నుండి పేద విద్యార్థులే వస్తారు కాబట్టి వారికి ఉన్నతమైన చదువు అందించి గ్రూప్స్, మెయిన్స్, సివిల్స్ పరీక్షలకు పోటీపడే విధంగా తయారు చేయాలని కలెక్టర్ అన్నారు.ఈ కార్యక్రమంలో డిఇ ఓ అశోక్, నోడల్ ఆఫీసర్ జీఈసీఓ పూలన్, మాస్టర్ ట్రైనర్స్ నిర్మల జ్యోతి, తవిటి నాయుడు, సూర్య కళ పాల్గొన్నారు.

## కోదాడలో మొట్టమొదటిసారిగా లోకల్ ఆటోవాలా



**కోదాడ జనవరి 21 (వుదయం)** కోదాడ లోకల్ ఆటోవాలా పేరుతో యూనియన్ బుధవారం ఏర్పాటు చేయడం జరిగింది. యూనియన్ అధ్య క్షుడిగా కోళ్ళూరి వెంకటేశ్వర్లు ,ప్రధాన కార్యదర్శి కట్టెల తేజ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా సోమ పంగు నాగరాజు, మురళి ప్రకాష్,కార్య దర్శులుగా , దారావత్ శీను కుమార్ ,జానీ పాషా, గరిడేపల్లి వెంకటేశ్వర్లు , సైదులు, పోలంపల్లి ఉపేందర్, కార్యవర్గ సభ్యులు గా రమేష్ బాబు, వెంకట్ రెడ్డి, నెమ్మది కాంతారావు, రాజు, సురేష్, జానీమియాలు నియా మకమయ్యారు. ఈ కార్యక్రమంలో కోదాడ లోకల్ ఆటో డ్రైవర్లు ఓనర్లు తది తరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ ఎన్నికల్లో మాలలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలి

### మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి పిడతల శ్రీను

**కోదాడ జనవరి 21 (వుదయం)** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో మాల సామాజిక వర్గానికి తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి పిడతల శ్రీను డిమాండ్ చేశారు. బుధవారం కోదాడలోని మాలపల్లి అంబేద్కర్ భవన్ లో జరిగిన సమా వేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేసిన తరుణంలో మాలలకు దామాషా ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా తగిన ప్రాధాన్యత కల్పిం చడంతోపాటు కోదాడలో ఎస్సీలకు కేటాయించిన ఐదు వార్డుల్లో కనీసం రెండు స్థానాలను మాలలకు కేటాయించాలని అన్ని రాజకీయ పార్టీలను కోరారు. ఇప్పటివరకు కోదాడలో మాలలకు రాజకీయంగా అన్యాయమే జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటూ, పదవుల పంపకంలో మొండిచేయి చూపుతు న్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో లచ్చిమల్ల రామ్మోహన్, కామల్ల ప్రవీణ్, అంజి, గాదారి మధు తదితరులు పాల్గొన్నారు.

## మేడారం మహా జాతరకు ప్రత్యేక బస్సులు సిద్ధం

### కొత్తగూడెం డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (వుదయం ప్రతినిధి)**ఆసియా లోనే అతిపెద్ద గిరిజన జాతర అయినా మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఈనెల 28వ తేదీ నుండి జరుగుతున్న నేపథ్యంలో జాతరకు వెళ్లే భక్తుల కొరకు కొత్తగూడెం డిపో అన్ని ఏర్పాట్లతో సిద్ధమైందని కొత్తగూడెం డిపో మేనేజర్ యు. రాజ్యలక్ష్మి తెలిపారు. కొత్తగూడెం డిపో నుండి 110 బస్సులు మరియు ఇల్లందు డిపో నుండి 41 బస్సులు ఆపరేట్ చేయుటకు ప్రణాళికలు సిద్ధమైనవని ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా గురువారం నుండి ఉదయం ఏడు గంటలకు మరియు ఎనిమిది గంటలకు రెండు సర్వీసు లను వయా మణుగూరు, ఏటూరు నాగారం ద్వారా మేడారంకు నడపబడునని తెలిపారు. కావున భక్తులు ఆర్టీసీ బస్సులలో సురక్షితంగా ప్రయాణం చేస్తూ అమ్మవార్ల గద్దెల వరకు వెళ్లే అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇందుకు సంబంధించి చార్జీల వివరములు కొత్తగూడెం బస్టాండ్ నుంచి పెద్దలకు 350 రూపాయలుగా మరియు పిల్లలకు 190 రూపాయలుగా నిర్ణయించడమైందని తెలిపారు. మహా జాతరకు ఈనెల 25వ తేదీ నుండి అనగా ఆదివారం నుండి ప్రత్యేకమైన సర్వీసులు అందుబాటులో ఉంటాయని కావున జాతరకు వెళ్ళు భక్తులు గమనించగల రని తెలిపారు. మహా జాతరకు వివిధ కారణాల ద్వారా వెళ్లలేని భక్తులు అమ్మ వార్ల ప్రసాదాన్ని టీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ కొత్తగూడెం కౌంటర్ నందు మరియు నేరుగా లాజిస్టిక్స్ ఆన్లైన్ నందు కేవలం 299 రూపాయలు చెల్లించి బుక్ చేసుకోని ఇంటి వద్దనే ప్రసాదాన్ని పొందే అవకాశం కలదని తెలిపారు. ఇట్టి ప్రసాదంలో బంగారంతో పాటు అమ్మవార్ల ఫోటో మరియు పసుపు కుంకుమలు కూడా అంద జేస్తామని తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్ను కొత్తగూడెం డిపో మేనేజర్ కార్యాలయంలో తమ సిబ్బంది తో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిపో సూపరిం డెంట్ విజయలక్ష్మి, సూపరిండెంట్ (ఫైనాన్స్) సాహిక మరియు ట్రాఫిక్ సూపర్వైజర్ విజయలక్ష్మి, జహీర్ మరియు లాజిస్టిక్స్ మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెరిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి గా జనార్ధన్ ఏకగ్రీవ ఎన్నిక



**కోదాడ జనవరి 21(వుదయం)** సూర్యాపేట జిల్లా పెరిక కుల సంఘం ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన పత్తిపాక జనార్ధన్ వర్మను బుధవారం కోదాడలో ఘనంగా సన్మానిం చారు. పట్టణంలోని 22వ వార్డుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడైన జనార్ధన్ వర్మకు జిల్లా స్థాయి బాధ్యతలు దక్కడం పట్ల కుల పెద్దలు, పార్టీ శ్రేణులు, మిత్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వార్డు నాయకులు ఆయనను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కుల బాంధవులందరినీ కలుపుకొని సంఘ పటిష్టతకు కృషి చేస్తానని ఈ సందర్భంగా జనార్ధన్ వర్మ పేర్కొన్నారు. తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి,మాజీ గ్రంథాలయ చైర్మన్ రహీం,తొగరు మధు, సైదులు,వెంకట్ రావు,చలమారెడ్డి ,వీరారెడ్డి,రాఘవయ్య,శ్రీనివా సరెడ్డి ,గుడిమెట్ల వెంకటేశ్వర్లు ,గోపిరెడ్డి ,తిమ్మారెడ్డి మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



"మౌలికంగా చూస్తే గ్రీన్ లాండ్ దీవీ డెన్మార్కులో సహజ భాగం కానే కాదు అలాగే నార్వేలో కూడా అంతర్భాగం కాదు. అది విజేతల వలస దేశం. అక్కడి ప్రజలు వలస పాలకుల పాలనకు అలవాటు పడిపోయారు. గ్రీన్ లాండ్‌కు రష్యా చైనాల నుంచి ముప్పు ఉన్నదనే మాటకూడా నిజం కాదు. దానిని కబళించడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాలు నాటోలో తీవ్ర సంక్షోభాన్ని కలిగిస్తున్నవి ఈ కూటమి ఎంత కాలం సమైక్యంగా మనగలుగుతుందనే అనుమానాలు తలెత్తుతున్నాయి."

- సెర్జీ లావ్రోవ్, రష్యా విదేశంగా మంత్రి

## వే'మన'పద్యం



ఉత్తమోత్తముండు తత్వజ్ఞుడిల మీద
మహిమ జూపువాడు మధ్యముండు
వేషధారి యుదర పోషకుండధముండు
విశ్వదాభిరామ వినురవేమ

## సంపాదకీయం

# కేంద్ర పాలకుల ఏజెంట్లా?

కొన్నాళ్ళు పోతే ఇటువంటి చర్యలకు లేదా పరిణామాలకు ప్రస్తావనార్హత పోతుంది. ఇది మామూలే అని పెదవి విరిచి ఊరుకొంటారు. ఎందుకంటే పెద్దమనుషులనిపించుకొన్నవారు మొదటిసారి నడిరోడ్డు మీద తల్లకిందులుగా నడిస్తే వింతగా చూస్తారు. రోజూ అదే చేస్తూ ఉంటే ఆ వైపు కన్నెత్తి అయినా చూడరు. మొన్న ఒకే రోజున తమిళనాడు, కేరళ గవర్నర్లు చేసిన అదే మాదిరి నిర్వాకం ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్త లేదు.ఇదింతేలే అనిపించింది. రాజ్యాంగబద్ధంగా,నియమహితంగా, సర్వజనశ్రేయంగా మనను మనం పాలించుకుందామని చెప్పుకొన్న దేశంలో ఉన్నత రాజ్యాంగ పదవుల్లోనివారే పాడితప్పడం పాడి కాదు. ఏడాదికొకసారి శాసనసభలో 'తన' ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, సంక్షేమాలపై నివేదిక వంటి ప్రసంగం చేసే సంప్రదాయ విధి నిర్వహణను తనంతట తానే రసాభాస చేసుకోవడం తమిళనాడు గవర్నర్ ఆర్ ఎన్ రవి కి అలవాటయింది.ఆ ' బృహత్తర దుర్విధి ని ఆయన ఈ సారి కూడా క్రమం తప్పకుండా కానిచ్చివేశారు. కీలక అసెంబ్లీ సమావేశాల తొలి రోజు రివాజు ప్రసంగంలో తన సొంత మాటలు చొప్పించి ప్రభుత్వ పెద్దలతో గొడవ పడి గవర్నర్ రవి వాకౌట్ చిత్తగించడం ఇది వరుసగా నాలుగో సంవత్సరం. గవర్నర్ కేవలం నామ మాత్ర పు ప్రభుత్వాదినేతే కాబట్టి ప్రసంగాన్ని రాష్ట్ర ప్రభుత్వమే తయారు చేసి ఇస్తుంది. దానిని బుద్ధిగా చదవడమే ఆయన పని.కాని అందుకు బదులుగా ప్రసంగంలో అవాస్తవాలున్నాయని ఎత్తి చూపుతూ రాష్ట్రంతో పేచీకి దిగి మధ్యలోనే వెళ్లిపోయారు. సమావేశాలకు ముందు జాతీయ గీతాన్ని బదులు తమిళ గీతాన్ని ఆలపించడాన్నిఆక్షేపించారు., కేరళ గవర్నర్ రాజేంద్ర అరేకర్ కూడా ఇదే చేశారు. ప్రసంగంలో కేంద్రంపై విమర్శలున్న ప్రసంగ భాగాలను తొలగించి చదవడంతో ముఖ్యమంత్రి పినరయి విజయన్ మిగతా భాగాన్ని తానే చదివి ఆశ్చర్యపరిచారు. ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత జరిగే మొదటి అసెంబ్లీ సమావేశాల తొలి రోజున, ఏడాది ఆరంభం లో నిర్వహించే తొలి సమావేశాల మొదటి దినాన గవర్నర్ ప్రసంగించాలని రాజ్యాంగం 176 స్పష్టం చేస్తున్నది.కేంద్రానికి రాష్ట్రాలకు గవర్నర్ అనుసంధాన కర్త అనే సంగతిని ఇది చాటుతుంది. ఈ సున్నిత బాధ్యతను ఎంతో హుందాగా నిర్వర్తించి దేశ సమగ్రతను పెంపొందించాలన్న ఎరుక గవర్నర్లకు లేకపోవడం బాధాకరం. అందులోనూ ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల గవర్నర్లు మాత్రమే ఈ విధంగా అక్కడి ప్రభుత్వాలపై బురద చల్లడానికి ఈ రాజ్యాంగ విధిని అదే పనిగా ఇలా దుర్వినియోగం చేయడం వెనుక కేంద్రంలోని పాలక పక్షం చేయి ఉందని అనిపిస్తే కాదనగలమా?అలా అనిపించిడం బిజెపి కి కూడా మంచిది కాదు.ప్రజల విజ్ఞతను పరీక్షించడం తగదు.

## రచనలు పంపండి



వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# వ్యావహారిక యోధుడు



తెలుగు వ్యావహారిక బాషకు పితామహుడిగాపేరెన్నిక గన్న సాహితీ వేత్త గిడుగు రామమూర్తి పంతులు రామమూర్తి (18631940). ఆధునిక విజ్ఞాన వ్యాప్తికి, వచన రచనకు కావ్యభాష పనికి రాదనీ, సామాన్య జనానికి అర్థమయ్యే సమకాలీన "శిష్టవ్యావహారికం"లో ఉండాలనీ ఆనాటి సాంప్రదాయిక పండితులతో హోరాహోరీగా యుద్ధంచేసి ఆధునిక ప్రమాణ భాషను ప్రతిష్టించటానికి మార్గదర్శకుడైన వారు గిడుగు రామమూర్తి. గిడుగు వారి వ్యవహారిక భాషోద్యమం వల్ల ఆధునిక సాహిత్యం కొత్త సొగసులు సంతరించుకుంది. రచనా వైవిధ్యం, వైశిష్ట్యంతో పుష్టి చేకూరింది. విశ్వ విద్యాలయాలలో వాడుకభాష రాజ్య మేలుతోంది. పత్రికలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. అక్షరాస్యత పెరిగింది. తెలుగు అధికార భాషగా, పరిపాలనా భాషగా కీర్తికెక్కింది. దీనికంతటికీ గిడుగు పిడుగే మూల కారకులు.

గ్రాంధికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకు వచ్చి, నిత్య వ్యవహారం లోని భాషలో ఉన్న అందాన్నీ, వీలునూ తెలియ జెప్పిన మహనీయుడు. ఆంధ్రదేశంలో వ్యావహారిక భాషోద్యమానికి మూల పురుషుడు. బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘ సంస్కర్త, హేతువాది. శిష్టజన వ్యవహారిక భాషను గ్రంధరచనకు స్వీకరింప జేయడానికి చిత్తశుద్దితో కృషి చేసిన అచ్చ తెలుగు చిచ్చర పిడుగు గిడుగు. గిడుగు ఉద్యమంవల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు వ్యావహారిక భాషలో సాగి, అందరికీ అందుబాటు లోకి వచ్చింది. పండితులకే పరిమితమైన సాహిత్య సృష్టి, సృజనాత్మక శక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ వీలైంది. తెలుగు భాష గురించి ఆధునిక పద్ధతిలో ఆలోచించిన తొలి భాషా విజ్ఞాని ఆయన. ఈ వాడుక భాషా వాదాన్ని చేపట్టినందుకు గిడుగువారు పండితులతో యుద్ధం చేయవలసి వచ్చింది. దీన్ని గ్రామ్య వాదమనీ, గిడుగు వారు గ్రామ్యా చార్యులనీ గ్రాంధికవాదులు హేళన చేస్తూ పద్యాలూ, వ్యాసాలు రాశారు. జయంతి రామయ్య పంతులు, కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి, వేదం వెంకట రామ శాస్త్రి, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి మొదలైన వారితో ఢీకొనవలసి వచ్చింది. ఆంధ్రసాహిత్య పరిషత్తు గ్రాంధిక భాషావాదానికి అండగ నిలిచింది. గిడుగువారు 'తెలుగు' పత్రిక ద్వారా గ్రాంధిక వాదాన్ని ఖండిస్తూ వ్యావహారిక వాదాన్ని బల పరిచారు. పండితులే తప్పులు లేకుండా రాయలేని గ్రాంధికం బలవంతాన రుద్దడం ఎందుకంటూ "ఆంధ్ర పండిత బిషక్కుల భాషా భేషజం" అనే పుస్తకం ప్రచురించారు. తెలుగు సాహిత్యంపై పండితుల గుత్తాధి కారాన్ని పోగొట్టారు. ప్రజలలో ఒక్కరు కూడా నిరక్షరాస్యులు కాకూడదని, అందుకు వాడుక భాష సాధనం కానీ... గ్రాంధికమని తమకే రాని, తమకే తెలియని, భాషను పిల్లలు ఉపయోగించాలనీ అందులోనే పుస్తకాలు రాయాలనీ, దానిలోనే పాఠ్య పుస్తకాలుండాలని శాసించడం అవివేకమని ఉద్యమించారు. చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి, తాతా సుబ్బరాయుడు శాస్త్రి వంటి ఉద్దండ పండితులే ఆయన వాదంలోని సబబు గుర్తించారు. బల పరచారు. కుండలాల, శాలువాల పండితుల సాహిత్యాధికారం, అసంబద్ధమైన వ్యాకరణ, ఛందశ్శాస్త్ర దండనాధికారం చెల్లదన్నారు.



సంగన భట్ల

# విపరీతంగా అసమానతలు

తాజా ప్రపంచ అసమానతల నివేదిక డిసెంబరులో విడుదలైంది.2018, 22 తరువాత ఇది మూడవది. ప్రపంచంలో, మనదేశంలో కూడా అసమానత తీవ్ర స్థాయిలో ఉందని హెచ్చరించింది. ఈ నివేదికను రూపొందించిన వారు ల్యూకాస్ ఛాన్సెల్, రికార్డో గోమెజ్ కరేరా, రొవాయిడా మోషిరిఫ్, థామస్ పికెటి. ఆ నివేదికకు మన దేశానికి చెందిన జయతి ఘోష్, జోసెఫ్ స్టిగ్లిజ్ ముందు మాటరాశారు. సంపాదకుల్లో చివరి వ్యక్తి ఫ్రెంచి ఆర్థిక వేత్త థామస్ పికెటి గురించి తెలుగువారికి కొంతమేరకు తెలుసు,ఎందుకంటే ఆర్థిక అసమానతల గురించి ఆయన హెచ్చరించిన అంశాలు గతంలో చర్చనీయాంశమయ్యాయి. అసమానతలు అంటే కేవలం సంపదకే పరిమితం కాదు, వాతావరణ, లింగపరమైన, అవకాశాలు అందరికీ అందుబాటులో లేకపోవటం, చివరికి ఎన్నికల కోసం నియోజకవర్గాల విభజనలో వివక్షతో సహా ఇతర అంశాలు ఉన్నాయి.ప్రపంచ అసమానతల సమాచార సంస్థకు అనుబంధంగా ఉన్న రెండువందల మందికి పైగా పరిశోధకులు అనేక కోణాల్లో చేసిన విశ్లేషణల సారమే ప్రపంచ అసమానతల నివేదిక. అన్ని అంశాలను ఇక్కడ స్పృశించటం సాధ్యం కాదు గనుక సంపదల పున:పంపిణీ గురించి చర్చిద్దాం.ప్రపంచాన్ని " కమ్యూనిస్టు భూతం " ఆవహించకుండా జనం దానివైపు మరలకుండా చూసేందుకు పెట్టుబడిదారీ ఆర్థిక, సామాజికవేత్తలు అనేక అంశాలను ముందుకు తెచ్చారు. వాటిలో ఊట సిద్ధాంతం ఒకటి.

ప్రభుత్వాలు కేవలం పాలనకే పరిమితమై అన్ని రంగాలను ప్రైవేటు సంస్థలు, వ్యక్తులకే అప్పగిస్తే వారు సృష్టించే సంపదల మూట నుంచి ఊట యావత్ సమాజానికి దిగుతుందన్నది ఊట సిద్ధాంతం. దానికి సంస్కరణలు, నూతన ఆర్థిక విధానాల వంటి ముద్దుపేర్లు పెట్టారు, జనం కూడా నిజమే అని నమ్మారు, తమకూ సంపదల ఊట దిగుతుందేమోనని పోరాటాలు మాని ఆశతో చెంబులు పట్టుకు ఎదురు చూశారు, ధారలేమీ కారలేదు, కేవలం కొన్ని చుక్కలు మాత్రమే పడ్డాయి. దాంతో ఫలితం లేదని అసంతృప్తి చెందటం ప్రారంభించారు. సోషలిస్టు సమాజాలం కోసం జనం చూడకుండా కొన్ని తాయిలాలు అందించి సంతృప్తిపరచేందుకు ఐరోపాలో అనేక ప్రయోగాలు చేశారు. సంక్షేమ పథకాలు అమలు జరిపి సోషలిజంలో ఇంతకంటే పెద్దగా ఒరిగేదేమిటని జనాన్ని కొంతకాలం మభ్యపెట్టారు. ప్రథమ సోషలిస్టు రాజ్యం సోవియట్ యూనియన్ కూలిపోవటంతో కమ్యూనిజం, సోషలిజాలపై విజయం సాధించామని, ఆ ప్రయోగం విఫలమైందని ప్రచారం చేశారు. అంతేనా పోటీ లేకపోవటంతో అప్పటి వరకు అమలు జరిపిన అనేక సంక్షేమాలకు కోత పెట్టటం ప్రారంభించారు. అసమానతలు అప్పటి నుంచి మరింత పెరగటంతో జనాన్ని తప్పుదారి పట్టించేందుకు సంపదల పు న : పం పి ణీ అవసరమంటూ మరో పల్లవి అందుకున్నారు.సూత్ర రీత్యా దీన్ని ఎవరూ వ్యతిరేకించరు, అయితే అది ఎలా అన్న అంశంమీదే తేడా వస్తున్నది. సంపదలు పంచి నంత మాత్రాన వేగంగా దారిద్ర్యం తగ్గుతుంది తప్ప ఆర్థిక వృద్ధి జరగదని, జనాలను సోమరులుగా మారుస్తాయని కొందరు చెబుతున్నారు. కొన్ని సంస్థలు, కొందరు వ్యక్తులు ఈ మంచి సంస్కరణ అంశాన్ని ప్రచారం చేసి జనాన్ని సమీకరించేందుకు చూస్తున్నాయి. అసలేమీ లేనిదానికంటే ఏదో ఒకటి మంచిదే.అయితే భ్రమలు పెట్టుకోనవసరం లేదని చెప్పక తప్పదు.

అసమానతల గురించి తాజా నివేదకలో పేర్కొన్న అంశాలను క్లుప్తంగా చూద్దాం.మచ్చుకు ఒకటి, సబ్ సహారా ప్రాంతంలో ఒక బిడ్డ మీద పిపిపి పద్దతిలో 200యూరోలు ఖర్చు చేస్తుండగా ఐరోపాలో 7,400, ఉత్తర అమెరికా, ఓషియానా దేశాల్లో 9,000 యూరోలు వెచ్చిస్తున్నారు. ప్రపంచంలో 0.001శాతం అంటే అరవైవేల మందికంటే తక్కువ ఉన్న కోటీశ్వరులు దిగువన ఉన్న 50శాతం జనాభా మొత్తం సంపదల కంటే మూడు రెట్లు ఎక్కువ కలిగి ఉన్నారు. ప్రతి ఏటా ప్రపంచ జిడిపిలో ఒకశాతం ధనికదేశాలకు తరలుతున్నది.ఇది ప్రపంచ వృద్ధికి ఇస్తున్నట్లు చెబుతున్న సాయానికి మూడు రెట్లు ఎక్కువ. స్త్రీ, పురుష వేతన తేడా అన్ని చోట్లా ఉంది. గంటకు ఒక పురుషుడు పొందే వేతనంలో మహిళకు వస్తున్నది 61శాతమే, వేతన చెల్లింపులేని పనిగంటలను కూడా లెక్కిస్తే ఈ తేడా 32శాతానికి దిగజారుతుంది.

సంపదల పున:పంపిణీ ఎలా అన్న దాని మీద పూర్తి ఏకాభిప్రాయం ఉందా అంటే లేదు అని చెప్పవచ్చు, దోపిడీ విధానాన్ని కూకటివేళ్లతో పెకలించి వేయకుండా తీసుకొనే ఏ చర్య అయినా అది ఉపశమనం తప్ప మరొకటి కాదు. లాటిన్ అమెరికా దేశాల్లో, దక్షిణాఫ్రికా, నేపాల్ వంటి చోట్ల పురోగామివాదులు, కమ్యూనిస్టులు ఎన్నికల ద్వారా అధికారానికి వచ్చారు.దోపిడీ వర్గ పునాదిని దెబ్బతీయకుండా దాని మీదే కొన్ని సంస్కరణలు మాత్రమే అమలు చేయటంతో ఒకదశ దాటిన తరువాత కార్మికవర్గంలో అసంతృప్తి కొనసాగుతూనే ఉంది.లాటిన్ అమెరికా దేశాల అనుభవం ఇదే.కొన్ని చోట్ల ఒకసారి గెలిచిన వామపక్ష శక్తులు తరువాత ఓడిపోవటానికి కారణాలు ఇవే. అసమానతలు ఎక్కువగా ఉంటే సామాజిక, రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతాయి.ఈ కారణంగానే రాజకీయ పార్టీలు ప్రజాకర్షక నినాదాలు, చర్యలతో ముందుకు రావటం పెరిగింది. ఓట్ల కోసం అలాంటి చర్యలకు పాల్పడను, ఆ సంస్కృతికి దూరం అని కొండంత రాగం తీసిన నరేంద్రమోడీ నాయకత్వంలోని బిజెపి అదే చేస్తున్నది. అయితే ఇతర పార్టీలు చేస్తే జనాకర్షక పథకాలు, తాము చేసేవి సాధికారత కలిగించేవంటూ వంచనకు పాల్పడుతోంది. ఇవి దీర్ఘకాలంలో అభివృద్ధిని దెబ్బతీస్తాయని కొందరు వ్యతిరేకిస్తున్నారు. ఆశ్రితులకు దేశ సంపదలను దోచిపెట్టి మరింతగా పెంచటమే గాక, సంపదలను సమంగా పంపిణీ చేయటాన్ని వ్యతిరేకించేవారే ఇలాంటి జనాకర్షక పథకాలను తీసుకు వస్తారన్నది ఒక వాస్తవం. స్వాతంత్ర్యం గురించి కన్న కలలు విఫలమై 1967లో కాంగ్రెస్ అనేక రాష్ట్రాలలో ఓడిపోవటం, తనకు పార్టీలో సవాలు ఎదురైనపుడు గరీబీ హటావో పేరుతో ఇందిరా గాంధీ వాటికి శ్రీకారం చుట్టారని చెప్పవచ్చు. అయితే మనవంటి సమాజాలాలలో అవి అవసరం. ఉదాహరణకు ఎన్‌టి రామారావు ప్రవేశపెట్టిన సబ్సిడీ బియ్యపు పథకం, వృద్ధాప్య, వితంతు, వికలాంగులకు ఇస్తున్న పెన్షన్లు ఏ విధంగా సాయపడుతున్నాయో చూస్తున్నాం. ఇతర నగదు బదిలీ పథకాలు కూడా అలాంటివే.నిజానికి ఆ మొత్తాలు వస్తు,సేవల కొనుగోళ్ల రూపంలో తిరిగి ఆర్థిక వ్యవస్థలోకే వస్తున్నాయి. అందువలన ఈ మొత్తాలను ఇంకా పెంచటం సంపద పంపిణీలో భాగంగానే పరిగణించవచ్చు.అభివృద్ధి రేటుకు తగిన విధంగా పేదల ఆదాయాలు పెరగకపోతే ఫలాలు ధనికులకే చేరుతున్నట్లు లెక్క.మనదేశంలో అదే జరుగుతున్నది, శతకోటీశ్వరులు మరింతగా పెరుగుతున్నారు. తాజా అంచనా ప్రకారం ఒకశాతం ధనికుల సంపద 40శాతానికి చేరింది. మంచి రోజులు తీసుకువస్తానని చెప్పిన నరేంద్ర మోడీ సంస్కరణలను మరింత వేగంగా అమలు జరుపుతానని కూడా చెప్పారు. దాని ఫలితం ఏమిటో చూశాము. కార్పొరేట్ పన్ను గణనీయంగా తగ్గించిన కారణంగా ఏటా లక్ష కోట్ల రూపాయలకు పైగా ఖజానా కోల్పోతున్నది. పోనీ ఆ మేరకు ఆయా సంస్థలు పెట్టుబడులు పెట్టి ఉపాధి కల్పిస్తున్నాయా అంటే అదీ లేదు. పర్మనెంటు ఉద్యోగుల సంఖ్య నానాటికీ తగ్గుతున్నది.మన దేశ కార్పొరేట్ సంస్థలకు పన్ను తగ్గించిన కారణంగా వాటిలో పెట్టుబడులు పెడితే లాభసాటిగా ఉండటంతో విదేశీ కంపెనీ నేరుగా పరిశ్రమల స్థాపనకు బదులు ఉన్న కంపెనీల వాటాలను స్టాక్ మార్కెట్ లో కొనుగోలు, విక్రయాలు చేస్తూ లాభాలను తమ దేశాలకు తరలించుకుపోతున్నాయి. ఆదాయాన్ని బట్టి పన్ను విధించి, ఆ మేరకు అల్పాదాయవర్గాలకు రాయితీల రూపంలో సంపదల పంపిణీ ఒక పద్దతి. లాటిన్ అమెరికాలోని బ్రెజిల్‌లో అసమానతలు, దారిద్ర్య నిర్మూలన పథకాల్లో భాగంగా షరతులతో కూడిన నగదు బదిలీ పథకాలను అమలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలు జరుగుతున్న అమ్మవోడి, తల్లిదీవెన పథకాలు వాటికి నకలే. తమ బుర్రలో పుట్టినవే అని ఎవరైనా చెప్పుకుంటే బడాయి తప్ప మరొకటి కాదు. 2003లో వామపక్ష నేత లూలా డ సిల్వా అధికారానికి వచ్చినపుడు అంతకు ముందున్న కొన్ని పథకాల అనుభవాలను చూసి మరింత లబ్ది చేకూరేవిధంగా అల్పాదాయ వర్గాలకు ఈ పథకాన్ని అమలు చేశారు. పిల్లలను బడికి పంపటం, టీకాలు వేయించిన వారికి నగదు బదిలీ జరిగింది.దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారు దీనికి అర్హులు. అంతర్జాతీయంగా అది ప్రశంసలు పొందింది. అది ఇప్పటికీ కొనసాగుతోంది,సంపదల పంపిణీ వలన దారిద్ర్య తీవ్రత తగ్గుతుంది తప్ప అసమానత తొలగదు. గమనించాల్సిందేమంటే రెండు దశాబ్దాల తరువాత చూస్తే అసమానతలు ఎక్కువగా ఉన్న పది ప్రపంచ దేశాల్లో బ్రెజిల్ ఒకటిగా ఉంది.రెండు తెలుగు రాష్ట్రాలలో అమలు చేస్తున్న రైతు బంధు, భరోసా మరో పేరుతో అందచేస్తున్న నిధులు, పిఎం కిసాన్ మొత్తాలు కూడా సంపద పున: పంపిణీలో భాగమే. అయితే అవి వ్యవసాయ రంగ సంక్షోభాన్ని ఆర్పేవి తీర్చేవి కాదు.కనీస వేతనాల పెంపుదల కూడా సంపదల పంపిణీలో ఒక అంశమే. గౌరవప్రదమైన జీవనం గడిపేందుకు, అవకాశాలను అందిపుచ్చుకొనేందుకు అవకాశాలను పెంచుతాయి. అందువలన సంపదల పంపిణీ గురించి మరింత నిర్దిష్టంగా మధనం జరగాల్సి ఉంది. తమ ప్రత్యేక లక్షణాలతో సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం చేస్తున్నట్లు ప్రకటించిన చైనాలో కూడా ఆర్థిక అసమానతలు ఉన్నాయి, అయితే వాటిని తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు కమ్యూనిస్టు పార్టీ ప్రకటించింది.





ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ రూపొందించిన ఆర్థిక చట్రంలోనే మన పాలకులు విధానాలను రూపొందిస్తున్నారు. అందుకే గొర్రె తోక మాదిరి జనజీవితాలు పెద్దగా పెరగటం లేదు. సంపదల పున:పంపిణీ నినాదం సంస్కరణ మాదిరి ఉన్నప్పటికీ అది కూడా వర్గపోరాట ప్రాథమిక రూపమే అని చెప్పవచ్చు. ఈ మాత్రపు సంస్కరణనే వ్యతిరేకించేవారు, సంపదలను సమాజపరం చేస్తే ఊరుకుంటారా ? దేశంలో కార్పొరేట్లు, ధనికుల పెత్తనం ఉన్నందున వారి మీద పన్ను తగ్గించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దానికి విరుద్ధంగా పన్ను మొత్తాలను పెంచి పేదలకు పంచాలని ఇతరులు కోరుతున్నారు. పన్నులు పెంచుకుంటూ పోతే ఎగువన ఉన్నవారు కుప్పకూలుతారని వారి సమర్ధకులు అంటే పెంచకపోతే మరింతగా దిగజారతామని దిగువన ఉన్నవారు ఆందోళన చెందుతున్నారు.ఈ వైరుధ్యం మరింత ముదిరితే విప్లవానికే దారితీస్తుంది.ప్రస్తుతం మనదేశంలో అలాంటి పరిస్థితి లేదు.



ఎం కోటేశ్వరరావు

# డిజిటల్ ఉపవాసం

సాంకేతిక విప్లవం మూడు ట్యాబులు ఆరు స్మార్ట్‌ఫోన్లుగా విస్తరిస్తోంది. కంప్యూటర్ యుగంలోంచి డిజిటల్ యుగంలోకి అడుగిడిన నవ్య ఏఐ నరుడి జీవనశైలి సమూలంగా మారిపోయింది. డిజిటల్ వెలుగులు మానవాళి కళ్లకు నీలి తెరలు కప్పేస్తున్నాయి. అంతర్జాలం విశ్వ వ్యాప్తం అయ్యింది. భూమి కుగ్రామంగా రూపాంతరం చెందింది. దేశ సరిహద్దులు రేఖామాత్రంగా మిగిలిపోయాయి. స్మార్ట్ ఫోన్ ఉపకరణం మనవ శరీరంలో మరో అంగమై తిష్టవేసింది.స్మార్ట్‌ఫోన్‌లేకుండాబతుకులు అంధకారమయం అయ్యాయి. సమాచార సేకరణ, కమ్యూనికేషన్, వ్యాపారం, విద్య, వినోదాలకోసంతెరలనుఆశ్రయిస్తున్నాం.స్మార్ట్‌ఫోన్‌నీలితెరలకుబానిసలుగామారిపోతున్నాం. ప్రపంచ మానవాళి రోజుకు సగటున 6.5 7.0 గంటల పాటు స్క్రీన్ టైమ్ గడుపుతున్నారు. ఇండియాలో సహితం సగటున 5.0 7.4 గంటల పాటు స్మార్ట్ తెరలకు అతుక్కుపోతున్నారు. స్మార్ట్‌ఫోన్ దూరమైతే ప్రాణం పోయినంత పని అవుతున్నది. స్మార్ట్ తెరలు దూరమైతే ఊపిరి ఆగినంత అనుభవం కలుగుతోంది. మన జీవితాలు సాంకేతిక తెరలకు అంకితమైపోయాయి.

**స్మార్ట్ తెరలతో మహా చిక్కులు:**

స్మార్ట్‌ఫోన్, ఐప్యాడ్, ల్యాప్‌టాప్, కంప్యూటర్, టివీ, టాబ్లెట్ లాంటి స్మార్ట్ ఎలక్ట్రానిక్ ఉపకరణాలు మన ఇండ్లల్లో నిత్యావసరాలు అయ్యాయి.పని పిల్లల నుంచి పండు ముసలి వరకు అందరూ ప్రతి రోజు గంటల పాటు అవసరం ఉన్నా లేకున్నా ఆయా కాంతి వంతమైన తెరలకు అతుక్కుపోతున్నారు. రోజులు, వారాలు, మాసాలు, ఏండ్ల పాటు స్క్రీన్ టైమ్ పెరగడంతో మన శరీరాలు అనారోగ్యాల బారిన పడుతున్నారు.



స్క్రీన్ టైమ్ పెరగడం కారణంగా మానసిక ఒత్తిడి పెరగడం, ఏకాగ్రత తగ్గడం, నిద్రలేమి, పనిలో ఉత్సాదకత పడిపోవడం, కంటి జబ్బులు కమ్ముకోవడం, మయోపియా, మెడ నొప్పులు, భుజం నొప్పులు, తలనొప్పి, మెదడుపై తీవ్ర ప్రభావాలు చూపడం లాంటి ప్రమాదకర ప్రతికూల లక్షణాలు కనిపిస్తున్నాయి. ఉద్యోగాల్లో భాగంగా రోజుకు 8 10 గంటలు నీలి తెరల ముందు స్మార్ట్ వర్క్ చేసే ఉద్యోగుల ఆరోగ్యాలు గాల్లో దీపాలు అవుతున్నాయి. పిల్లలు, విద్యార్థులు, యువత, మహిళలు సహితం అనవసరమైన, ప్రయోజనం లేని సామాజిక మాధ్యమాల్లో తలదూర్చి తమ విలువైన సమయం, ఆరోగ్యాలకు కోల్పోతున్నారు. ఈ ప్రమాదకర సమస్యకు విరుగుడుగా వచ్చిందే "డిజిటల్ ఉపవాసం" లేదా "డిజిటల్ ఫాస్టింగ్" అనబడే సానుకూల ప్రక్రియ అని తెలుసుకోవాలి. ఒక వ్యక్తి నిర్దిష్ట సమయం (గంటలు లేదా రోజుల పాటు) పాటు డిజిటల్ తెరలను దూరంగా ఉండడాన్ని "డిజిటల్ ఉపవాసం" లేదా "డిజిటల్ ఫాస్టింగ్" అని నిర్వచిస్తున్నారు. డిజిటల్ తెరలను విరామం ఇవ్వడం ద్వారా కళ్లకు విశ్రాంతి, మనసుకు ప్రశాంతత, శారీరక ఉపశమనం, సరిగ్గా నిద్రపోవడం లాంటి ప్రయోజనాలు కలుగుతాయి. రోజుకు కొన్ని గంటలు లేదా వారంలో ఒకటి లేదా అంత కన్న ఎక్కువ రోజులు స్క్రీన్‌లకు దూరంగా ఉండడం మన దినచర్యలో భాగం కావాలి.



డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# తృటిలో మేటి సందర్శన

ఆయన వచ్చారు, ప్రధాని మోడీని కలిశారు, వెళ్లిపోయారు. సాధారణ ప్రజలు యునైటెడ్ ఆరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నెహ్యాన్ పర్యటన గురించి అనుకున్నారు. గత సోమవారం ఆయన అలా వచ్చి, ఇలా వెళ్లిపోవడంతో ఆన్‌లైన్ ఊహాగానాలు ఊపందుకున్నాయి. భారత్‌కు మూడవ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అయిన యుఎఇ, తన రక్షణ, విదేశాంగ మంత్రులతో కలిసి రావడంతో అందరూ విస్తుపోయారు.

ఎంబిజెడ్‌గా ప్రాచుర్యం పొందిన షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ ల్ నెహ్యాన్, సోమవారం సాయంత్రం కొత్త ఢిల్లీలో దిగారు, కొద్ది గంటల్లోనే తిరిగి వెళ్లిపోయారు. ఆయన అలా ఎటువంటి హడావిడీ లేకుండా క్లుప్తంగా వచ్చి వెళ్లిపోవడంతో అనేక సిద్ధాంతాలు, ఎందుకు వచ్చారో అనే ప్రశ్నలు, అలా అత్యవసరంగా ఎందుకు వెళ్లిపోయారో అనే అనుమానాలు తలెత్తాయి.

కాగా, ఆ మూడు గంటల్లో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారానికి గల అవకాశాన్ని ప్రధాని మోడీ, యుఎఇ అధ్యక్షుడు సమీక్షించారు. గత దశాబ్ద కాలంగా భారత్ యుఎఇ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం బలోపేతం అవుతూ వస్తోందని ప్రధాని కార్యాలయం నుంచి వెలువడిన ప్రకటన పేర్కొనడం గమనార్హం. ఎందుకంటే, భారత్‌ను పశ్చిమాసియా ద్వారా యూరోప్‌తో లంకె కలపాలన్న లక్ష్యంతో ప్రారంభించిన ఇండియా మిడిల్ ఈస్ట్ యూరోప్ ఎకనమిక్ కారిడార్ (ఐమెక్ ఐఎంఇసి)లో భారత్, యుఎఇ కీలక భాగస్వాములు. ఈ క్రమంలో ఇరు దేశాల మధ్య సానుకూల సంబంధాలు పెరుగుతూ వస్తున్నాయి. ఈ పర్యటన అనుకోనిది కాదని, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆహ్వానం మేరకు వచ్చారని, కొన్ని గంటల్లోనే నిర్ణయించలేని పలు ఒప్పందాల పై సంతకాలు జరిగాయనే వార్త వెలువడింది. ఐమెక్ వంటి అత్యంత భారీ కారిడార్ నిర్మాణ నేపథ్యంలో ఆ ప్రాంతంలో ఉగ్రవాదానికి తావుండకూడదని ఇరు దేశాలూ అభిప్రాయపడడం సహజమే. ఆ విషయాన్నే ఇరువురు నాయకులూ సీమాంతర ఉగ్రవాదం సహా తీవ్రవాదాన్ని అన్ని రూపాలలో ఖండిస్తున్నామంటూ తమ ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, తమ మధ్య ఉన్న ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2032 నాటికి 200 బిలియన్ డాలర్లకు పెంచాలని అంగీకారానికి రావడం ఇరు దేశాల మధ్య సానుకూల సంబంధాల దిశను సూచిస్తోంది. ఇక, 3 బిలియన్ డాలర్ల విలువైన లిక్విఫైడ్ నాచురల్ గ్యాస్ ను యునైటెడ్ ఆరబ్ ఎమిరేట్స్ నుంచి కొనుగోలు చేస్తామన్న ఒప్పందంపై భారత్ సంతకాలు చేయడం ద్వారా యుఎఇకి అతిపెద్ద కస్టమర్ భారత్ కానుంది.

ఇరు దేశాల మధ్య సాంకేతికత, ఎఐలతో పాటుగా ఆహార భద్రత సమస్యను పరిష్కరించడంపై చర్చలు జరిగాయి. వీటితో పాటుగా యుఎఇ అంతరిక్ష ఏజెన్సీ, భారత్‌కు చెందిన నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ మధ్య అంతరిక్ష పరిశ్రమ అభివృద్ధికి, సహకారానికి తోడ్పడేలా ఉమ్మడి చొరవను ప్రారంభించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా లాంచ్ కాంప్లెక్స్‌లు, తయారీ, సాంకేతిక జోన్ల నిర్మాణం, స్టార్టప్‌లకు ఇన్‌క్యుబేషన్ సెంటర్లు, శిక్షణా సంస్థలు, ఎక్స్‌చేంజ్ కార్యక్రమాలు ఉంటాయి.

ఇరు దేశాల నాయకులూ పరస్పర సార్వభౌమత్వం, భౌగోళిక సమగ్రత, వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి పట్ల గౌరవాన్ని వ్యక్తం చేస్తూ, సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి స్థిరమైన, బలమైన ద్వైపాక్షిక రక్షణ, భద్రతా సహకారం మూలమని అభిప్రాయపడ్డారు. ఇరు దేశాలూ ఉగ్రవాద నిధులను ఎదుర్కొని, మనీలాండరింగ్‌కు అడ్డుకట్ట వేసే కృషిని బలోపేతం చేసేందుకు ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ ఎటిఎఫ్) చట్రంలో సహకారాన్ని కొనసాగించాలని అంగీకరించారు.





### యుఎఇ , భారత్ ఒప్పందాలు

పైన పేర్కొన్న వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యాన్ని, ద్వైపాక్షిక పౌర అణు ఒప్పందాన్ని ప్రోత్సహించడం, హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పిసిఎల్)కు అబూదాబీ నేషనల్ కంపెనీ గ్యాస్‌కు (ఎడిఎన్‌ఒసి గ్యాస్) మధ్య లెటర్స్ ఆఫ్ ఇంటెంట్‌లు, అవగాహనా ఒప్పందం పై సంతకాలు జరిగాయి.

వీటితో పాటుగా, గుజరాత్ ప్రభుత్వానికీ, యుఎఇ పెట్టుబడుల మంత్రిత్వ శాఖకూ మధ్య ధొలేరా ప్రత్యేక పెట్టుబడి ప్రాంతం అభివృద్ధిపై సహకార ఒప్పందాలు కుదిరాయి. ఇందులో భాగంగా, యుఎఇ ఒక అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం, గ్రీన్‌ఫీల్డ్ రేవు, రైల్వే అనుసంధానత, ఇంధన మౌలిక సదుపాయాలు, స్మార్ట్ టౌన్‌షిప్‌తో పాటుగా పైలెట్ శిక్షణా కేంద్రం, విమానాల నిర్వహణ, సమగ్ర మరమత్తులు (ఎంఆర్ఒ) కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే అంగీకారానికి వచ్చారు.



# జాతీయం- అంతర్జాతీయం



## హైదరాబాద్‌లో స్విస్ మాల్

### ప్రపంచంలోనే తొలిసారి

**దావోస్ :** స్విట్జర్లాండ్‌లోని వాడ్ రాష్ట్ర ముఖ్యమంత్రి క్రిస్టెల్ లూసియర్ బ్రోడార్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఇందులో భారత్–స్విట్జర్లాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో రెండు రాష్ట్రాల మధ్య సహకార పెంపుపై చర్చించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి తెలంగాణ రైజింగ్–2047 విజన్‌ను స్విస్ ప్రతినిధులకు వివరించారు. హైదరాబాద్‌లో ప్రపంచంలోనే తొలిసారి 'స్విస్ మాల్' ఏర్పాటు చేయాలనే ఆలోచనను ముఖ్యమంత్రి ప్రతిపాదించగా, స్విస్ బృందం వెంటనే సానుకూలంగా స్పందించింది. ఇద్దరు సీఎంలు ఫుట్‌బాల్ ఆటగాళ్లే కావడంతో, క్రీడల రంగంలో భాగస్వామ్యంపై కూడా విస్తృతంగా చర్చించారు. క్రీడా శిక్షణ, మౌలిక వసతుల అభివృద్ధిలో కలిసి పనిచేయవచ్చని అభిప్రాయపడ్డారు. సంస్కృతి, విద్య, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ రంగాల్లో.. ముఖ్యంగా హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్, క్రీడల విభాగాల్లో.. పరస్పర సహకారానికి అవకాశాలపై లీడర్లు అభిప్రాయాలు పంచుకున్నారు. రిటైల్ , లైఫ్ సైన్సెస్‌లో రంగాల్లో అవకాశాలపై చర్చించారు. మహిళా సాధికారతకు సంబంధించి స్వయం సహాయక సంఘాల కార్యక్రమాలపై స్విస్ బృందం ఆసక్తి కనబరిచింది. సహకార అంశాలు పరిశీలించేందుకు త్వరలోనే స్విట్జర్లాండ్ బృందం హైదరాబాద్‌కు వస్తుందని వాడ్ రాష్ట్ర పరిశ్రమలు, ఆర్థిక శాఖ మంత్రి ఇసబెల్ మోరెట్ తెలిపారు.



## సింగరేణి అక్రమాలపై దర్యాప్తు జరగాల్సిందే

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు బంగారు బాతుల సింగరేణి**

- రాష్ట్రం ముందుకొస్తే కేంద్రం నిర్ణయం తీసుకుంటుంది
- అవినీతి, అక్రమాలకు సంస్థ కేరాఫ్‌గా మారింది
- మంత్రుల కొట్లాటతోనే అవినీతి బయటికి..
- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

**న్యూఢిల్లీ :** తెలంగాణలో నాలుగు ఉమ్మడి జిల్లాల్లో విస్తరించి ఉన్న సింగరేణి అవినీతి, అక్రమాలకు కేంద్రంగా మారిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సింగరేణి అక్రమాలపై దర్యాప్తు జరగాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో రాష్ట్రం ముందుకొస్తే కేంద్రం.. విచారణ అంశాన్ని పరిశీలిస్తుందని చెప్పారు. సింగరేణిని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రుల మధ్య వాటాల వివాదంతోనే సింగరేణి అవినీతి అంశం వెలుగులోకి వచ్చిందన్న కిషన్ రెడ్డి.. ఒక్క నైనీ బ్లాకే మాత్రమే కాకుండా పూర్తి స్థాయిలో దర్యాప్తు జరగాలన్నారు. సింగరేణి నిర్వహణ బాధ్యత కేంద్ర తీసుకుంటుందని చెప్పారు. ఈ విచారణపై సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాస్తానని కిషన్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం ఒడిశాలోని నైనీ బొగ్గు గనిపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృత చర్చ జరుగుతోందన్నారు. అందుకే ఈ విషయంలో స్పష్టత ఇచ్చేందుకే తాను మీడియా ముందుకు వచ్చానన్నారు. గతంలో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్‌ను సింగరేణిని వాడుకుంటున్నాయని ఆరోపించారు. గతంలో సింగరేణి మైనింగ్ చేస్తామని ముందుకొస్తే బీఆర్ఎస్ బెదిరించి బ్లాక్‌లు.. ప్రైవేటు సంస్థలకు వెళ్లేలా వ్యవహరించిందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే పంథాను కొనసాగిస్తోందని ఆరోపించారు. అందుకే తాడిచర్ల కోల్ బ్లాక్‌ను కేంద్రం జెన్‌కోకు కేటాయించిందని తెలిపారు. తెలంగాణ విద్యుత్ సంస్థలకు బొగ్గును అందించాలని కేంద్రం నైనీ కోల్ బ్లాక్–2 ను తమ రాష్ట్రానికి కేటాయించిందన్నారు. నైనీ కోల్ బ్లాక్ విషయంలో కేంద్రం సహకారం అందిస్తోందని స్పష్టం చేశారు. ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక అక్కడి ప్రభుత్వంతో అనుమతులపై తాను చర్చించానన్నారు. ఇందులో కీలక విషయాలు వెలుగుచూశాయన్నారు. నైనీ బొగ్గు గనులకు చివరి అనుమతులు వచ్చాక టెండర్లు పూర్తి చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం నాన్చుతోందని అన్నారు. టెండర్లను రద్దు చేయడం సింగరేణికి ప్రత్యక్షంగా అన్యాయం చేయడమేనని పేర్కొన్నారు. సైట్ విజిట్‌కు సింగరేణి సర్టిఫికెట్ ఇవ్వాలనే నిబంధన పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని కేంద్రమంత్రి తప్పుబట్టారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ అనేది సెల్ఫ్ సర్టిఫికేషన్ నిబంధన మాత్రమేనని అన్నారు. కానీ సింగరేణి ఇవ్వాలనే నిబంధన పెట్టడం ఏంటని ప్రశ్నించారు. దీని అర్థం.. వారికి నచ్చిన వారికి నైనీ బ్లాక్ ఇవ్వాలని చూస్తున్నారని వ్యాఖ్యానించారు. సింగరేణి సంస్థపై పూర్తి హక్కులు కేంద్రానివే అన్నట్లు రాష్ట్రంలో జరుగుతున్న ప్రచారాన్ని కిషన్ రెడ్డి ఖండించారు. ఈ సందర్భంగా సంస్థలోని వాటాల వివరాలను ఆయన స్పష్టం చేశారు. సింగరేణిలో తెలంగాణకు 51 శాతం వాటా ఉండగా, కేంద్రానిది 49 శాతం వాటా ఉందన్నారు. మెజారిటీ వాటా రాష్ట్ర ప్రభుత్వం వద్దే ఉన్న నేపథ్యంలో.. సంస్థను కాపాడుకోవడంలో రాష్ట్రం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఎప్పుడూ సింగరేణి అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు.



### సింగరేణి పరిస్థితి దిగజారుతోంది...

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత సంస్థ నిర్వహణలో వస్తున్న మార్పులు, కొన్ని నిర్ణయాల ఫలితంగా సంస్థ పరిస్థితి దిగజారుతోందని కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు లాభాల బాటలో ఉన్న సంస్థ, ఇప్పుడు సమస్యల వలయంలో చిక్కుకోవడం దురదృష్టకరమన్నారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం రూ.47 వేల కోట్ల బకాయి ఉందన్న కేంద్రమంత్రి.. గ్రేడ్–11 కోల్‌ను టన్నుకు రూ.4,800కి అమ్ముతోందని అన్నారు. కోల్ ఇండియా గ్రేడ్–11 కోల్‌ను రూ.1,605కి అమ్ముతోందని తెలిపారు. సింగరేణి బొగ్గు క్వాలిటీ కూడా తగ్గుతోందని చెప్పారు. అందుకే తెలంగాణ బొగ్గు కొనుగోలుకు ఏపీ సహా పలు రాష్ట్రాలు వెనకడుగు వేస్తున్నాయని అన్నారు.

## రూ.12,500 కోట్లతో రాష్ట్రంలో స్టీల్ ప్లాంట్



**దావోస్ :** డక్టైల్ ఐరన్ (డీఐ) పైపుల తయారీలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన రష్మి గ్రూప్, తెలంగాణలో స్టీల్ ఉత్పత్తి యూనిట్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం రష్మి గ్రూప్‌తో కలిసి రూ.12,500 కోట్ల పెట్టుబడికి అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలో 12 వేల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. ఈ మేరకు రష్మి గ్రూప్ ప్రమోటర్ సజ్జన్ కుమార్ పట్వారి, డైరెక్టర్ సంజిబ్ కుమార్ పట్వారి తెలంగాణ రైజింగ్ బృందంతో భేటీ అయ్యారు. స్టీల్ ప్లాంట్ లేబర్–ఇంటెన్సివ్ తయారీ విధానంతో పనిచేస్తుందని, పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని డైరెక్టర్ సంజిబ్ కుమార్ తెలిపారు. ఈ పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకువచ్చిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు .. తెలంగాణ విభిన్న పరిశ్రమలతో బలమైన పారిశ్రామిక వ్యవస్థగా ఎదుగుతోందని , ముఖ్యంగా తయారీ రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన అన్ని సహాయ సాకారాలు, బొగ్గు సరఫరా లింకేజీలతో సహా అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గ్రీన్ మాన్యుఫ్యాక్చరింగ్, సర్క్యులర్ ఎకానమీ వంటి రంగాల్లో తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యంపై చర్చలు జరిగాయి. రష్మి గ్రూపు ఆసియాలోని 40 దేశాలు, యూరప్, ఆఫ్రికా, ఉత్తర,దక్షిణ అమెరికా దేశాల్లో కంపెనీ కార్యకలాపాలు నిర్వహిస్తుంది.

### ప్రపంచంలోనే తొలి బ్యూటీ-టెక్ జీసీసీ ఏర్పాటు..

ప్రపంచంలోనే తొలి బ్యూటీ–టెక్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు లోరియల్ సంస్థ ప్రకటించింది. ఈ అత్యాధునిక కేంద్రాన్ని ఈ ఏడాది నవంబర్‌లో ప్రారంభించనుంది. దావోస్ లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ – 2026లో సీఎం రేవంత్ రెడ్డి లోరియల్ సీఈవో నికోలస్ హియెరోనిమస్ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో లో హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులతో బ్యూటీ–టెక్ జీసీసీ ఏర్పాటు చేసే నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ జీసీసీ ఏర్పాటుతో లోరియల్‌కు గ్లోబల్ ఇన్నోవేషన్, టెక్నాలజీ, డేటా, సప్లై చైన్ కార్యకలాపాలకు హైదరాబాద్ కీలక కేంద్రంగా నిలవనుంది. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఏఐ, అనలిటిక్స్ రంగాల్లో రూపొందించే సాంకేతిక పరిష్కారాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న లోరియల్ యూనిట్లకు అందిస్తామని హియెరోనిమస్ తెలిపారు. దీంతో గ్లోబల్ ఎంటర్‌ప్రైజ్ కార్యకలాపాలకు హైదరాబాద్ ప్రాముఖ్యత మరింత పెరుగనుంది. నవంబర్‌లో జీసీసీ ప్రారంభోత్సవానికి రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును లోరియల్ ఆహ్వానించింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. లోరియల్ జీసీసీని హైదరాబాద్‌కు తీసుకురావాలన్న ఆలోచనపై సీఎం ప్రత్యేక ఆసక్తి చూపారని, ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. హైదరాబాద్ పెట్టుబడులకు అనువైన ప్రదేశమని చెప్పారు. మెడ్‌టెక్, హెల్త్‌టెక్ మాత్రమే కాకుండా బ్యూటీ–టెక్ వంటి కొత్త విభాగాల్లోనూ తెలంగాణ ముందుంటోందని మంత్రి అన్నారు. ఇప్పటికే మారియెట్, వ్యాన్ గార్డ్, నెట్ ఫ్లిక్స్, మెక్ డోనాల్డ్స్, హినెకెన్ , జాగర్ , కోస్ట్కో వంటి గ్లోబల్ కంపెనీలు హైదరాబాద్‌లో జీసీసీలను ఏర్పాటు చేశాయన్నారు. తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్ గురించి ప్రతినిధి బృందం ఈ సందర్భంగా వివరించింది. జీసీసీతో పాటు మాన్యుఫాక్షరింగ్ యూనిట్ ఏర్పాటుకు తెలంగాణలో ఉన్న అవకాశాలను పరిశీలించాలని లోరియల్ను ఆహ్వానించారు. రాష్ట్రంలో ఉన్న మౌలిక వసతులు, పరిశ్రమల ఎకోసిస్టమ్‌ను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో తయారీ రంగంలోనూ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు హియెరోనిమస్ సానుకూలంగా స్పందించారు.

### రూ.6 వేల కోట్లతో రియాక్టర్ విద్యుత్ ప్లాంట్...

క్లీన్ ఎనర్జీ రంగంలో తెలంగాణ మరో ముందడుగు వేసింది. రూ.6 వేల కోట్ల పెట్టుబడితో స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ (ఎస్ఎంఆర్) ఆధారిత విద్యుత్ ప్రాజెక్ట్ అభివృద్ధికి స్లోవాకియాకు చెందిన న్యూక్లర్ ప్రొడక్ట్స్ సంస్థ ముందుకు వచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆ సంస్థ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈఓఐ) సమర్పించింది. ఆ సంస్థ ప్రతినిధులు దావోస్ లో సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. తెలంగాణ సర్కార్ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉందన్నారు. 2047 నాటికి నెట్–జీరో అభివృద్ధి లక్ష్యాన్ని సాధించడంలో సుస్థిర అభివృద్ధే తమ లక్ష్యమన్నారు. స్లోవాకియాకు చెందిన ఐక్యూ క్యాపిటల్ , భారత్‌కు చెందిన గ్రీన్ హౌస్ ఎన్విరో సంయుక్త భాగస్వామ్యంలో న్యూక్లర్ ప్రొడక్ట్స్ సంస్థ ఏర్పడింది. గరిష్ఠంగా 300 మెగావాట్ల సామర్థ్యంతో తెలంగాణ లో కొత్త విద్యుత్ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తోంది. ఈ ప్రాజెక్ట్ మొత్తం పెట్టుబడి విలువ 600 మిలియన్ యూరోలు (సుమారు రూ.6,000 కోట్లు)గా ఉంది. ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఐక్యూ క్యాపిటల్ గ్రూప్ ఛైర్మన్ డా. జాన్ బాబిక్, గ్రూప్ సీఈఓ , డైరెక్టర్ అనిల్ కుమార్ బావిసెట్టి, గ్రీన్ హౌస్ ఎన్విరో సీఈఓ , డైరెక్టర్ మొలుగు శ్రీపాల్ రెడ్డి , స్లోవాక్ రిపబ్లిక్ కాన్సుల్ మాటుస్ జెమెస్ పాల్గొన్నారు.

### ఏబీ ఇన్‌బెవ్.. యూనిట్ విస్తరణకు సిద్ధం..

ప్రపంచవ్యాప్తంగా 50కుపైగా దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రపంచంలో అతిపెద్ద బీరు తయారీ సంస్థ ఏబీ ఇన్‌బెవ్, తెలంగాణలో ఇప్పటికే ఉన్న తన తయారీ యూనిట్‌ను విస్తరించేందుకు భారీగా పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించింది. దావోస్ లో 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం... ఏబీ ఇన్‌బెవ్ చీఫ్ లీగల్ అండ్ కార్పొరేట్ అఫైర్స్ ఆఫీసర్ జాన్ బ్లడ్తో సమావేశమయ్యారు. తెలంగాణలో ప్రస్తుతం రెండు తయారీ యూనిట్లు నిర్వహిస్తున్న ఏబీ ఇన్‌బెవ్, సుమారు 600 మందికి ఉపాధి కల్పిస్తోంది. రాష్ట్రానికి కొత్త పెట్టుబడి లభించినందుకు సీఎం రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో భాగంగా 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశగా ఆదాయ వృద్ధి, సామర్థ్య నిర్మాణమే కీలకమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. విధాన స్థిరత్వం, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, వ్యాపార సౌలభ్యంతో తెలంగాణలో పెట్టుబడిదారుల్లో దీర్ఘకాలికంగా విశ్వాసం పెరుగుతోందన్నారు. ఈ సమావేశంలో సర్క్యులర్ వాటర్ వినియోగం, మహిళా సాధికారత, విద్య, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించిన సీఎస్ఆర్ వ్యయాలు వంటి అంశాల్లో తెలంగాణతో కలిసి పనిచేసే అవకాశాలపై కూడా చర్చించారు.

### ఇకపై ఏటా హైదరాబాద్‌లో ఫాలో అప్ సదస్సు..

ప్రతి ఏడాది జులై లో హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఫాలో–అప్ సదస్సు నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. దావోస్‌లో జరిగిన 'జాయిన్ ది రైజ్' కార్యక్రమంలో ఈ ప్రతిపాదనకు గ్లోబల్ బిజినెస్ లీడర్లు, పాలసీ నిర్ణేతలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. ప్రస్తుత కాలంలో పెట్టుబడుల ఒప్పందాలు, వ్యాపార వాణిజ్య నిర్ణయాలకు ఒక సంవత్సరం చాలా ఎక్కువ సమయమని సీఎం అన్నారు. అందుకే ప్రతి ఏడాది జులై లేదా ఆగస్టులో హైదరాబాద్‌లో ఫాలో–అప్ ఫోరం నిర్వహించాలని వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ప్రతినిధులకు సూచించారు. ఇటీవల హైదరాబాద్ లో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైందని, రూ.5.75 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు ఆకర్షించిందని సీఎం తెలిపారు. ప్రతి ఏడాది మేము ఎంవోయూలపై సంతకాలు చేయడానికి దావోస్ కు వస్తామన్నారు.. కానీ ఈసారి గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావటంతో, తెలంగాణ రైజింగ్ విజన్, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పాలసీలను ప్రపంచానికి చూపించడానికి వచ్చినట్లు సీఎం వెల్లడించారు. గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లకు హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా మారిందని సీఎం అన్నారు. మూసీ నది పునరుజ్జీవనంతో పాటు రివర్‌ఫ్రంట్ అభివృద్ధి చేసి నైట్ టైమ్ ఎకానమీపై దృష్టి పెడుతామని చెప్పారు. దేశంలోనే 24 గంటలు పనిచేసే తొలి నగరంగా హైదరాబాద్ ను అభివృద్ధి చేస్తామన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని ప్రకటించారు. ఇందులో 50 శాతం కంటే ఎక్కువ గ్రీన్ కవర్ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలను ప్రదర్శించారు. అదే వేదికపై తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్, తెలంగాణ నెక్స్ట్–జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026–2030ను ఆవిష్కరించారు. సమావేశంలో పాల్గొన్న మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి హైదరాబాద్ లో మెట్రో రైలు విస్తరణ, చెరువులు, కుంటల పునరుజ్జీవనం వంటి గేమ్–చేంజర్ ప్రాజెక్టులను వివరించారు. కొత్తగా ప్రతిపాదించిన కోర్, ప్యూర్, రేర్ ఆర్థిక వృద్ధి జోన్ల ప్రణాళికలను ప్రస్తావించారు. తెలంగాణకు అపారమైన పెట్టుబడి అవకాశాలు ఉన్నాయని, సాంకేతికత, అనుభవం, నైపుణ్యాల పరంగా గ్లోబల్ కంపెనీల సహకారం స్వీకరిస్తామని అన్నారు. ప్రముఖ నటుడు చిరంజీవి ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సీఎం తో కలిసి ఆయన విందులో పాల్గొన్నారు.



## ఇజ్రాయిల్ బలగాల దురాక్రమణ



**జెరూసలేం :** తూర్పు జెరూసలేంలో పాలస్తీనా శరణార్థుల వ్యవహారాలు చూసే ఐక్యరాజ్య సమితి సంస్థ యూఎన్ఆర్‌డబ్ల్యూఏ ప్రధాన కార్యాలయంలో కొంత భాగాన్ని ఇజ్రాయిల్ బలగాలు మంగళవారం కూల్చివేశాయి. 'ఇది అనూహ్యమైన దాడి' అని యూఎన్ఆర్‌డబ్ల్యూఏ ఎక్స్ పోస్టులో పేర్కొంది. ఇది అంతర్జాతీయ చట్టాన్ని తీవ్రంగా ఉల్లంఘించడం కిందకే వస్తుందని, ఐక్యరాజ్య సమితి హక్కులు, రక్షణలన్నింటిపై దాడి చేయడమేనని ఆ పోస్టు పేర్కొంది. సిబ్బంది ఫోన్లను, కంప్యూటర్లను సైన్యం లాగేసుకుందని, వారిని బలవంతంగా కార్యాలయ ఆవరణ నుండి బయటకు గెంటివేశారని ఆ పోస్టు పేర్కొంది. అలాగే పాలస్తీనా ట్రేడ్ స్కూల్‌పై ఇజ్రాయిల్ బలగాలు బాష్పవాయు గోళాలు ప్రయోగించాయి. యూఎన్ఆర్‌డబ్ల్యూఏ వెస్ట్ బ్యాంక్ డైరెక్టర్ రోలాండ్ ఫ్రెడరిక్ మాట్లాడుతూ, ఇజ్రాయిల్ బలగాలు జెరూసలేం శివార్లలోని క్వలాండియాలో యువ పాలస్తీనియన్ల కోసం ఏర్పాటు చేసిన వొకేషనల్ స్కూల్‌కు చేరుకుని కాల్పులు జరిపాయని చెప్పారు. ఈ స్కూల్లో 300మందికి పైగా యువ శరణార్థులు టెక్నాలజీలో, వెల్డింగ్‌లో ఉపాధి శిక్షణ పొందారని తెలిపారు.గాజా, వెస్ట్ బ్యాంక్, అలాగే జోర్డాన్, లెబనాన్, సిరియాల్లో పాలస్తీనా శరణార్థులకు ఆరోగ్య సంరక్షణను అందిస్తూ వారికోసం స్కూళ్ళు, శరణార్థుల శిబిరాలను యుఎన్ఆర్‌డబ్ల్యుఎ నడుపుతోంది. ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను అందించడంలో ఈ సంస్థ చాలా కీలకంగా వ్యవహరిస్తోంది. ఆ సంస్థ పైనే నిషేధం విధిస్తూ కొత్త చట్టం తీసుకువచ్చిన నేపథ్యంలో ఈ విధ్వంస చర్యలు చేపట్టినట్లు ఇజ్రాయిల్ విదేశాంగ శాఖ తెలిపింది. హమాస్‌కు మిలిటెంట్ గ్రూపులతో ఈ సంస్థ సంబంధాలు కొనసాగిస్తోందని ఆరోపించింది. జాతీయ భద్రతా వ్యవహారాల మంత్రి ఇటామిర్ బెన్ గివిర్ మొత్తంగా ఈ వ్యవహారంపై ఒక ప్రకటన చేశారు.

## గ్రీన్‌లాండ్‌లో యుద్ధ మేఘాలు



**వాషింగ్టన్ :** గ్రీన్‌లాండ్‌ను చేజిక్కించుకునేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ యుద్ధ సన్నాహాలు ప్రారంభించారు. గ్రీన్‌లాండ్ లోని కీలక సైనిక స్థావరానికి యుద్ధ విమానాల ను తరలించాలని నిర్ణయించారు. పిటుఫిక్ స్పేస్ బేస్‌కు త్వరలోనే విమానాలు చేరుకుంటా యని ఉత్తర అమెరికా ఏరోస్పేస్ డిఫెన్స్ కమాండ్ తెలిపింది. ఆర్కిటిక్ ప్రాంతంలో రక్షణ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు వీటిని మోహరిస్తున్నట్టు చెప్పింది. అమెరికా, కెనడా దేశాల లోని స్థావరాల నుంచి పనిచేయడంతో పాటు కమాండ్ కార్యకలాపాలకు అవి మద్దతు ఇస్తాయని వివరించింది. కెనడా, డెన్మార్క్‌లతో రక్షణ సహకారానికి అవి ఉపకరిస్తాయని తెలిపింది. యుద్ధ విమానాల మోహరింపుపై గ్రీన్‌లాండ్‌కు ముందుగానే సమాచారం ఇచ్చామని కమాండ్ చెప్పింది. బల ప్రయోగంతో గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు 'నో కామెంట్' అని ట్రంప్ బదులిచ్చారు. అయితే గ్రీన్‌లాండ్‌ను చేజిక్కించుకోని పక్షంలో యూరోపియన్ దేశాలపై సుంకాలతో విరుచుకుపడతానని తేల్చి చెప్పారు. దావోస్‌లో జరగనున్న ప్రపంచ ఆర్థిక ఫోరం సమావేశాలలో గ్రీన్‌లాండ్ అంశాన్ని లేవనెత్తాలని ట్రంప్ భావిస్తున్నారు. ఆ దీవిని కొనుగోలు చేసే విషయంపై దావోస్‌లో చర్చిస్తానని ఆయన చెప్పారు. గ్రీన్‌లాండ్‌ను రక్షించే సత్తా డెన్మార్క్‌కు లేనందున దానిని తమ ఆధీనంలోకి తీసుకుంటామని తెలిపారు.

# రహదారి పక్కన కంకర కుప్పలు

## వాహనదారుల ఇబ్బందులు



**జయశంకర్ భూపాలపల్లి,వుదయం :** జాతీయ రహదారి పక్కన కంకర కుప్పలు నిల్వ ఉంచడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో జాతీయ రహదారి పక్కన కంకర కుప్పలు నిల్వ ఉంచడంతో కంకర రహదారిపై రావడంతో ఇటీవల కాలంలో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పయ్యాయని త్రుటిలో ప్రమాదాలు తప్పాయని కంకర కుప్పలు రహదారి పక్కన నిల్వ ఉంచడంతో కంకర రహదారి పై రావడటంతో ద్విచక్ర వాహనాలు జారిపడి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని ప్రజలనుకుంటున్నారు జాతీయ రహదారి కావడంవల్ల నిత్యం వందల సంఖ్యలో ఇసుక లారీలు ఇతర వాహనాలు భారీ సంఖ్యలో రవాణా జరుగుతాయని రాత్రి వేళల్లో ఆ రోడ్డుపై విద్యుత్ దీపాలు ఉండకపోవడంతో చీకటి ప్రదేశంగా ఉంటుందని రాత్రి సమయాల్లో రహదారిపై వెళ్లే వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రహదారుల పక్కన కంకర కుప్పలు నిల్వ ఉంచకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# రైతు భరోసా స్పష్టతపై రైతుల ఆందోళన

## ప్రభుత్వం వెంటనే కార్యాచరణ ప్రకటించాలి

## రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మారెడ్డి



**సిద్దిపేట,వుదయం:** ఎన్నికలకు ముందు ఎలాంటి షరతులు లేకుండా ప్రతి రైతుకు ప్రతి ఎకరాకు సంవత్సరానికి రూ.15,000 చొప్పున రైతు బరోసా అందిస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు పథకం అమలుపై స్పష్టత ఇవ్వకపోవడం వల్ల రాష్ట్ర రైతుల్లో అయోమయం నెలకొన్నదని సిద్దిపేట జిల్లా రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మా రెడ్డి రామలింగా రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా రూపొందించిన రైతు బరోసా పథకాన్ని క్రమబద్ధంగా, పారదర్శకంగా అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్రప్రభుత్వానిదేనని ఆయన తెలిపారు. ప్రతి పంటకాలంలో రైతులకు భరోసాగా నిలవాల్సిన ఈ పథకం విషయంలో స్పష్టమైన కార్యాచరణ లేకపోవడం వల్ల ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్న విశ్వాసం దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు.గత ప్రభుత్వాల కంటే మెరుగైన పాలన, రైతులకు మరింత మేలు జరుగుతుందన్న ఆశతో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు అధికారంలోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రైతుల ఆశలు, విశ్వాసాలు దెబ్బతినకుండా చూడాలంటే రైతు బరోసా పథకం అమలుపై తక్షణమే స్పష్టమైన నిర్ణయాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతు బరోసా పథకం కింద ప్రతి సంవత్సరం ఏ తేదీ వరకు, ఎంత మొత్తాన్ని, ఏ విధంగా రైతులకు అందించనున్నారో ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించి, రైతులు అయోమయానికి గురికాకుండా చూడాలని రాష్ట్ర రైతులు వినయపూర్వకంగా కానీ బలంగా కోరుతున్నారని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో రైతు రక్షణ సమితి నాయకులు పన్యాల విష్ణువర్ధన్ రెడ్డి, గడ్డం. శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రాము రెడ్డి, దేవేందర్ రెడ్డి, మొత్క్ లక్ష్మయ్య, యాదం రావు, సంతోష్ రెడ్డి, భూపతి రెడ్డి పాల్గొన్నారు.

# మేడారం జాతరకు హుస్నాబాద్ బస్టాండ్‌లో ప్రత్యేక ఏర్పాట్లు



**హుస్నాబాద్,వుదయం :** హుస్నాబాద్, మేడారం జాతర సందర్భంగా ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టినట్లు హుస్నాబాద్ డిపో మేనేజర్ వెంకన్న తెలిపారు. బుధవారం హుస్నాబాద్ బస్టాండ్‌లో జాతర స్పెషల్ ఏర్పాట్లను ఆయన పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రయాణికుల సౌకర్యార్థం తాగునీటి వసతి, టికెట్ల కోసం ప్రత్యేక క్యూ లైన్ల ఏర్పాటు, కూర్చోవడానికి టెంట్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.రద్దీని దృష్టిలో ఉంచుకుని బస్సుల నిర్వహణలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. బస్టాండ్ కంట్రోలర్ లకవత్ హరి, మెకానికల్ సూపర్వైజర్ స్వామి, ఆర్టీసీ సిబ్బంది సురేష్, విజయ్, వెంకటేష్ పాల్గొన్నారు.

# సిద్దిపేటలో మార్కండేయ శోభాయాత్ర



**సిద్దిపేట, వుదయం:** సిద్దిపేట పట్టణంలోని పద్మశాలి కుల బంధువులందరికీ పెద్ద ఉత్సాహంగా, మార్కండేయ స్వామి వారి పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ, సిద్దిపేట పట్టణ పద్మశాలి సమాజం కార్యవర్గం, యువజన సంఘం, మరియు మహిళా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు.ఈ రోజు సాయంత్రం 04:05 గంటలకు సిద్దిపేట పట్టణంలోని మార్కండేయ స్వామి వారి దేవాలయం నుండి స్వామి వారి విగ్రహాన్ని సోలోపూర్ నుండి తీసుకురావడం జరిగింది. అంతే కాకుండా, విగ్రహాన్ని పట్టణం వీధుల గుండా ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తూ శోభాయాత్ర ప్రారంభం అవుతుంది. సిద్దిపేటలోని పద్మశాలి కుటుంబాలు, కుల బంధువులు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని, సమాజం సమరస్యాన్ని, పెద్ద ఎత్తున కుల సభ్యుల యూనిటీని ప్రతిబింబించేలా చూడాలని కార్యవర్గం కోరుతోంది.సమాజ అధ్యక్షు



దు కాముని రాజేశం, ఉపాధ్యక్షుడు పెద్ద అశోక్, ప్రధాన కార్యదర్శి బాలరాజ్, యువజన విభాగం బైరి మురళి, మరియు మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుంది. సిద్దిపేటలో పద్మశాలీల పలు తరాల వారసత్వాన్ని ప్రతిబింబిస్తూ, ఈ శోభాయాత్ర ప్రతి ఒక్కరి హృదయాన్ని ఆహ్లాదపరుస్తుందని, కుల సాన్నిధ్యాన్ని పెంపొందించనుంది.అందరికీ రాగలరు అని ఆహ్వానం తెలియజేస్తూ, సమాజం సభ్యులు అందరినీ హృదయపూర్వకంగా ఈ శోభాయాత్రలో పాల్గొనమని కోరుతున్నారు.

# గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి,వుదయం:** 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు.ఈ సందర్భంగా బుధవారం ఐడిఓసి కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డా బిఆర్ అంబేద్కర్ క్రీడా మైదానంలో జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలకు మైదానం పూర్తిగా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆహూతులు సౌకర్యవంతంగా కూర్చునేందుకు షామియానాలు, కుర్చీలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు ప్రజలకు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించే విధంగా సింగరేణి, విద్యా, డిఆర్‌డీఓ, గృహ నిర్మాణ, సంక్షేమ, వ్యవసాయ, ఉద్యాన, వైద్య శాఖల అధికారులు స్టాళ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాగే గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాఠశాలల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని విద్యా శాఖ అధికారిని ఆదే



శించారు.ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించే ప్రసంగ పాఠాన్ని సిద్ధం చేయాలని డిపిఆర్ఓను కలెక్టర్ ఆదేశించారు.గణతంత్ర దినోత్సవ వేడుకలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఈ సందర్భంగా సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఏఎస్పి నరేష్ కుమార్, ఆర్డిఓ హరికృష్ణ, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# నరసింహుని సేవలో మంత్రులు

**ధర్మపురి,వుదయం:** ప్రముఖ పుణ్యక్షేత్రం ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని బుధవారం రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్శించుకో వడానికి రాగా పోలీస్ బృందం మంత్రులకు గౌరవ వందనంతో ఘన స్వాగతం పలికారు.మంత్రులతో పెద్దపెల్లి మాజీ ఎమ్మెల్యే విజయ రమణా రావు, రామ గుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ స్వామివారిని సేవించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రుల బృందానికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో, మంగళవాయి ద్యాల నడుమ ఘనస్వాగతం పలికారు. అనంతరం వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు మంత్రులకు వేదాశీర్వచనం అందజేయగా,ఆలయ ఈఓ సంకటాల శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రం,ప్రసాదం చిత్రపటాన్ని అందజేసి వారిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్, ఆర్డీఓ మధుసూదన్,ధర్మకర్త మండలి సభ్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

# జోగిపేట పుర హోరు



**ఆందోల్,వుదయం:** సంగారెడ్డి జిల్లాలోని ఆందోల్ జోగిపేట్ మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో జోరు అందుకున్నది. ఆందోల్ గడ్డపై మళ్లీ బిఆర్ఎస్ జెండా ఎగిరే యడమే లక్ష్యంగా మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే రెండు మూడు సార్లు వార్డుల వారీగా ముఖ్య కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించిన క్రాంతి కిరణ్ అందరి అభిప్రాయాలతో అభ్యర్థుల్ని ఎంపిక చేసే పనిలో బిజీగా ఉన్నారు. గతంలో ఉన్న అనుభవాలు, పార్టీ కోసం బలంగా నిలబడ్డ వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ప్రజల్లో మంచి పలుకుబడి ఉండి ప్రజల సమస్యల్ని అర్థం చేసుకొని వాటిని తీర్చగలిగే సామర్థ్యం కలిగిన వ్యక్తులను కౌన్సిలర్ అభ్యర్థులుగా బరిలోదింపడానికి కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా ఒకవైపు అభ్యర్థులపై కసరత్తు చేస్తూనే ఇంకోవైపు రెండు సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను, రెండు సంవత్సరాల కాలంలో ప్రజలకు జరిగిన నష్టాన్ని వివరిస్తూ ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడానికి కారణమైన తొమ్మిది గ్యారంటీలు అమలు చేయడంలో విఫలం కావడంతో ఆ తొమ్మిది గ్యారెంటీల బాకీలను తీర్చాలని డిమాండ్ చేస్తూ ప్రతి ఇంటింటికి బాకీ కార్డులను అందజేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల ఇన్చార్జ్ నరహరెడ్డితో కలిసి బాకీ కార్డులను విడుదల చేసిన క్రాంతి కిరణ్ ఈ బాకీ కార్డు ప్రతి ఒక్కరు జేబులో ఉండే విధంగా మనం ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని కార్యకర్తలకు ఉద్బోధిస్తున్నారు. దీంతో మున్సిపాలిటీలోని ప్రతి వార్డులోని ఆశావాహులు, కార్యకర్తలు కలిసి ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ బాకీ పడ్డ వివరాలను ప్రతి ఓటరు కు వివరిస్తున్నారు. పట్టణంలో విస్తృతమైన ప్రచారం నిర్వహిస్తున్నారు. దీనికి ప్రజల నుంచి విస్తృతమైన స్పందన వస్తున్నది. రెండు సంవత్సరాల కాలంలో అభివృద్ధి చేయడంలో విఫలం కావడంతో పాటు సంక్షేమ పథకాలు అమలులో కూడా కాంగ్రెస్ పార్టీ విఫలమైందని ప్రజల నుంచి కూడా తీవ్రమైన విమర్శలు వస్తున్నాయి. పట్టణంలోని ఇరవై వార్డులలో బాకీ కార్డుల ద్వారా చేస్తున్న ప్రచారానికి కూడా ప్రజల నుంచి విస్తృతమైన మద్దతు వస్తున్నది. అంతేకాకుండా టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మున్సిపాలిటీలో సిసి రోడ్లు, డ్రైనేజీలు, వీధిలైట్లు, ఇంటింటికి నల్ల లాంటి కనీస సౌకర్యాలు తీర్చే కార్యక్రమాలు చేపట్టారు. కానీ రెండేళ్ల కాలంలో గెలిచిన ఎమ్మెల్యే దామోదర రాజనర్సింహ మంత్రి అయినప్పటికీ ఆందోల్ మున్సిపల్ పట్టణాన్ని పట్టించుకోలేదని ప్రజలు కూడా తీవ్రంగా విమర్శిస్తున్నారు. గతంలో మంజూరైన టీయు ఎఫ్ ఐ డి నిధులనే మళ్లీ మంజూరు చేయించి రోడ్లు వేయిస్తున్నారు తప్పించి మంత్రిగా ఒక్క పైసా కూడా అదనపు నిధులను దామోదర్ రాజనర్సింహ ఆందోల్ కేటాయించలేదని ఆంధ్ర ప్రజలు గురుగా ఉన్నారు.ఈ పరిస్థితి బి ఆర్ ఎస్ కు అనుకూలంగా మారే అవకాశలున్నాయి.

# ప్రపంచస్థాయి ప్రమాణాలతో యశోద హాస్పిటల్



**సంగారెడ్డి,వుదయం :** యశోద హాస్పిటల్స్ క్రిటికల్ కేర్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ వెంకట్ రామన్ కోలా ప్రపంచ స్థాయి ట్రాన్స్ ప్లాంట్ కేర్,ఎయిర్ అంబులెన్స్ సేవలతో భారత దేశంలోని ఏకైక ప్లాటినంసర్టిఫైడ్ సెంటర్గా నిలిచిన హైదరాబాద్ యశోద హాస్పిటల్స్ అనియశోద హాస్పిటల్స్ క్రిటికల్ కేర్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ వెంకట్ రామన్ కోలా అన్నారు.బుధవారం నాడు సంగారెడ్డి లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూయశోద హాస్పిటల్స్ హైదరాబాద్, ఇ సి ఎం ఓ ప్రమాణాలకు గ్లోబల్ స్టాండర్డ్స్ కలిగిన ఎక్స్ట్రాకార్పోరియల్ లైఫ్ సపోర్ట్ ఆర్గనైజేషన్ (ఇ యల్ యస్ ఓ ) ద్వారా లైఫ్ సపోర్ట్లో ఎక్సలెన్స్ కోసం అత్యున్నత స్థాయి ప్లాటీనం అవార్డును అందుకున్నందుకు గర్వంగా ఉన్నట్లు తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు ద్వారా యశోద హాస్పిటల్స్ భారతదేశంలోని ఏకైక ప్లాటినంసర్టిఫైడ్ ఈసీఎం ఓ సెంటర్ నిలిచింది. ఇది ప్రపంచవ్యాప్తంగా అత్యున్నత స్థాయి ఎక్స్ట్రాకార్పోరియల్ లైఫ్ సపోర్టును అందించే ఉన్నత స్థాయి కేంద్రాలలో ఒకటిగా నిలిచిందనారు.ప్లాటినంసర్టిఫైడ్ ఈసీఎం ఓ సెంటర్గా, యశోద హాస్పిటల్స్ వి ఏ, వి వి, ఇ సి పి ఆర్, ఆవేక్ ఈసీఎం ఓ,కాంప్లెక్స్ మల్టీఆర్గాన్ సపోర్ట్తో సహా సమగ్ర ఈసీఎం ఓ సేవలను అందిస్తుంది. దీనికి అత్యంత అనుభవజ్ఞులైన ఇంటెన్సివిస్టు, కార్డియోథొరాసిక్ సర్జన్లు, పెర్ఫ్యూషనిస్టులు, ట్రాన్స్ ప్లాంట్ ఫిజిషియన్లు మరియు స్పెషలైజ్డ్ ఐసీయూ నర్సుల బృందం మద్దతు ఇస్తుందని అన్నరు. అత్యాధునిక పర్యవేక్షణ, బలమైన ఇన్ఫెక్షన్ నియంత్రణ పద్ధతులు మరియు అంతర్జాతీయ మార్గదర్శకాలకు ఆధారంగా ప్రోటోకాలతో కూడిన 24×7 అధునాతన క్రిటికల్ కేర్ యూనిట్లు వున్నాయి అని తెలిపారు. ప్రముఖ ప్రపంచ కేంద్రాలతో పోల్చదగిన ఫలితాలతో కాలేయం, మూత్రపిండాలు, గుండె, ఊపిరితిత్తులు మరియు ఎముక మజ్జ మార్పిడితో సహా సమగ్ర మార్పిడి సేవలు. అవయవ మార్పిడి మరియు పునరుద్ధరణకు వారధిగా ఈసీఎం ఓ, ఎండ్ స్టేజ్ కార్డియాక్ లేదా రెస్పిరేటరీ ఫెయిల్యూర్ ఉన్న పేషేంట్లకు ప్రాణాలను రక్షించే మద్దతును అందిస్తుందని తెలిపారు.

# పీఆర్ఎస్ఐ, అంబేద్కర్ కళాశాల మధ్య ఎంఓయూ పునరుద్ధరణ



**హైదరాబాద్, వుదయం** ఎమ్ఒయులు పునరుద్ధరించబడ్డాయి: పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ చాప్టర్ మరియు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళాశాల భాగస్వామ్యాన్ని విస్తరించాయిహైదరాబాద్, జనవరి 21, 2026: పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ చాప్టర్ మరియు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళాశాల, బాగ్లింగంపల్లి, హైదరాబాద్, డిసెంబర్ 16, 2027 వరకు మరో 2 సంవత్సరాల పాటు వారి అవగాహన ఒప్పందాన్ని (ఎమ్ఒయు) పునరుద్ధరించాయి. డిసెంబర్ 16, 2023న స్థాపించబడిన భాగస్వామ్యాన్ని కొనసాగిస్తూ, జనవరి 21, 2026న ఎమ్ఒయు పునరుద్ధరణ ఆమోదించబడింది. పబ్లిక్ రిలేషన్స్, జర్నలిజం మరియు మాస్ కమ్యూనికేషన్‌లో విద్యా, వృత్తిపరమైన మరియు విద్యార్థికేంద్రీకృత చొరవలను ప్రోత్సహించడం ఈ సహకారం లక్ష్యం.ఈ భాగస్వామ్యం ద్వారా, రెండు సంస్థలు సామర్థ్య నిర్మాణం మరియు జ్ఞాన భాగస్వామ్యం, ఈ రంగంలో వృద్ధి మరియు అభివృద్ధిని పెంపొందించడం పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నాయి

# ఆర్కేపీ నూతన ఎస్ఐ శ్రీధర్




◆ శాంతి భద్రతలకే మొదటి ప్రాధాన్యత

**రామకృష్ణాపూర్, వుదయం:** రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకే మొదటి ప్రాధాన్యత ఇస్తానని రామకృష్ణాపూర్ పట్టణానికి నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన జె శ్రీధర్ అన్నారు. జైపూర్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వర్తించి సాధారణ బదిలీపై రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ కు వచ్చిన జె శ్రీధర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్కేపీలో విధులు నిర్వహించిన భూమేష్ భూపాలపల్లి కి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీధర్ మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకు మొదటి ప్రాధాన్యత ఇస్తానని నేర నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రజలు తమ సమస్యల కోసం పోలీస్ స్టేషన్ కు ఎప్పుడైనా రావచ్చని హామీ ఇచ్చారు. చట్టం ముందు అందరూ సమానమేనని, ప్రజలు, ప్రజా ప్రతినిదులు పోలీసులకు సహకరించాలని కోరారు.

# సిద్దిపేటలో నిబంధనల ఉల్లంఘన



◆ ప్రజల నిర్లక్ష్య ధోరణి కొనసాగుతోంది

**వుదయం , సిద్దిపేట :** సిద్దిపేట పట్టణంలోని వేములవాడ రహదారి వైపు, రోడ్డు పక్కన ఉన్న వైకుంఠధామం సమీప ప్రాంతంలో చెత్త వేయరాదని పురపాలక సంఘం ఇప్పటికే స్పష్టంగా ప్రకటించింది. బహిరంగ ప్రదేశాలలో చెత్త వేస్తే రూ.5,000 నుంచి రూ.25,000 వరకు జరిమానా విధించబడుతుందని హెచ్చరిస్తూ మున్సిపాలిటీ అధికారులు బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. అయినప్పటికీ కొంతమంది ప్రజలు ఈ నిబంధనలను పట్టించుకోకుండా అదే ప్రాంతంలో చెత్తను వేస్తూ నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తున్నారు. ఈ కారణంగా ఆ పరిసర ప్రాంతం అపరిశుభ్రంగా మారడంతో పాటు దుర్వాసన కూడా వెదజల్లుతోంది. ముఖ్యంగా రహదారిపై ప్రయాణించే బాటసారులు, వేములవాడ వైపు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.చెత్త కుప్పల వల్ల పరిసర ప్రాంతంలో అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణాన్ని స్వచ్ఛంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, చెత్తను నిర్ణీత ప్రదేశాలలో మాత్రమే వేయాలని ప్రజలు కోరుతున్నారు.పురపాలక సంఘం అధికారులు ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించి, చెత్త వేయేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, జరిమానాలను కచ్చితంగా అమలు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. స్వచ్ఛమైన సిద్దిపేట కోసం ప్రజల సహకారం తప్పనిసరి అని అధికారులు సూచిస్తున్నారు.

# విరసం కరపత్రం ఆవిష్కరణ

## 30 వ రాష్ట్ర మహా సభలకు ఏర్పాట్లు



**పెద్దపల్లి ,వుదయం:** ఈనెల 24, 25 తేదీల్లో హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే విప్లవ రచయితల సంఘం (విరసం) 30వ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య కోరారు. కరీంనగర్ జిల్లా కేంద్రం లోని అంబేద్కర్ వద్ద ప్రజా సంఘాల నాయకులతో కలిసి మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విరసం బాలసాని రాజయ్య మాట్లాడు తు మూడు దశాబ్దాలుగా విప్లవోద్యమ దశలన్నింట్లో విరసం చురుగ్గా పని చేస్తోందన్నారు. నక్సల్బరీ, శ్రీకాకుళం రైతాంగ పోరాటాలు వసంత మేఘగర్జన వెలుగులో పుట్టిన విరసం భావజాల సాంస్కృతిక రంగాల్లో వర్గ పోరాట రాజకీయాలను కొనసాగిస్తోందని అన్నారు.సమాజంలో నెలకొన్న సామాజిక అసమానతలు, కులం, మత పీడనలకు వ్యతిరేకంగా వివిధ కళారూపాలు, కథలు,కవిత్వం, నవలలు, సాహిత్యం ద్వారా దీర్ఘకాల ప్రజాపంథా, వర్గ పోరాట ఆవశ్యకతను ప్రజలకు తెలియజేస్తున్నదని అన్నారు.సాంస్కృతిక, భావజాల దాడులు ప్రజలను మభ్య పెట్టడం కులం, మత ప్రతిపాధికనా విభజించడం.ఆర్థిక వ్యూహాలు ప్రజలకు డబ్బులిచ్చి ఉద్యమ నిర్మాణాలకు వ్యతిరేకంగా నిర్మాణాలను అభివృద్ధి చేయడం.రాజకీయ కుట్రలు దళారీ నాయకత్వాన్ని తీసుకురావడం.ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలు మేధావులపై నిర్బంధం, నిరసనకారులపై దాడులు వంటి చర్యలతో ప్రభుత్వం ప్రజలపై యుద్ధం చేస్తున్నదని ఆరోపించారు.ఈ సందర్భంలో విరసం తన 30 వ మహాసభలను నిర్వహిస్తున్నదని ప్రముఖ తమిళ రచయిత్రి సుకీర్త రాణి, కేరళ మార్క్సిస్ట్ నాయకులు అజిత్, ప్రొఫెసర్ కాశీం (OU) ప్రొఫెసర్ సరోజ్ గిరి (ఢిల్లీ యూనివర్సిటీ) నర్ల రవి, ప్రొఫెసర్ హరగోపాల్, కళ్యాణ్ రావు, సీమా ఆజాద్, పాణి వక్తలుగా పాల్గొంటున్నా ఈ మహాసభలకు పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, మేధావులు,కవులు, కళాకారులు, మహిళా, విద్యార్థి, యువత అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో విరసంఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య, ప్రజా సంఘాల నాయకులు దళితుల దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు మార్వాడి సుదర్శన్, రాష్ట్ర నాస్తిక సమాజం కమిటి నాయకులు బోస్ బాబు, శశిధర్, సంతోష్, అర్జున్, విజయ్

# రహదారి నిబంధనలు పాటించి ప్రాణాలు కాపాడుకోవాలి



◆ సిద్దిపేట అధికారుల సూచన

**వుదయం,సిద్దిపేట:** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని సిద్దిపేట జిల్లా రవాణా శాఖ మరియు ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా బుధవారం స్థానిక పాత బస్టాండ్ ఆవరణలో ఆటో మరియు క్యాబ్ డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ డ్రైవర్లు రహదారిపై తోటి వాహనదారులతో మరియు ప్రయాణికులతో ఎంతో సంయమనంతో, మర్యాదగా మెదలాలని సూచించారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం చట్టరీత్యా నేరమని, ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా వాహన ధృవపత్రాలను కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా క్యాబ్ డ్రైవర్లు రాత్రి సమయాల్లో విశ్రాంతి లేకుండా వాహనాలు నడపడం వల్ల 'హైవే హిప్నాసిస్' కు గురయ్యే ప్రమాదం ఉందని, కాబట్టి తగిన విశ్రాంతి తీసుకుంటూ ప్రయాణించాలని హితవు పలికారు. అనంతరం ట్రాఫిక్ ఎస్ఐ విజయభాస్కర్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడిపితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, అలాంటి వారి లైసెన్సులను సస్పెండ్ చేయడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం డ్రైవర్లందరితో రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హోంగార్డులు వెంకటేష్, రామేశ్వర్, అష్రాఫ్ మరియు రవాణా, ట్రాఫిక్ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# మురికి కాలువ సమస్య తీర్చిన సర్పంచు



**వుదయం,నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామంలోని బీసీ కాలనీలో మురికి కాలువ రోడ్డులోని పైపులు పగిలిపోయి కాలనీవాసులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఈ విషయాన్ని మాగి గ్రామ సర్పంచ్ గుర్రపు సుమిత్ర శ్రీనివాస్ ఉప సర్పంచ్ కవిత పండరి గారి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి తక్షణమే రోడ్డును త్రవ్వి వేరే పైపులు బిగించి పైపులపై సిమెంట్ కంకరతో స్పీడ్ బేకర్ వేసి సమస్యలు పరిష్కరించి మురికి నీళ్ల కు లైన్ క్లీయర్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచుకు గ్రామస్తులు ధన్యవాదములు తెలిపారు.



## వైభవంగా మార్కండేయ జయంతి

### పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు సాంబయ్య

**ఖానాపురం, ఉదయం:** పద్మశాలి కులదైవమైన శ్రీ మార్కండేయ జయంతి వేడుకలను పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు కుడికాల సాంబయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని మంగళవారిపేట, ధర్మరావుపేట, బుధరావుపేట గ్రామాల పద్మశాలి కులస్తుల ఆధ్వర్యంలో శ్రీ మార్కండేయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పద్మశాలి సంఘం అధ్యక్షులు కులస్తులు బాధ్యులు లింగవత్తుల యాకసాయన్న, అడ్లగట్ల ప్రసాద్, చిట్యాల దయాకర్, చిట్యాల వీరన్న, కోడం రమణ, కుసుమ నాగరాజు, కుసుమ బాలరాజు, పరిష రవి, బింగి రాజు, కమని దేవా, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కండేయ మహర్షి జయంతి



**జయశంకర్ భూపాలపల్లి, ఉదయం:** మహాదేవపూర్ మండలం అంబట్‌పల్లి గ్రామంలో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం మార్కండేయ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.అదేక్రమంలో అంబట్‌పల్లి పద్మశాలి సేవా సంఘం నూతన క్యాలెండర్-2026ను ఆవిష్కరించారు ఈ సందర్భంగా పద్మశాలి సేవా సంఘం సభ్యులు మాట్లాడుతూ ఐకమత్యమే మహాబలం అని, పద్మశాలి కులం యొక్క అస్తిత్వాన్ని పెంపొందిస్తూ, సామాజిక, ఆర్థిక, రాజకీయ మరియు న్యాయ వ్యవస్థలకు భంగం కలగకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకుంటామని అన్నారు ఈ కార్యక్రమంలో పింగానీ రమేష్, లోటపేటల బుచ్చిరం, పుట్ట సూర్యనాయణ, వావిలాల రామచంద్రం, తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ నీటి సంఘం చైర్మన్ ఎర్రబెల్లి మృతి



### ఘనంగా నివాళి అర్పించిన ఎమ్మెల్యే దొంతి

**ఖానాపురం, ఉదయం:** మండలంలోని ధర్మరావుపేట గ్రామానికి చెందిన మాజీ నీటి సంఘం చైర్మన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి రామయ్య (85) అనారోగ్యంతో మృతిచెందగా మృతదేహాన్ని నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సందర్శించి మృతదేహంపై పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్ రెడ్డి, మండల ఓబీసీ సెల్ అధ్యక్షుడు వల్లే శ్రీనివాస్, నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు

# పకడ్బందీ చర్యలు తీసుకోవాలి

### రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పాటించాలి

### జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**మహబూబాబాద్, ఉదయం:** రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగానే జిల్లాలో విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు అన్ని విభాగాలలో విధిగా పోలీస్ రవాణా శాఖ సంబంధిత అన్ని విభాగాల అధికారులు విస్తృతం ప్రచారం కల్పించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు,జిల్లాలో మరిపెడ,కురవి, తొర్రూరు, నెల్లికుదురు, బయ్యారం, హైవేల వెంబడి ప్రమాదాలు జరుగుతున్నాయని, నివారణ కోసం సంబంధిత విభాగాలు ప్రతిపాదనలు సిద్ధం చేసి చిన్నచిన్న రోడ్డు మరమ్మత్తులు ఉంటే వెంటనే సరి చేయాలని విషయ సూచికలు ఏర్పాటు చేయాలని, త్రాగి వాహనాలు నడపకుండా తగిన జాగ్రత్తలు తనిఖీలు నిర్వహించాలని, సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించి జీబ్రా క్రాసులు ట్రాఫిక్ రూల్స్ పక్కాగా పాటిస్తూ ఉండే విధంగా సామాన్య ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు, స్కూల్ బస్సుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టి ఫిట్నెస్ ఉన్నాయా లేవో తనిఖీ చేయాలని, డ్రైవర్ సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపకుండా అతనికి తగు ఆదేశాలు జారీ చేయాలని, నిత్యం వారికి వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ కంటిచూపు తదితర అన్ని తనిఖీ చేయాలని సూచించారు, ఆర్టీసీ బస్సుల డ్రైవర్ల యొక్క ఆరోగ్య స్థితిగతులను పరిశీలిస్తూ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించాలని అన్నారు, అధిక లోడు, అతివేగం, రాష్ డ్రైవింగ్, లైసెన్స్ లేకుండా, నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపే ప్రతి ఒక్కరి పైన ప్రభుత్వ సూచనల ప్రకారం జరిమానాలు విధించాలని, ప్రభుత్వ కార్యాలయాలలో విధిగా హెల్మెట్ ధరిస్తేనే కార్యాలయానికి అనుమతించే విధంగా ముందస్తు సమాచారంతో తెలియజేయాలని సూచించారు, పోలీస్, రవాణా సమన్వయంతో క్షేత్రస్థాయిలో అవగాహన (ప్రచార) కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, అదే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించి వారి క్షేమం వారి కుటుంబ క్షేమం కోసం కృషి చేయాలన్నారు,నేషనల్ హైవే, మున్సిపల్, పంచాయితీ రాజ్, రోడ్లు భవనాల శాఖ రహదారుల వెంబడి బ్లాక్ స్పాట్స్ గుర్తించి నివారణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు, ఈ కార్యక్రమంలో డీఎస్పీ తిరుపతిరావు, ఆర్టీవో జైపాల్ రెడ్డి, ఆర్ అండ్ బి, పిఆర్ ఈఈలు భీష్మా నాయక్, విద్యాసాగర్,సంబంధిత విభాగాల అధికారులు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## అవగాహనతోనే రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట

### జిల్లా రవాణా శాఖ అధికారి మహమ్మద్ సంధాని





**జయశంకర్ భూపాలపల్లి, ఉదయం:** దేశం అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితాలో 4వ స్థానంలో ఉన్నప్పటికీ, రోడ్డు ప్రమాదాల్లో మొదటి స్థానంలో ఉండటం ఆందోళనకరమని జిల్లా రవాణా శాఖ అధికారి మహమ్మద్ సంధాని అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలు గత 37 సంవత్సరాలుగా వారోత్సవాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రమాదాలు తగ్గడం లేదని పేర్కొన్నారు. అందుకే నెల రోజుల పాటు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.బుధవారం మంజూరు నగర్‌లోని మైనార్టీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలల్లో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవం-2026 సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మీ ద్వారా తల్లిదండ్రులకు కూడా రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలని విద్యార్థులను సూచించారు. నడిచేటప్పుడు, వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని అన్నారు.మోటారు సైకిళ్ల ద్వారానే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, చిన్న చిన్న లోపాలను సరిదిద్దుకొని మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని తెలిపారు. సక్రమంగా వెళ్లకపోవడం, అశ్రద్ధ, సెల్‌ఫోన్ మాట్లాడుతూ నడవడం లేదా వాహనం నడపడం, జిగ్‌జాగ్‌గా వెళ్లడం, అతివేగం వంటి కారణాల వల్ల వాహనం నడిపే సమయంలో ధ్యాస లేక ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు.ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చునే వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులచే రోడ్డు భద్రతా నియమాలపై ప్రతిజ్ఞ చేయించారు. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిపిఆర్వో శ్రీనివాస్,కళాశాల ప్రిన్సిపాల్ రవి, ఏఎంవిఐలు శ్రీనివాస్, సుందర్ లాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా అధ్యక్షునికి ఆత్మీయ సన్మానం



**బెజ్జూర్, ఉదయం:** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలంలోని ఆరెగూడెం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు పర్ష చంద్రశేఖర్ ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని విద్యారంగ సమస్యల పరిష్కారం తనవంతు కృషి చేస్తా అని అన్నారు. కాంప్లెక్స్ స్థాయిలో ఉన్న పాఠశాలల సమస్యలు తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు గంగారాం కాంప్లెక్స్ సెక్రటరీ లక్ష్మీనారాయణ వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు జీతూ నాయక్, జయేందర్, బలరాం, నాగేష్, సిఆర్పలు తుకారాం, అరుణ్, మానస, శివరాం తదితరులు ఉన్నారు.



## టాలెంట్ టెస్ట్ మండల స్థాయి విజేతలు

**రాయపర్తి, ఉదయం:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో మండల స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖాధికారి వెన్నంపల్లి శ్రీనివాస్ సీల్డ్ కవర్లో ఉన్న ప్రశ్న పత్రాలను ప్రారంభించి ,పోటీని మంగళవారంని ర్వహించినారు.మండల స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ లో ఆంగ్ల మాధ్యమంలో జుబేర్ (జెడ్.పి.హెచ్.ఎస్.రాయపర్తి, ) బి.విష్ణు ( ఊకల్ ) ఏం.అశ్వత్ (రాయపర్తి) కే. శివతేజ (కొండూరు) సి.హెచ్. శివ కుమార్ ( కొండూరు), మరియు తెలుగు మాధ్యమంలో పి. ప్రణీత్ ( కొత్తూరు), షకీరా, శాన్వి (రాయపర్తి) లు మండల స్థాయి నుండి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. వీరు ఫిబ్రవరి రెండవ తేదీ న జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ లో పాల్గొంటారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు శర్మ , మండల సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయులు ఉప్పలయ్య, సంకూరి రాజు, సత్యనారాయణ, రమేష్, శ్రీనివాసరెడ్డి, రవీందర్, మమత పాల్గొన్నారు.

## చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

### సీఎం కప్ క్రీడలను ప్రారంభించిన సర్పంచ్ రమేష్



**ఖానాపురం, ఉదయం:** విద్యార్థులు చదువుతోపాటు పాటలలో ఆటలో రాణించినప్పుడే మనసు ప్రశాంతంగా ఉత్సాహంగా ఉల్లాసంగా ఉంటుందని గ్రామ నూతన సర్పంచ్ దాసరి రమేష్ విద్యార్థులకు తెలిపారు. మండల కేంద్రంలోని హైస్కూల్లోనీ విద్యార్థులకు సీఎం కప్ క్రీడలను గ్రామ సర్పంచ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి హెచ్ఎం విజయ, పిఈటి శ్రీనివాస్, నేతాజీ హెచ్ఎం నాయుడు, ఉపాధ్యాయులు సాంబలక్ష్మి, రవికుమార్, సరిత, శశికుమార్, శ్రీనివాస్, నరేష్, రామ్మోహన్ రావు తోపాటు విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో పానెల్ టీం తనిఖీ



**బెజ్జూర్, ఉదయం:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పానెల్ తనిఖీ బృందం సభ్యులు బుధవారం బెజ్జూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంబేద్కర్ నగర్ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పాఠశాలల్లో బోధన విధానం, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, పాఠశాలల్లో మౌలిక వసతులు, మధ్యాహ్నం భోజన పనితీరు, తాగునీరు, మరుగుదొడ్లు పరిశీలన, పాఠశాలల్లో ఉన్న రిజిస్టర్లు, రికార్డులు, ఎఫ్ ఎల్ ఎన్ కార్యక్రమ పనితీరు, బోధన ఉపకరణ సామాగ్రి, విద్యార్థుల వర్క్ బుక్ తదితర వివరాలను ప్యానెల్ బృందం సభ్యులు తనిఖీ చేశారు. విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో బోధన జరగాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పానెల్ తనిఖీ బృందం సభ్యులు నాయికిని శ్రీనివాస్, శైలజ, శివాజీ, సిఆర్పి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు రాథోడ్ జ్యోతి, నవీన్, సాయి చరణ్ ఉపాధ్యాయులు ఉన్నారు.

# ధర్మపురి అభివృద్ధికి మహా సంకల్పం

### రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన

### ప్రజాప్రతినిధి అంటే ప్రజల కోసం తపించేవాడు : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క






**ధర్మపురి, ఉదయం:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ధర్మపురి నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. బుధవారం ఇక్కడ భారీ ఎత్తున అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిగాయి. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసా య శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వ రరావు ముఖ్య అతిథులుగా రాగా మంత్రి అడ్లూరి,కలెక్టర్ సత్యప్రసాద్ ,ఎస్పీ అశోక్‌కుమార్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంత్రులకు గౌరవ వందనంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వందలాది కోట్ల రూపాయల నిధులకు సంబంధిం చిన శిలాఫలకాలను ఆవిష్కరించారు.నియోజకవర్గ రూపు రేఖలు మార్చేలా ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది.రూ. 200 కోట్లతో నేరెళ్ల శివార్లలో 25 ఎకరాల్లో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్', రూ. 10 కోట్లతో సీఎస్ఆర్ నిధులతో డిగ్రీ కళాశాల భవనం,రూ. 24.5 కోట్లతో గోదావరి నది వద్ద 2 సివరేజ్ ప్లాంట్లు, రూ. 15 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం,రూ. 4.5 కోట్లతో దొంతాపూర్, ధర్మపురి సబ్ స్టేషన్ల పనులు, లైన్ల మరమ్మతులు,9 కుల సంఘ భవనాలకు రూ. 1.5 కోట్లు, తాగునీరు/డ్రైనేజీ పనులకు రూ. 1.5 కోట్లు పనులకు శంకుస్థాపన చేశారు .ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రి పదవి అంటే విలాసవంతమైన జీవితం కోసం కాదు , ప్రజల కష్టాలను తీర్చే బాధ్యత. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తన నియోజక వర్గ అభివృద్ధిపై పెట్టిన శ్రద్ధ వల్లే నేడు ధర్మపురిలో ఇన్ని కోట్లు మంజూరయ్యాయి అని కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా 100 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను మంజూరు చేశామని, ఒక్కో దానికి రూ. 200 కోట్లు కేటాయించామని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడేలా ఈ స్కూళ్లు ఉంటాయని భరోసా ఇచ్చారు.ఇందిరమ్మ ఇళ్లకు మొదటి ఏడాదిలోనే 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టమని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం ఆర్టీసీకి రూ. 7 వేల కోట్లు, రూ.26.7 కోట్ల వడ్డీ లేని రుణాలు, కోటి 52 లక్షల మందికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు.ధర్మపురిని డివిజన్ చేసే అంశాన్ని సానుకూలంగా పరిశీలిస్తాం. అదనంగా బురుగుపల్లె, వెనుగుమట్ల,33/11 సబ్ స్టేషన్ ఏర్పాటు,సబ్ ట్రెజరీ ఆఫీస్ ఏర్పాటు కు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.విద్యుత్ మరమ్మతులకు అదనంగా 6కోట్ల 40లక్షలు అందిస్తామనితెలిపారు.అనంతరం వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ దేశంలోనే అత్యధికంగా వరి పండించే రాష్ట్రంగా తెలంగాణను నిలిపామన్నారు.రెండేళ్లలోనే వ్యవసాయ రంగానికి లక్ష కోట్లు ఖర్చు చేసిన ఘనత రేవంత్ సర్కార్‌దే. 25 లక్షల మంది రైతులకు రూ. 21 వేల కోట్ల రుణమాఫీ చేశాం.జిల్లాలో ఆయిల్ పామ్ తోటలను ,దానిలో అంతర్ పంటలను పండిచాలని దాని వల్ల ఆర్థికంగా బలపడ వచ్చని సూచించారు.ధర్మపురి నియోజకవర్గంలో అదనంగా 3 సొసైటీలను ఏర్పాటు చేస్తాం అని హామీ ఇచ్చారు.అనంతరం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థుల వలసలను తగ్గించడమే లక్ష్యంగా హాస్టల్స్, విద్యాసంస్థల నిర్మాణం చేపడుతున్నామన్నారు. సంక్షేమం అంటే కేవలం సబ్సిడీలే కాదని,అవకాశాలు కల్పించడ మని ఆయన స్పష్టం చేశారు.అనంతరం ఇందిరా మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ,ఇందిరమ్మ చీరల పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వేములవాడ ప్రభుత్వ విప్ ఆది. శ్రీనివాస్, జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాగూర్,మాజీ ఎమ్మెల్యే, బెల్లయ్య నాయుడు,కోట్లాది.తిరుపతి, విజయ రమణారావు,డీసీసీ అధ్యక్షుడు నందయ్య, అడిషనల్ కలెక్టర్ రాజగౌడ్,ఆర్డీఓ మధుసూ దన్,అధికారులు,ప్రజాప్రతినిధులు,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ లోకి భారీ చేరికలు

**రామకృష్ణాపూర్, ఉదయం:** చెన్నూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలోకి భారీ ఎత్తున నాయకుల చేరికల కోసం హైదరాబాద్ కు సుమారు 200 కార్లలో బయలు దేరి వెళ్లారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి తమ అనుచర వర్గంతో కలిసి వెళ్లగా, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ కు చెందిన వంశీకృష్ణరావ్ ఆధ్వర్యంలో సైతం బారాస పార్టీలో చేరేందుకు భారీ ఎత్తున తరలి వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని కేటీఆర్ సమక్షంలో చేరేందుకు నేతలంతా బయలుదేరి వెళ్లినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు డాక్టర్ రాజా రమేష్, పట్టణ అధ్యక్షులు సుదర్శన్ గౌడ్, సీనియర్ నాయకులు రామిడి కుమార్, మాజీ కౌన్సిలర్లు, యువ నాయకులు ,నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు.



## యువతకు స్ఫూర్తి మార్కండేయ ధర్మనిష్ఠ



- బీసీ జేఏసీ చైర్ పర్సన్ దాసరి ఉష
- ఘనంగా మార్కండేయ జయంతి వేడుకలు

**పెద్దపల్లి, ఉదయం:** మృత్యువును జయించిన చిరంజీవి, భక్త మార్కండేయ మహర్షి ఆశీస్సులు సమాజంపై ఎల్లప్పుడూ ఉండాలని బీసీ జేఏసీ చైర్ పర్సన్ దాసరి ఉష ఆకాంక్షించారు.బుధవారం జిల్లా కేంద్రంలోని పద్మశాలీ భవనంలో మార్కండేయ జయంతి వేడుకలను పద్మశాలీ సంఘం పట్టణ అధ్యక్షులు బత్తుల రమేష్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో భాగంగా పద్మశాలీ భవనంలో ప్రత్యేక హోమం,పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన దాసరి ఉష స్వామి వారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కండేయ జయంతి ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన రోజని కొనియాడారు.స్వల్ప ఆయుష్షు అని తెలిసినా భయపడకుండా,అచంచలమైన శివభక్తితో మార్కండేయుడు మృత్యువును సైతం గెలిచి చిరంజీవిగా నిలిచారని గుర్తుచేశారు.నేటి యువత మార్కండేయ మహర్షి జీవితం నుండి ఆత్మవిశ్వాసాన్ని, ధర్మనిష్ఠను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ పండుగ కేవలం ఒక వేడుక మాత్రమే కాదని,మానవ జీవనానికి సరైన మార్గాన్ని చూపే అద్భుత ఆధ్యాత్మిక సందేశమని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నేతలు,ప్రతినిధులు కొండి సతీష్,ఆడెపు సుధాకర్,లక్ష్మీ,ధనుంజయ్,శ్రీనివాస్,అరుణతో పాటు పట్టణ పద్మశాలీలు,యువత పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## పుర పాలక పోరులో పుప్పాల విజయం ఖాయం

### గతంలో ప్రజాప్రతినిధిగా అనుభవం..

### అనేక సేవా కార్యక్రమాలు



**మంథని, ఉదయం:** మంథని పురపాలక సంఘం ఎన్నికల్లో ఆశావాహుల సందడి మొదలైంది. మొత్తం 13 వార్డులు ఉన్నాయి. 13 వార్డులలో 11వ వార్డ్ నుండి బీఆర్ఎస్ పార్టీ తరపున సీనియర్ నాయకులు పుప్పాల తిరుపతి పోటీలో ఉన్నట్లు సమాచారం. దాదాపుగా ఆయనకే పార్టీ టికెట్ ఖాయమవుతుందని బీఆర్ఎస్ నాయకులలో జోరుగా చర్చ సాగుతుంది. గతంలో పుప్పాల తిరుపతి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన సతీమణి పుప్పాల భాగ్యలక్ష్మి మంథని మేజర్ గ్రామపంచాయతీకి ఉపసర్పంచిగా పనిచేసిన అనుభవం ఉంది. గత పురపాలక సంఘం ఎన్నికల్లో రెండో వార్డ్ నుండి పోటీ చేశారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ సహకారంతో ప్రస్తుతం 11 వ వార్డు నుండి పోటీ చేసి విజయం సాధించాలని పట్టుదలతో ఉన్నారు. ప్రతిక్షణం ప్రజల మధ్య ఉంటూ, ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు వెళ్లడం ఆయన నైజం. చిన్న పెద్ద తేడా లేకుండా అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లడం ఆయన స్వభావం. గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని దాదాపుగా ప్రతి గణేష్ మండపంలో పుప్పాల తిరుపతి అల్పాహారం పంపిణీ చేశారు. దేవీ నవరాత్రి ఉత్సవాలలో, గణేష్ ఉత్సవాలలో భక్తులకు సేవ చేయడం ద్వారా వారు ప్రత్యేక అభిమానాన్ని చూరగొన్నారు. 11వ వార్డులో స్థానికంగా అందుబాటులో ఉండడం ఆయనకు కలిసొచ్చే అంశం. వార్డులో స్థానికుడు కావడం ఆయన గెలుపుకు నాంది. పుప్పాల తిరుపతి గెలుపు దాదాపు ఖాయమని మంథని మున్సిపల్ లో జోరుగా చర్చ సాగుతుంది. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆశీస్సులు తన పైన ఉన్నాయని, మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించి తీరుతానని ఆయన విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. గెలిచిన తర్వాత ప్రజా సేవకుడు వలె పని చేస్తానని, అవకాశం కల్పించాలని అందరికంటే ముందే ఆయన ప్రచారాన్ని ముమ్మరం చేశారు.

## పెద్దపల్లిలో తరచు స్కానింగ్ కేంద్రాల తనిఖీ



**పెద్దపల్లి, ఉదయం:** ఈ రోజు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో పి.సి.పి.యన్.డి.టి. అడ్వైజరి కమిటి సమావేశంను డా. కె ప్రమోద్ కుమార్, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 33 స్కానింగ్ కేంద్రాలు రిజిస్ట్రేషన్ అయినాయి అన్నారు. ఇందులో 2 నాన్ ఫంక్షన్ లో ఉన్నాయి అని అన్నారు. వీటిలో ప్రతి నెల 8 నుండి 10 కేంద్రాలను తనిఖీ చేస్తూ, అన్నీ కేంద్రాలు తనిఖీ అయ్యేలా చూస్తున్నాము అని అన్నారు. ఈ నెల కూడా తనిఖీ నిర్వహించాము అని అన్నారు. మన జిల్లా లో లింగ నిష్పత్తి ప్రతి 1000 మంది మగ పిల్లలకు 934 ఆడ పిల్లలు ఉన్నారు. ఈ తారతమ్యాన్ని తగ్గించాలి అని, ఆడ పిల్లల పుట్టనిద్దాం, బతకనిద్దాం, చదివిద్దాం అని అన్నారు. ఆడ బిడ్డ అయినా మగ బిడ్డ అయిన సమానమే అని అన్నారు.గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం 1994 (పి. సి. పి. ఎన్.డి.టి.) ప్రకారం పుట్ట బోయే బిడ్డ అడ, మగ అని చెప్పడం నేరం. లింగ నిర్ధారణ చేసిన వారికి, చేయుమని అడిగిన వారికి మూడు సంవత్సరాల జైలు శిక్ష మరియు రూ.10,000/ల జరిమానా విధించడం జరుగుతుందని అన్నారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టంను పకడ్బందిగా అమలు చేయుచున్నాము అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో గర్భిణులకు చేసే స్కానింగ్ వివరాలను కూడా ఫారం ఎఫ్ నింపడం ద్వారా వారి వివరాలను పొందుపరిచాలని కమిటీ సభ్యులు అన్నారు. అలాగే ఫారం ఎఫ్ వివరాలు ఆన్లైన్లో నమోదు చేయాలని అన్నారు.ఈ సమావేశంలో డాక్టర్ వి వాణిశ్రీ, ప్రోగ్రాం అధికారి మరియు పిసి పిఎన్ డిటి నోడల్ ఆఫీసర్ , డాక్టర్ బి శ్రీరాములు డిప్యూటీ డి.ఎం.ఎచ్.ఓ., డా.రవీ, పిల్లల వైద్య నిపుణులు, డా. శ్రీ నయన గైనకాలజిస్ట్, శ్రీ పి.రాకేష్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, శ్రీమతి ఆలేటి స్వప్న జిల్లా సమైక్య అధ్యక్షురాలు, ఇతర ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రాజమౌళి డాక్టర్ కె వి సుధాకర్ రెడ్డి మరియు ఎస్. వెంకటేశ్వర్లు , జిల్లా మాస్ మీడియా ఉప అధికారి పాల్గోన్నారు.ప్రైవేట్ ఆసుపత్రుల ను డి. ఎం ఎచ్ ఓ ఆకస్మిక తనఖీపెద్దపల్లి పట్టణం లో ప్రణీత్ పిల్లల హాస్పిటల్, ప్రైమ్ డయాగ్నొస్టిక్ కేంద్రం, నిత్య డయాగ్నొస్టిక్ కేంద్రంల ను ఆకస్మికంగా తనకీ నిర్వహించారు. రికార్డు లు, సిబ్బంది వివరాలను వారి అర్హతలను , బయో మెడికల్ వేస్టేజ్ మేనేజ్ మెంట్ వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్2010 నియమ నిబంధనలు పాటించాలని సూచించారు.

# మంథని చరిత్రను రూపుమాపే ప్రయత్నం చేస్తున్న మంథని ఎమ్మెల్యే

**సొంత కుటుంబంపేరు కోసం కోట్ల నిధులు వృధా చేస్తుండు**

**చరిత్రను కాపాడాలంటూ మేధావులకు లేఖలు రాస్తున్నా**

**నిలదీయకపోతే మంథని మూలాలను మట్టిలో కలిపేస్తడు**

**రూపురేఖలుమార్చి తండ్రి పేరు పెట్టాలని కుట్ర చేస్తుండు**

**అన్యాయాలను అక్రమాలను నిలదీయకపోతే చరిత్ర క్షమించదు**

**తమ హాయాంలో ఇబ్బందుల్లేకుండా అభివృద్ధి చేశాం**

**మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**

**మంథని, వుదయం:**

మన పూర్వీకులు పొందుపర్చిన మంథని పట్టణాన్ని ధ్వంసం చేసి చరిత్రను రూపుమాపేందుకు మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు శ్రీకారం చుట్టారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పేర్కొన్నారు. బుధవారం మంథని పట్టణంలోని రాజగృహాలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ తాత ముత్తాతల కాలం నుంచి మంథనికి ఒక చరిత్ర ఉందని ఆ రోజుల్లోనే ఏది ఎక్కడ ఉండాలో ఆలోచన చేసి పొందుపర్చిండ్లని తెలిపారు. మంథని పట్టణ పరిధి అబాదీ స్థలంలో ఉందని పరిధి దాటితేనే రెవెన్యూ స్థలం మొదలవుతుందన్నారు.ఆనాడు టౌన్ మున్సిపాలిటిగా ఉన్న సమయంలో చైర్మన్‌గా సువర్ణ చంటయ్య, ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేగా గులుకోట శ్రీరాములు ఉండేవారని, అలాంటి గ్రామాన్ని పూర్తిగా అస్తవ్యస్తం చేసే విధంగా మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు తన సొంత కుటుంబం పేరు కోసం ఆయన తండ్రి పేరు పెట్టుకోవడానికి వందల కోట్లను వృధా చేస్తూ మంథని చరిత్రను మట్టిలో కలుపే ప్రయత్నం ప్రారంభించారని అన్నారు. అయితే ఎమ్మెల్యే ప్రయత్నాలను, కుట్రలను అరికట్టాల్సిన బాధ్యత ఈ మట్టిలో పుట్టిన ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈనాడు మున్సిపాలిటీని తీసేసి పక్కకు కదుతాండ్లని, ప్రస్తుతం మున్సిపాలిటి కార్యాలయానికి వెళ్లకుండా అన్నీ ఆన్‌లైన్‌లోనే చేసుకుంటున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. చరిత్ర ఉన్న మున్సిపాలిటీని అక్కడి నుంచి తొలగించడం, సివిల్ ఆస్పత్రిని చెరువులో నిర్మించడం, జడ్జిల క్వాటర్లనుకూల గొట్టడం,ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌ను ఎక్కడో నిర్మించడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. మంథనిలో ఉన్న మా చరిత్రను చెడిపేసి దుద్దిళ్ల కుటుంబ చరిత్రను రాసుకోవడానికి ఇవ్వాల చరిత్ర కల మంథనిని రూపుమాపుతున్నాడని ఆయన విమర్శించారు. ఈ విషయంలో పట్టణంలో ఉన్న మేధావులకు లెటర్లు రాస్తున్నట్లు ఆయన చెప్పారు. నూతనంగా రింగ్‌రోడ్ నిర్మాణం చేపట్టి దానికి శ్రీపాద రింగ్‌రోడ్ అనిపేరు పెట్టిండ్లని, దానితో ఎవరికి అవసరం ఉంటదో ఎవరికి ప్రయోజనం చేకూర్చుతుందో అర్థం చేసుకోవాలన్నారు. ఇప్పటికే ఆర్టీసీ బస్సు ఉచితంతో వ్యాపారాలు క్షీణించి పోయి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్రమంలో ఈ రింగ్‌రోడ్‌తో ఇంకా ప్రమాదం ఉంటుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. మంథని ప్రజలు, సీనియర్ సిటిజన్లు నోరు మెదకపోతే మంథని చరిత్రను మట్టిలో కలుపతారని, ఎంతసేపు తన తండ్రి పేరు పెట్టుకోవాలని ఆలోచన చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తండ్రికి ఒక చరిత్ర లేదని, ఒక ఊరును పొందుపర్చలేదు... ట్యాంక్ కట్టలేదు ఆకలి తీర్చడానికి ఇండస్ట్రీ ప్యాక్టరీ కంపెనీ పెట్టలేదు అయినా వాళ్ల తండ్రి పేరు మాకు ఎందుకు ఆపాదించే ప్రయత్నం చేస్తున్నడో అర్థం కావడం లేదన్నారు. తాను మంథనిలో ఉన్న మేధావులు, సీనియర్ సిటిజన్‌లైన గంగాధర్ సార్, సీనియర్ న్యాయవాది సువర్ణ చంద్రశేఖర్, నాటి టౌన్ మున్సిపాలిటి చైర్మన్ మాదాటి ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొండపాక సత్య ప్రకాశ్ అడ్వకేట్ ప్రభాకర్‌రెడ్డి, గంగాశంకర్, వార్డు మెంబర్‌గా పని చేసిన అట్టెం మల్లయ్య, తాటి బుచ్చయ్య, రిటైర్డ్ అధికారి కుక్కడపు రామయ్య, పత్రికారంగంలో సీనియర్ పాత్రికేయులు కొమురోజు మారుతి, సీనియర్ న్యాయవాది అవధానుల రమేష్‌బాబు, లైన్‌గడ్డలో ఉన్న రిటైర్డ్ ఉద్యోగి బాబాయ్, వార్డు మెంబర్‌గా పని చేసిన పినగాని రాజమల్లుకు స్వయంగా తమ నాయకులు కలిసి లేఖలు అందిస్తారని తెలిపారు.మంథని చరిత్ర గురించి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ను నిలదీయకపోతే మన మూలాలు తీసిపారేస్తూ వందల కోట్లు వృధా చేస్తూ స్థలాలను వృధా చేస్తాడన్నారు. తాజాగా ఆర్అండ్‌బీ, ఐబీ కార్యాలయాలు లేకుండా చేసిండన్నారు. ఆనాడు తమ హాయాంలోమంథని అభివృద్ధిలో ఎవరికి ఇబ్బంది పెట్టలేదని, రింగ్‌రోడ్డు నిర్మాణంలోఒక్క ఇల్లు పోకుండా నిర్మించామన్నారు. గ్రౌండ్‌ను తీర్చిదిద్దామని, ఇంటర్నేషనల్ స్థాయిలో చేయాలనే ఆలోచనతో ప్లాట్ ఫాంలు తయారు చేశామన్నారు.బర్రెకుంటను తీసేసి స్టేడియం చేయాలని ఆనాడు ఇదే ఎమ్మెల్యే చూస్తే బర్రెకుంట కాదని అంబేద్కర్ నగర్ కుంట అని దానిని అభివృద్ధి చేసేందుకు బన్నెచెరువుకు లింక్ చేసి నీళ్లను తీసుకువచ్చినట్లు తెలిపారు. కూచిరాజ్‌పల్లి గొల్లగూడెం బోయిన్‌పేటను అభివృద్ధి చేయాలని చూశామన్నారు. ఇప్పుడు మంథని గ్రామ రూపురేఖలు లేకుండా పట్టణాన్ని ధ్వంసం చేయాలని చూస్తున్నాడని, 80ఏండ్ల పైబడి ప్రజాజీవితంలో ఉద్యోగ రంగంలో పని చేసి అనుభవం ఉన్న వాళ్లు స్పందించాలన్నారు.

మనం నోరు విప్పకపోతే మంథని పేరును దుద్దిళ్ల శ్రీపాద పేరు పెట్టే ప్రమాదం ఉందని, అన్యాయాలను అక్రమాలను నిలదీయకపోతే చరిత్ర క్షమించదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.




# అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఘనంగా ఖేల్ కి జోష్

**కరీంనగర్, వుదయం :**

క్రీడల ద్వారా విద్యార్థులకు ఒత్తిడి నుండి ఉపశమనం లభించడమే కాకుండా మానసికంగా శారీరకంగా అభివృద్ధి చెందుతారని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో "అల్ఫోర్స్ ఖేల్ కి మస్త్" పేరుతో ఏర్పాటు చేసిన క్రీడాపోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు ఎన్నో లాభాలు చేకూర్చడమే కాకుండా వారికి చదువు పట్ల ఆసక్తిని పెంపొందిస్తుందన్నారు. మన భారత దేశంలో క్రీడా రంగానికి ఎనలేని ప్రాముఖ్యత ఉన్నదని, చాలామంది క్రీడారంగంలో రాణించడం ద్వారా విజేతలగా ఉన్నారని వారు చెప్పారు.విద్యార్థులకు నూతనోత్సాహం పెంపొందించడానికి, స్నేహపూర్వకమైన వాతావరణం కల్పించడానికి నేడు పాఠశాలలో వివిధ రకాల క్రీడాలను నిపుణులైన వ్యాయామ ఉపాధ్యాయులతో నిర్వహించడం జరిగినదని వారు చెప్పారు. వేడుకలలో భాగంగా విద్యార్థులకు ఫుట్బాల్, వాలీబాల్, ఖో-ఖో, కబడ్డి, స్కిప్పింగ్, చెస్, క్యారమ్స్, తదితర పోటీలను నిర్వహించడం జరిగింది.అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి బహుమతులను త్వరలో నిర్వహించే ప్రత్యేక వేడుకలో ప్రధానం చేయ డం జరుగుతుందని వారు చెప్పారు. పాఠ శాల వార్షిక ప్రణాళికలో భాగంగా నిర్వహించిన క్రీడలను తల్లి దండ్రులు స్వాగతించారు,ఎల్లప్పుడూ విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికి తీస్తున్నటువంటి అల్ఫోర్స్ విద్యాసంస్థల యాజమాన్యానికి వారు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# కడిగిన ఆణిముత్యంలాంటి నేత హరీశ్ రావు మీడియా సమావేశంలో బీఆర్ఎస్

**వుదయం, సిద్దిపేట:**

సిద్ధిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాజీ మంత్రి హరీశ్ రావుపై జరుగుతున్న విచారణలను తీవ్రంగా ఖండించారు. హరీశ్ రావుపై ఎన్ని కుట్రలు పన్నినా ఆయన కడిగిన ఆణిముత్యంలా బయటకు వస్తారని అన్నారు. తోకా-తలలేని ప్రశ్నలతో ప్రశ్నించే గొంతుకను ఆపలేరని స్పష్టం చేశారు.గతంలోనే ఇలాంటి వ్యవహారాలపై సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిందని, అయినా ఇంకా ప్రభుత్వానికి బుద్ధి రాలేదని విమర్శించారు. పెట్టుబడులు తీసుకురావడం పేరుతో ముఖ్యమంత్రి దావోస్‌కు వెళ్లారని, అయితే ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ ద్వారా నిజంగా ఎంత పెట్టుబడి తీసుకువచ్చారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గ్లోబల్ సమ్మిట్‌లో ఐదు లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ప్రభుత్వం ప్రకటించిందని, ఆ పెట్టుబడులు ఎక్కడ, ఎలా ఖర్చు పెట్టారో సీఎం వివరించాలని అన్నారు.హరీశ్ రావుపై విచారణ పేరుతో రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. మీరు ఎన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్ భయపడేదే లేదని స్పష్టం చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వాహనాలకు ఉచిత టోల్‌గేట్ ప్రవేశం కల్పించి, తెలంగాణ ప్రజలపై బస్సు టికెట్ల ధరలు పెంచిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కిందని విమర్శించారు.తెలంగాణలో చంద్రబాబు నాయుడు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవకపోతే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



# జీవితంలో పిల్లలు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

**రాయపర్తి, వుదయం:**




మండలంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలల్లో ఆవరణ యందు ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ఎస్ వి బి శర్మ, జిల్లా అగ్నిమాపక అధికారి వరంగల్ ఆధ్వర్యంలోమధ్యాహ్నం 3 గంటలకు స్ఫూర్తి కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమాన్ని శ్రీధర్ రెడ్డి స్ఫూర్తి కోఆర్డినేటర్ జిల్లా అగ్నిమాపక కేంద్రం అధికారి మాట్లాడుతూ డ్రగ్స్ మత్తు పదార్థాలకు, సోషల్ మీడియాకు లోను కాకుండా మంచి నడవడిని, ప్రవర్తనను పెంపొందించుకోవాలని అన్నారు. ముఖ్యంగా పిల్లలు తల్లిదండ్రులకు గురువులకు పెద్దలకు మంచి పేరు తీసుకురావడానికి మంచి ప్రవర్తన కలిగి ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు. జీవితంలో చిన్నచిన్న తప్పిదాలకు ,ఆవేశానికి లోనై, కృంగిపడక ,ఆత్మహత్యలకు లోను కాకుండా, ధైర్యంతో ఎదుర్కొని, చెడు సాహసాలు చేయకుండా, పశ్చాతాపం చెంది మంచి మార్గంలో నడవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉప్పలయ్య సారు,ప్రవీణ్ రెడ్డి సారు, రోజా రాణి, రాధా ,సురేందర్, శ్రీనివాస్, నరసింహ, సంధ్యా, దేవేందర్ విక్రమ్ ఉమాదేవి ,శోభ, అరుణ,తదితరులు పాల్గొన్నారు.

# ఎంసిహెచ్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలి.. జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి, వుదయం:**

ఎంసిహెచ్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం పెద్దపల్లి పట్టణంలో ఉన్న మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి లోని హెల్ప్ డెస్క్, స్కానింగ్ రూమ్, చిన్న పిల్లల వార్డు, ఆప్తామాలజిస్ట్ ఓపి వార్డ్, ఫార్మసి, ఆర్థో, జనరల్ వార్డులను, ప్రసూతి ఓపి, పాలాటివ్ కేర్ వార్డ్, డయాగ్నోస్టిక్ హబ్, బ్లడ్ బ్యాంక్ లను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ఫార్మసీ స్టోర్ లో అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో పెట్టుకోవాలని కలెక్టర్ తెలిపారు. ల్యాబ్ లో రక్త పరీక్షల నిర్వహణకు ఏమైనా పరికరాలు అవసరం ఉంటే వివరాలు అందించాలని అన్నారు. ఎం.సి. హెచ్ నందు గర్భిణీ మహిళలకు , పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఏవైనా పరికరాలు అవసరమైతే ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి పనులను కలెక్టర్ పరిశీలించి సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, పి.ఓ.డాక్టర్ వాణిశ్రీ, ఆర్ఎంఓ డాక్టర్ విజయ్, జనరల్ సర్జన్ డాక్టర్ సాయి ప్రసాద్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# దళిత వ్యతిరేక శక్తులపై ఉక్కుపాదం మోపాలి

**చెగువీర యూత్ ఆగడాలపై పోలీసులకు ఫిర్యాదు**

**నిందితులపై కఠిన చర్యలకు బొంకూరి కైలాసం డిమాండ్**

**పెద్దపల్లి, వుదయం:**

పట్టణంలోని 24, 25వ వార్డుల పరిధిలో నిర్మించనున్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కమ్యూనిటీ భవన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం తీవ్ర కలకలం రేపుతోంది.ఈ ఘటన వెనుక చెగువీర యూత్ అనే గుంపు ప్రమేయం ఉందని అంబేడ్కర్ కమ్యూనిటీ భవనం అధ్యక్షులు బొంకూరి కైలాసం ఆరోపించారు. ప్రభుత్వం కేటాయించిన ఎస్సీ కమ్యూనిటీ స్థలంలో, 2020లో అప్పటి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి 19.50 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయగా, 2022 డిసెంబర్ 19న అధికారికంగా భూమి పూజ నిర్వహించి శిలాఫలకాన్ని ఏర్పాటు చేసినట్లు కైలాసం పేర్కొన్నారు. అయితే ఎన్నికల కోడ్ కారణంగా భవన నిర్మాణం తాత్కాలికంగా నిలిచిపోయింది. ఈ క్రమంలోనే చెగువీర యూత్ పేరుతో కొంతమంది యువకులు అక్కడ అనుమతి లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల నుంచి డబ్బులు వసూలు చేయడం ప్రారంభించారని,దీనిని ప్రశ్నించినందుకు కక్ష గట్టి అంబేద్కర్ ఫ్లెక్సీలను తొలగించి,చివరకు శిలాఫలకాన్ని పగలగొట్టారని కైలాసం ఆవేదన వ్యక్తం చేశారు.గత ఏడాది ఫిబ్రవరిలో పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ,తాజాగా జనవరి 26 వేడుకలను అడ్డం పెట్టుకుని ఉద్దేశపూర్వకంగా ఈ దాడికి పాల్పడ్డారని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనకు బాధ్యులుగా చంద్రగిరి ఉదయ్, ఆరేపల్లి మానస్, ఆరేపల్లి మనోజ్, ఆరేపల్లి మల్లి అనే వారిని పేర్కొంటూ పోలీసులకు ఫిర్యాదు చేసిట్లు కైలాసం వెల్లండించారు. నిందితులపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, దళితుల అభివృద్ధి కోసం కేటాయించిన స్థలంలో అక్రమాలను సహించబోమని ఆయన హెచ్చరించారు.



# విద్యార్థులతో కలిసి గాలిపటాలు ఎగురవేసిన పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్

**వుదయం, సిద్దిపేట:**

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ చేపట్టిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా శనివారం కమిషనరేట్ పరేడ్ మైదానంలో గాలిపటాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ వేడుకలో మెరిడియన్ స్కూల్, అంబిటస్ స్కూల్, వికాస్ హైస్కూల్, సెయింట్ మేరీస్ హైస్కూల్‌లకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోలీస్ కమిషనర్ స్వయంగా విద్యార్థులతో కలిసి గాలిపటాలు ఎగురవేసి వారిలో నూతనోత్సాహాన్ని నింపారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ, ప్రాణం ఎంతో విలువైనదని, గాలిపటం ఎగురవేసేటప్పుడు ఎంత జాగ్రత్తగా ఉంటామో రోడ్డుపై ప్రయాణించే సమయంలో కూడా అంతే ఏకాగ్రతతో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని విద్యార్థులు, యువతకు పిలుపునిచ్చారు.గాలిపటాల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు పోలీస్ కమిషనర్ స్వయంగా బహుమతులు అందజేశారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని పాఠశాలల ప్రతినిధులు అభిప్రాయం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కుశాల్కర్, అదనపు డీసీపీ (ఏఆర్) సుభాష్ చంద్రబోస్, అన్ని డివిజన్‌ల ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# పకడ్బందీగా ఇంటర్ పరీక్షలను నిర్వహించాలి అదనపు కలెక్టర్

**పెద్దపల్లి, వుదయం:**

జిల్లాలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ డి.వేణు సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఇంటర్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ, ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు జరిగే ఇంటర్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు . జిల్లాలో జనరల్, వోకేషనల్ కలిపి మొత్తం 7 వేల 965 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతున్నారని అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 22 పరీక్ష కేంద్రాలలో ఇంటర్ థియరీ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని,పరీక్ష కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు పరీక్ష హాల్స్ లో త్రాగు నీరు అందించాలని, అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల సౌకర్యార్థం రవాణా కోసం పరీక్షకు సకాలంలో హాజరయ్యే విధంగా అనుకూలంగా ఆర్టీసీ బస్సులు పరీక్షా కేంద్రాల రూట్లలో స్పెషల్ బస్సులు నడపాలని అన్నారు. రెసిడెన్షియల్ విద్యా సంస్థలలో చదివే ఇంటర్ విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. పరీక్షా కేంద్రాలలో పనిచేసే ఇన్విజిలేటర్ లకు అవసరమైన శిక్షణ అందించాలని అన్నారు. పరీక్ష కేంద్రంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, పరీక్షా ప్రశ్న పత్రాల లీకేజీ ఎట్టి పరిస్థితుల్లోనూ జరగకుండా చీఫ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల సమక్షంలో ప్రశ్న పత్రాల కవర్ సీళ్లు ఓపెన్ చేయాలని, ఆ సమయంలో అధికారులు సెల్ ఫోన్ తీసుకు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు, కనీస మందులతో పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో పారిశుద్ధ్య నిర్వహణ స్థానిక సంస్థలు పర్యవేక్షించాలని ఆయన సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారి కల్పన, పెద్దపల్లి ఆర్డిఓ గంగయ్య, ఏసీపీ జి. కృష్ణ, కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్, రమేష్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు.. అదనపు కలెక్టర్



**పెద్దపల్లి, వుదయం**

జిల్లాలో నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ డి.వేణు సమీకృత కలెక్టరేట్ లోని గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలు సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జరుగుతాయని, జిల్లాలోని ప్రతి శాఖకు చెందిన అధికారులు , సిబ్బంది వేడుకలకు తప్పనిసరిగా హాజరు కావాలని అదనపు కలెక్టర్ తెలిపారు. గణతంత్ర దినోత్సవ వేడుకలకు సంబంధించి జాతీయ పతాక ఆవిష్కరణ ఏర్పాట్లు, గ్రౌండ్ సిద్ధం చేయడం మొదలగు ఏర్పాట్లు పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని అన్నారు. గణతంత్ర వేడుకల డయాస్ , సీటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, దీనిని అప్రమత్తంగా నిర్వహించాలని అన్నారు. ఏఎన్ఎం ఆధ్వర్యంలో వైద్య బృందాలచే శిభిరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ముఖ్య అతిథి గా జిల్లా కలెక్టర్ అందించే సందేశం రూపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల వివరాలను క్లుప్తంగా అందజేయాలని అన్నారు. గణతంత్ర వేడుకల అవసరమైన మేర త్రాగు నీటి క్యాన్లు ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులు మున్సిపల్ కమిషనర్ సమన్వయంతో ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు.గణతంత్ర దినోత్సవ వేడుకలలో సాంస్కృతిక కార్యక్రమాల కోసం పాఠశాల విద్యార్థులను తరలించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని వారికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ విద్యాశాఖ అధికారికి సూచించారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను అదనపు కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సమావేశంలో పెద్దపల్లి రెవిన్యూ డివిజనల్ అధికారి గంగయ్య, ఏసీపీ జి. కృష్ణ, కలెక్టరేట్ పరిపాలన అధికారి బి. ప్రకాష్, మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్ ,రమేష్ సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# 'శౌర్య' ఇండోర్ గేమ్స్ హాల్‌ను ప్రారంభించిన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

**కరీంనగర్, వుదయం:**

పోలీస్ అధికారులు, సిబ్బంది సంక్షేమంలో భాగంగా, వారి మానసిక ఉల్లాసం కోసం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో అత్యాధునిక వసతులతో ఏర్పాటు చేసిన 'శౌర్య' ఇండోర్ గేమ్స్ హాల్‌ను బుధవారం పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ప్రారంభించారు. కమిషనరేట్ లోని అస్త్ర కన్వెన్షన్ హాలు పక్కన నిరుపయోగంగా ఉన్న పాత యూనిట్ హాస్పిటల్ భవనాన్ని సీపీ ప్రత్యేక చొరవతో ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దారు. దీనికి 'శౌర్య ఇండోర్ గేమ్స్ హాల్' అని నామకరణం చేసి, సిబ్బందికి అన్ని రకాల క్రీడా సౌకర్యాలు అందుబాటులోకి వచ్చేలా పునర్నిర్మించారు.ఈ క్రీడా వేదికలో అధికారులు, సిబ్బంది కోసం ఈ క్రింది వసతులను కల్పించారు. టేబుల్ టెన్నిస్ మరియు స్నూకర్స్, క్యారం బోర్డ్స్ మసాజ్ చైర్ (విశ్రాంతి కోసం), టీవీ హాల్ ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా సీపీ గారు మాట్లాడుతూ.. ఈ ఇండోర్ గేమ్స్ హాల్ హోమ్ గార్డ్ స్థాయి నుండి కమిషనర్ వరకు అందరికీ అందుబాటులో ఉంటుందని వెల్లడించారు.



# ఖితార్ లో ఘనంగా సంప్రదాయ వేడుకలు

**ఆంధ్ర కళా వేదికలో ఉట్టి పడిన తెలుగుదనం మంథని వాస్తవ్యుల ప్రతిభ**

**మంథని, వుదయం:**

సంస్కృతి సాంప్రదాయాలకు నిలయమైన భారతదేశంలో సంప్రదాయ పండుగలు ఘనంగా నిర్వహిస్తుండటం సహజం. కానీ మన తెలుగువారు ఖతార్ దేశంలో తెలుగు పండుగలు ఘనంగా నిర్వహిస్తుండడం మన దేశ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పడుతుంది. ముఖ్యంగా ఆంధ్ర కళావేదిక నిర్వహించిన సంక్రాంతి కి వస్తున్నాము అనే సాంస్కృతిక మహోత్సవ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మంథని వాస్తవ్యుడు రామడుగు వేణు మాట్లాడుతూ తెలుగు రాష్ట్ర కీర్తిని ప్రపంచ దేశాలకు సందేశం ఇచ్చే విధంగా నిర్వహించడం గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు నటులు రాంకీ, నటి భూదేవి చేసిన నృత్యం జానపద గీతాలు పల్లె వాతావరణం తలపించాయి. యాంకర్ స్వప్న చౌదరి అద్భుతమైన యాంకరింగ్ చేయడం విశేషం. కార్యక్రమం జరుగుతున్నంతసేపు ఆ ప్రాంతమంతా నిశ్శబ్దంలోకి వెళ్లడం చెప్పుకోదగ్గ విషయం. అలాగే కృష్ణ చైతన్య, మాళవిక యుగళ గీతాలు, డ్యాన్స్ మాస్టర్లు సత్యం తేజస్విని, నటుడు పృథ్వి కుమార్తె శ్రీలు చేసిన నృత్యం ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకుంది. 80 మందికి పైగా కళాకారులతో నృత్య నాటిక నిర్వహించారు. అలాగే 40 మంది కళాకారులతో శ్రీకృష్ణ లీల ప్రదర్శన వేలాది దీపాల వెలుగుల మధ్య కనువిందు చేసింది. ఏకేవి కమిటీ సభ్యులందరూ సంప్రదాయ ధోతీలు శాలువాలు ధరించడం మహిళలు పచ్చని చీరలతో ఆకర్షనీయంగా కనిపించారు. ఈ కార్యక్రమంలో ఖతార్ లోని మన దేశ రాయబారి విపుల్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్ పిడి జనార్ధన్, అధ్యక్షులు రమణయ్య ప్రసంగించారు.



# ఎన్‌సిసి క్యాడెట్‌లకు ప్రశంసా పత్రాలు అందజేత

**కరీంనగర్, వుదయం:**

గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు, ఎన్నికల సమయంలో ట్రాఫిక్ విధుల్లో అత్యంత సమర్థవంతంగా, క్రమశిక్షణతో విధులు నిర్వహించిన ఎన్.సి.సి క్యాడెట్‌ల సేవలను గుర్తించి, వారిని కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం అభినందించారు. బుధవారం కమీషనరేట్ కేంద్రంలోని అస్త్ర కన్వెన్షన్ హాలునందు ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో క్యాడెట్‌లకు ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎన్నికల వంటి కీలక సమయాల్లో పోలీసు శాఖకు అండగా నిలిచి, శాంతిభద్రతల పరిరక్షణలో ఎన్‌సిసి క్యాడెట్లు కీలక పాత్ర పోషించారని కొనియాడారు. వారిలోని సేవా దృక్పథం, సమయపాలన అభినందనీయమని పేర్కొన్నారు. క్యాడెట్‌లను సమన్వయం చేస్తూ పోలీసు శాఖకు పూర్తి సహకారాన్ని అందించిన ఎన్‌సిసి అధికారులను సీపీ గారు శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. రాబోయే మున్సిపల్ఎన్నికలు, నగరంలో ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా భవిష్యత్తులో కూడా ఎన్‌సిసి క్యాడెట్ల సేవలను వినియోగించుకుంటామని సీపీ వెల్లడించారు. సమాజ సేవలో యువత భాగస్వామ్యం కావడం వల్లవారికి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగే అవకాశం ఉంటుంది.

### సిద్దిపేటలో జేఈఈ మెయిన్స్

## ఫస్ట్ పేపర్ పరీక్షలు ప్రారంభం

**వుదయం, సిద్దిపేట:**



జేఈఈ మెయిన్స్–2026 ఫస్ట్ పేపర్ పరీక్షలు సోమవారం సిద్దిపేట జిల్లాలోని రెండు పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు.పరీక్షలను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్‌గా, అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండో సెషన్‌గా నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేపట్టగా, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.జేఈఈ మెయిన్స్ పరీక్షలు ఈ నెల 22, 23, 24 మరియు 28 తేదీల్లో కూడా సిద్దిపేట పట్టణంలోని అదే కేంద్రాల్లో కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు. పరీక్షల నిర్వహణపై జిల్లా యంత్రాంగం పర్యవేక్షణ చేపట్టింది.పరీక్షా కేంద్రాల వద్ద తల్లిదండ్రులు తమ పిల్లలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉత్సాహం నింపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు.

## గన్నేరువరం మండల ఉప సర్పంచుల ఫోరం చైర్మన్ గా వంగల లక్ష్మారెడ్డి

**కరీంనగర్, వుదయం:**



గన్నేరువరం మండల ఉప సర్పంచుల ఫోరం చైర్మన్ గా వంగల లక్ష్మారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఎల్.ఎం.డీ కాలనీలో ఎం.ఎల్.ఏ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఉప సర్పంచుల సమావేశంలో గుండ్లపల్లి గ్రామ ఉపసర్పంచ్ వంగల లక్ష్మారెడ్డిని మండల ఉప సర్పంచుల చైర్మన్ గా ఎన్నుకున్నారు. మండలంలో 11 గ్రామ పంచాయతీలు ఉండగా, మెజార్టీ సంఖ్యలో 10 గ్రామాలకు చెందిన ఉప సర్పంచులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న వారిలో గుండ్లపల్లి ఉపసర్పంచ్ వి.జ్యోతి, చీమలకుంటపల్లి ఉప సర్పంచ్ జి.ప్రవళిక, పీచుపల్లి ఉపసర్పంచ్ శ్రీనివాసరెడ్డి, గోపాల్ పూర్ ఉప సర్పంచ్ బి.శంకర్, మాదాపూర్ ఉపసర్పంచ్ కే.అనిత, యాస్వాడ ఉపసర్పంచ్ జి.భాగ్యలక్ష్మి, చాకలివానిపల్లె ఉప సర్పంచ్ కె.సంపత్, కాసింపేట్ ఉప సర్పంచ్ ఐలయ్య, గుండ్లపల్లి ఉప సర్పంచ్ లక్ష్మారెడ్డి, జంగపల్లి ఉప సర్పంచ్ ప్రభాకర్ ఉన్నారు. అనంతరం వీరంతా మర్యాదపూర్వకంగా మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను కలిశారు. ఈ సందర్భంగా మండల ఉపసర్పంచ్ ల ఫోరం చైర్మన్ వంగల లక్ష్మా రెడ్డితో పాటు ఉప సర్పంచులను ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ సన్మానించారు.

### సిద్దిపేటలో శ్రీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

**వుదయం, సిద్దిపేట**



సిద్దిపేట పట్టణంలోని శ్రీ సాయిబాబా ఆలయంలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వంగ రాజేశ్వర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డి గారు మాట్లాడుతూ, సాయిబాబా కృప ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, ఐక్యత, భక్తి భావాలను మరింతగా పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. భక్తి మార్గం మన జీవితాలకు సక్రమ దిశను చూపుతుందని ఆయన అన్నారు.అలాగే ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆలయ నిర్వాహకులను ఆయన అభినందించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పట్టణ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడగా, భక్తిశ్రద్ధలతో వాతావరణం ఆధ్యాత్మికంగా మారింది.

## గర్భిణీలకు పోషకాహారం అనివార్యం: సర్పంచ్ రాచమల్ల ఎల్లేష్

**జగదేవ్‌పూర్, జనవరి 21 (వుదయం ప్రతినిధి)**



గర్భిణీ స్త్రీలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సిద్దిపేట జిల్లాజగదేవ్‌పూర్ మండల పరిధిలోని అలిరాజపేట గ్రామ సర్పంచ్ రాచమల్ల ఎల్లేష్ సూచించారు. గురువారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అలిరాజపేట గ్రామ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు నిర్వహించిన శ్రీమంతం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గర్భిణీలు తీసుకునే పౌష్టికాహారం గర్భస్థ శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ స్త్రీల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని, నాణ్యమైన ఆహారాన్ని అందిస్తోందని తెలిపారు. వీటిని గర్భిణీలు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే, భవిష్యత్తులో గర్భిణీలకు మరింత మెరుగైన ఆహారం అందించేలా ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలని ఆయన విన్నవించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ రేణుక, హెల్పర్ సౌందర్య, ఆశా వర్కర్ కవిత, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు బాపురెడ్డి మరియు అలిరాజపేట గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలను నివారించాలి

### గజ్వేల్ ట్రాఫిక్ ఎస్ఐ నిరేష్

**గజ్వేల్, వుదయం**



సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గజ్వేల్ పట్టణంలోని ఇందిరా పార్క్ చౌరస్తాలో బుధవారం'అరైవ్–అలైవ్' రోడ్డు భద్రతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ నిరేష్ వాహనదారులు, ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ మరియు వాహన ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. అధిక శాతం రోడ్డు ప్రమాదాలు మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ, ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదరహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఆటో డ్రైవర్లు వాహనాలను రోడ్డుపై అడ్డదిడ్డంగా కాకుండా కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలపాలని, రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయవద్దని హెచ్చరించారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడిపి తమ ప్రాణాలతో పాటు ప్రయాణికుల ప్రాణాలను పణంగా పెట్టవద్దని హితవు పలికారు. నిబంధనలకు విరుద్ధంగా ఆటోల్లో లౌడ్ స్పీకర్లు పెట్టినా, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నా మోటార్ వెహికల్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏఎస్ఐ జగదీశ్వర్, హెడ్ కానిస్టేబుల్ సాంబశివరావు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## వెలికట్టలో మొదటి గ్రామ సభ

**వుదయం కొండపాక**



రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన సర్పంచులు దాదాపు అన్ని గ్రామాల్లో వారి పాలకవర్గ సభ్యులతో కలిసి గ్రామ సభను ఏర్పాటు చేస్తున్న తరుణంలో కొండపాక మండల పరిధిలోని వెలికట్ట గ్రామంలో సర్పంచ్ బూరుగుల మానస సురేందర్ రావు ఆధ్వర్యంలో మొదటి గ్రామ సభను బుధవారం రోజునిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ మాపై నమ్మకం ఉంచి సర్పంచ్ గా గెలిపించిన గ్రామ ప్రజలకు మొదటగాధన్యవాదాలుతెలుపుతున్నామన్నారు. సభలో పాల్గొన్న పలువురు ప్రజలు గ్రామంలో నెలకొన్న విద్యుత్ లైన్ సమస్యలు, శిధిలావస్థలో ఉన్న మోరీలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం కావలిసిన ఇసుక కోసం అడగగా కచ్చితంగా అతి త్వరలో ఈ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు ఉపయోగపడే విధంగా బీటును ఏర్పాటు చేయాలని, గ్రామంలో ఉన్న కోణోకర్పస్ చెట్లను తొలగించాలని కోరగా ఈ విషయాలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములు, గ్రామకంఠం భూముల్లో ప్రభుత్వ భూమి సూచిక బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామ పంచాయతీ అనుమతి తీసుకోకుండా ఎవరు అక్రమ నిర్మాణాలు చేపట్టకూడదన్నారు. ముఖ్యంగా గ్రామం నుండి పొలాల దగ్గరికి వెళ్లే రైతులకు దారుల విషయంలో చాలా ఇబ్బందిగా ఉంది కాబట్టి రైతులందరూ ఒకరికి ఒకరు సహకరించుకొని రోడ్లు నిర్మించుకునే విషయంలో ఒకతాటిపైకి రావాలని కోరారు. రహదారుల నిర్మాణాలతో పాటు, ఎన్ఆర్ఈజీఎస్ ద్వార రైతులకు ఉపయోగపడే డైరీ ఫార్మ్, చిన్న పౌల్ట్రీ ఫార్మ్ షెడ్ల నిర్మాణం, పందుల పెంపకానికి ఉపయోగపడే పథకాల గురించి వివరించారు ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు. అనంతరం సభలో పాల్గొన్న వ్యవ సాయ విస్తరణాధికారి మాట్లాడుతూ ఇప్పటివరకు చాలామంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోలేదని, వెంటనే ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని లేదంటే ఫ్యూచర్ లో ప్రభుత్వపరంగా వచ్చే కొన్ని బెనిఫిట్స్ కోల్పోయే అవకాశం ఉందన్నారు. ఈ గ్రామసభలో ఉపసర్పంచ్ సర్పంచ్, గ్రామ పాలక వర్గ సభ్యులు, గ్రామ కార్యదర్శి నర్సింలు, గ్రామ వ్యవసాయవిస్తరణాధికారి రమ్యశ్రీ, విద్యుత్తు లైన్మెన్ నాగరాజు, టెక్నికల్ అసిస్టెంట్ నాగార్జున, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రభాకర్, అంగన్వాడి టీచర్లు పద్మ విజయలక్ష్మి, ఆశ వర్కర్ చంద్రకళ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వేసవిలో నీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు..జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి, వుదయం**



రాబోయే వేసవిలో జిల్లాలో నీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం డి.డబ్ల్యూ.ఎస్.ఎం పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లా డుతూ, నీటి ఎద్దడి సమస్య రాకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అన్నారు. గ్రామాలలో త్రాగునీటి లీకేజీ సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని అన్నారు. త్రాగునీటి సరఫరాకు సంబంధించి పంపు సెట్ మరమ్మత్తు పనులు పూర్తి చేయాలని అన్నారు. ఫిబ్రవరి 1 నుంచి 20 రోజుల పాటు గ్రామాలలో త్రాగునీటి సరఫరా పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, గ్రామాలలో ఎక్క డైనా త్రాగునీటి సమస్యలు ఉంటే వాటిని స్పెషల్ డ్రైవ్ లో పరిష్కరించాలని, రాబోయే వేసవి కాలం నాటికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా సంసిద్ధం కావాలని అన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ నరేందర్, డి.ఆర్.డి.ఓ. కాళిందిని, ఈఈ మిషన్ భగీరథ గంగాధర శ్రీనివాస్, పూర్ణ చందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ప్రమాద భీమా చెక్కు పంపిణీ

**పెద్దపల్లి వుదయం**



పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో తేది 02-05-2025 రోజున 28వ వార్డుకి చెందిన ఉప్పు శంకర్ ఇంటి నందు గజ్జెల శ్రీనివాస్ గారు (కరీంనగర్ చింతకుంట నివాసి) ప్లంబింగ్ వర్క్ చేస్తుండగా విద్యుత్ షాక్ తో శ్రీనివాస్ ప్రమాదవశాత్తు మరణించడంతో నష్ట పరిహారం కింద తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ శాఖ ద్వారా ₹ 5,00,000/- లక్షల రూపాయలను శ్రీనివాస్ గారి కుటుంబ సభ్యులు అయినా గడ్డం వైష్ణవి, దివ్య, కనకలక్ష్మి గార్లకు విద్యుత్ శాఖ అధికారులతో కలిసి అందజేసిన గౌరవ పెద్దపల్లి శాసనసభ్యులు శ్రీ.చింతకుంట విజయరమణ రావు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎడిఈ ఆంజనేయ రావు, పెద్దపల్లి పట్టణ ఎ.ఈశ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ నీటి సంఘం చైర్మన్ ఎర్రబెల్లి మృతి

### మృతదేహంపై పూలమాల వేసిన వెలమ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు తక్కలపల్లి

**ఖానాపురం, వుదయం:**



మండలంలోని ధర్మరావుపేట గ్రామానికి చెందిన మాజీ నీటి సంఘం చైర్మన్ ఎర్రబెల్లి రామయ్య (85) అనారోగ్యంతో మృతిచెందగా మృతదేహాన్ని వెలమ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ తక్కలపల్లి రవీందర్ రావు సందర్శించి మృతదేహంపై పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకుని తల్లి భాషబోయిన వీరమ్మ ఇటీవలే మృతి చెందగా మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాద్రాజు వెంకన్న, గ్రామ పార్టీ అధ్యక్షుడు మేకల కుమారస్వామి, నాయకులు నడిపెల్లి రాజేశ్వర్ రావు, కత్తల వెంకటేశ్వర్ రావు, వెన్ను సమ్మయ్య, మేడి సమ్మయ్య, పెరుమళ్ళ సత్యం, అద్దూరి మోహన్ రావు, కత్తల మాధవరావు, చంచల కృష్ణ, పోల్సాని సంపత్ రావు, కూస మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుకుని ఉన్నతంగా ఎదగాలి

### రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి

**జయశంకర్ భూపాలపల్లి వుదయం:**



విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి అన్నారు బుధవారం మహాదేవపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో డీటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో డీటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు మడక మధు అధ్యక్షతన నో వెలిక్స్ ఫార్మసిటికల్స్ హైదరాబాద్, ఎన్ఆర్ఐ యుఎస్ఏ టీమ్ వారి ఆర్థిక సహాయంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మహాదేవపూర్,ప్రాథమిక పాఠశాల బొమ్మాపూర్ విద్యార్థులకు దాదాపు 650 వివిధ రంగుల టీ షర్ట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.అనంతరం కుట్టు శిక్షణ, బ్యూటీ పార్లర్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్ని తీర్చి దిద్దుతున్న ఉపాధ్యాయులను, డీ టీ ఎఫ్ ఉపాధ్యాయ సంఘాన్ని అభినందించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాపు మాట్లాడుతూ డా బాబా సాహెబ్ బి ఆర్ అంబేద్కర్ చెప్పినట్టు చదువును మించిన ఆయుధం ప్రపంచంలో ఏది లేదని అందుకే పిల్లలు బాగా చదివి ఉన్నతంగా ఎదగాలని అన్నారు. సర్పంచ్ హసీనా బానో మాట్లాడుతూ పాఠశాల విద్యాభివృద్ధిలో మా వంతు సహకారం అందిస్తామని అన్నారు. దాత జయప్రకాశ్ రెడ్డి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ మీరు ఎంత చదివితే మీకు సహాయం చేసేందుకు ప్రపంచంలో చాలా మంది ఉన్నారని అన్నారు. ప్రత్యేక ఆహ్వానితులు మహాదేవపూర్ తహసీల్దార్రామారావు, డీటీఎఫ్ సంఘాన్ని అభినందించారు.మహాదేవపూర్ ఎంఈఓ పురుషోత్తంరెడ్డి, ప్రజానాయకులు సహకరిస్తే మా ఉపాధ్యాయులు ఎంతైనా కష్టపడి మెరుగైన ఫలితాలు అందిస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీజ సంతోష్ బాలికల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి,డీటీఎఫ్ భూపాలపల్లి జిల్లాశాఖ ప్రధాన కార్యదర్శి తిరుపతి,డి టి ఎఫ్ జోనల్ బాధ్యులు తిరుపతి రెడ్డి,డి టి ఎఫ్ స్టేట్ కౌన్సిలర్ ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వీరేశం, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలి..

**ఖానాపురం, వుదయం:**




విద్యార్థులలో దాగి ఉన్న భయాన్ని పారలదోలి విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి విద్యార్థులను ఉన్నత శిఖరాలను చేర్చడమే స్ఫూర్తి ప్రోగ్రాం యొక్క ముఖ్య ఉద్దేశమని మండల అభివృద్ధి అధికారి వనపర్తి అద్వైత విద్యార్థులకు తెలిపారు. మండలంలోని అశోక్ నగర్ గ్రామంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సైనిక్ స్కూల్ లోని విద్యార్థులకు స్ఫూర్తి ప్రోగ్రాంపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని చదువుతోపాటు పాటలో ఆటలలో రాణించాలని విద్యార్థులకు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో సైనిక్ స్కూల్ ప్రిన్సిపల్ గట్ల సురేందర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలకు సీఎం కప్పుతో కొత్త ఊపిరి..

**పరకాల వుదయం:**



క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు మరింత ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తలపెట్టిన సీఎం కప్పు 2026 క్రీడ పోటీలు నడికూడ మండలం కంటాత్మకూర్ గ్రామంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కంటాత్మకూర్ పి.ఈ.టి ప్రేమేందర్ గారి ఆధ్వర్యంలో సీఎం కప్ గ్రామ స్థాయి క్రీడల పోటీలకు గ్రామ ఉపసర్పంచ్ కంటాత్మకూర్ కుమార స్వామి గారు ముఖ్య అతిథిగా పాల్గొని పచ్చ జెండా ఊపి క్రీడలను ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా ఉపసర్పంచ్ కంటాత్మకూర్ కుమారస్వామి మాట్లాడుతూ యువకులు, మహిళలు, చిన్నారులకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి క్రీడా అవకాశాలను కల్పించడం ఈ క్రీడల ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. చదువుతో పాటు క్రీడలు ఉంటే శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు నాయకత్వ లక్షణాలు, టీమ్ వర్క్ గురించి నేర్చుకుంటారని క్రీడాకారులకు సూచించారు. ఈ క్రీడలతో యువత, చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడల వైపు మళ్లాలని పిలుపునిచ్చారు, క్రీడలతో పల్లెల మధ్య పోటీలు నిర్వహిస్తున్నామని ఉపసర్పంచ్ తెలిపారు. గ్రామస్థాయిలో జట్లు తయారు చేసి మండల స్థాయికి, ఆ తరువాత రాష్ట్ర స్థాయి ఎంపిక చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వివరించారు.క్రీడల ద్వారా గ్రామీణ యువత ప్రతిభ వెలుగులోకి రావడంతో పాటు వారికి ఉన్నత స్థాయికి ఎదగడానికి అవకాశం కల్పించడమే సీఎం కప్ లక్ష్యమన్నారు.

## మహాదేవపూర్ లో సీఎం కప్ ఆటల పోటీలు

**జయశంకర్ భూపాలపల్లి వుదయం :**



మహాదేవపూర్ మండల కేంద్రంలో సీఎం కప్ క్లస్టర్ ఆటల పోటీలు మహాదేవపూర్ గ్రామ సర్పంచ్ హసీ నాబానో అక్బర్ ఖాన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్ రెడ్డి, జయశంకర్ జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ కోట రాజబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయిత ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో క్రీడాకారులకు తెలంగాణ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను చేపట్టి దేశంలోనే క్రీడాకారులను గొప్పగా తీర్చి దిద్దుతున్నది అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను 2036 లో జరిగే ఒలంపిక్ క్రీడోత్సవాలకు ప్రాతినిధ్యం వహించేలా తీర్చిదిద్దాలనే ఉద్దేశంలో భాగంగా ముఖ్యమంత్రి కప్ రూపంలో అనేకమైన ఆటలను ఆడిస్తూ క్రీడాలను ప్రోత్సహిస్తుందన్నారు మహాదేవపూర్ మండలంలోని విద్యార్థినీ విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర కీర్తిని దేశ నలుమూలల చాటేలా అనేక బహుమతులు తీసుకురావడం చాలా సంతోషాన్ని ఇచ్చిందని ఇలాగే కొనసాగిస్తూ జిల్లా పేరును పథకాల పట్టికలో ముందు ఉంచాలని దానికి వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ రామారావు, మండల పంచాయతీ ఆఫీసర్, భారతి, మండల విద్యాశాఖ అధికారి పురుషోత్తం రెడ్డి, మహాదేవపూర్ క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు బండం రాజి రెడ్డి, శ్రీనివాస రెడ్డి, ఉపసర్పంచ్ తుంగల శ్రీజ, సంతోష్, ఉపాధ్యాయులు రమేష్, పూర్ణిమ, శంకర్, రాజ్ కుమార్, సాంబయ్య, నవీన, సతీష్, పంచాయతీ సెక్రటరీలు కల్పన, వార్డ్ మెంబర్లు, అస్రార్ ఖురేషి, పడాల రాజమౌళి, గడ్డం స్వామి, నైముద్దీన్, మహమ్మద్తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల పక్షాన ప్రశ్నిస్తే బెదిరింపులా?

### జర్నలిస్టులకు అండగా ఉంటా

### ప్రెస్ క్లబ్ లో సంఘీభావం తెలిపిన బిజెపి నేత డాక్టర్ కాళీ ప్రసాదరావు

**పరకాల వుదయం:**



పరకాల జర్నలిస్ట్ లపై ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరు అప్రజాస్వామికమని బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ కాళీ ప్రసాదరావు అన్నారు. జర్నలిస్ట్ లపై ఎమ్మెల్యే ఇటీవల అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానించిన నేపథ్యంలో బుధవారం పరకాల ప్రెస్ క్లబ్ లో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ లను డాక్టర్ కాళీ ప్రసాదరావు కలిసి తన సంఘీభావం తెలిపారు. ప్రజలకు, ప్రభుత్వాలకు వారధిగా ఉండే జర్నలిస్టులపై నోరు పారేసుకొని ఎమ్మెల్యే తన దిగజారుడు తనాన్ని నిరూపించుకున్నారని అన్నారు. పెద్దరికం అనేది వయసుతో రాదని, చేసే పనులతో వస్తుందన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని ఆయన హితవు పలికారు. బెదిరింపులు, అక్రమ కేసులకు భయపడాల్సిన అవసరం లేదని, జర్నలిస్ట్ లకు అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు వస్తాయని అన్నారు. అదేవిధంగా పరకాల జర్నలిస్టుల కోసం పుష్ప భవన నిర్మాణానికి తన వంతు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బిజెపి పట్టణ అధ్యక్షుడు గాజులు నిరంజన్, పార్టీ నాయకులు ఎర్రం రామన్న, ఆర్ పి జయంత్ లాల్,పూర్ణ చారి, నిరంజన్, పాలకుర్తి తిరుపతి తదితరులు ఉన్నారు.

## పరకాల పట్టణ సమస్యల పై బీజేపీ నిరసన..

**పరకాల, వుదయం:**



పరకాల పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో పాత మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. పరకాల పట్టణ బీజేపీ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్, కాచం గురు ప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ పరకాల అభివృద్ధిని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కమిషన్ల కోసమే పనులు ప్రారంభించారని, ప్రస్తుతం కాంగ్రెస్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి కమిషన్ రాకపోవడంతో అభివృద్ధి పనులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు.పరకాల పట్టణంలో టూ లెట్ బోర్డుల పరిస్థితి దయనీయంగా మారిందని, వ్యాపారాలు లేక వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటుకు ఉద్యమం జరిగిన సమయంలో అప్పటి ఎమ్మెల్యే విదేశీ పర్యటనల్లో మునిగిపోయారనిఎద్దేవాచేశారు. ప్రస్తుతం జిల్లాల పునరుద్ధరణపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపడుతున్నా పరకాలకు అమరవీర జిల్లా, మెడికల్ కాలేజీ తీసుకురావడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశాలపై స్పందించక పోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ పరకాల అమరవీరుల జిల్లా కోసం రాజీనామా చేస్తే మము మేకు మద్దతు తెలిపి గెలిపిస్తామని పేర్కొన్నారు. పరకాలలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఇప్పటికీ కాగితాలకే పరిమితమయ్యాయని అన్నారు.రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని 22 వార్డుల్లో గెలిపిస్తే పరకాల అభివృద్ధిని చేసి చూపెడతామని హామీ ఇచ్చారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందని, రాష్ట్రం నుంచి ఎనిమిది మంది ఎంపీలు ఉన్నారని, ఢిల్లీ స్థాయిలో పోరాడి అయినా పరకాల అభివృద్ధిని సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కమిషన్లకు అతీతంగా పనిచేసే పార్టీ బీజేపీ మాత్రమేనని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చందుపట్ల రాజేందర్ రెడ్డి, ఆర్పి జయంత్ లాల్, దేవునూరిమేఘనాథ్, కొలనుపాక భద్రయ్య, బెజ్జంకి పూర్ణచారి, ఎర్ర రామన్న ,సంఘ పురుషోత్తం, దగ్గు విజేందర్ రావు ,కుక్కల విజయ్, బాసాని సోమరాజు, ఎరుకల దివాకర్, నాగెల్లి రంజిత్, రూరల్ అధ్యక్షులు కాసగాని రాజ్ కుమార్, పాలకుర్తి తిరుపతి, సల్పల సురేష్, పైండ్ల రంజిత్, వెలిశెట్టి శారద, వేముల సదారాణి ,దంచనాదులు సత్యనారాయణ, పావుశెట్టి శ్రీనివాస్, దుబాసి కృష్ణ ప్రసాద్, కక్కు రాజు, బూత్ అధ్యక్షులు ఆకుల శ్రీధర్, సాదా మధుకర్, కృపేందర్ రెడ్డి, మరాఠి నర్సింగ్, ముత్యాల దేవేందర్, దామ సతీష్, సంగా నరేష్, తడక విక్రం, బీరం రాజిరెడ్డి, దాసరి వెంకటేశ్వర్లు, చంద్రమోహన్, పల్లె బోయిన భద్రయ్య, గునిగంటి రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో డిసిఎం, గడ్డి దగ్ధం

**ఖానాపురం, వుదయం:**



మండలంలోని భద్రుతండ గ్రామపంచాయతీ పరిధిలోని గడ్డి లోడుతో వెళ్తున్న డీసీఎంకు విద్యుత్ వైర్లు తాకి షార్ట్ సర్క్యూట్ కావడంతో గడ్డిలోడు తోపాటు డీసీఎం దద్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు. భువనగిరికి చెందిన రవి అనే వ్యక్తి ఇదే గ్రామానికి చెందిన తేజావత్ రంగా అనే వ్యక్తి వద్ద మూడు ఎకరాల గడ్డి సుమారుగా ఎకరానికి 6 నుంచి 7 వేల రూపాయల చొప్పున ఖరీదు చేసి డీసీఎంలో గడ్డి మేలుకొని వెళ్తున్న క్రమంలో ఈ సంఘటన జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. గడ్డి పూర్తి స్థాయిలో దగ్ధం కగా డీసీఎం పాక్షంగా దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలుపుతూ ఇది డ్రైవర్ నిర్లక్ష్యమా విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమా అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

# మటన్‌లోని ఈ పార్ట్ తింటే ఇక తిరుగుండదంతే..



మేక మెదడు (మటన్ బ్రెయిన్) కూర బలహీనంగా ఉన్న పిల్లలకు, ఆపరేషన్ల నుండి కోలుకుంటున్న వారికి, కండరాల నిర్మాణానికి అద్భుతమైన పోషకాహారం. ఇందులో తక్కువ కార్బోహైడ్రేట్లు, ఎక్కువ ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, ఐరన్, ప్రొటీన్ ఉంటాయి. రక్తం గడ్డకట్టకుండా చేసి, జ్ఞాపకశక్తిని పెంచుతుంది. నాన్ వెజ్ ప్రియులు మటన్ (మేక మాంసం) ను ఎంతో ఇష్టంగా తింటారు.. అయితే.. మేకలోని పలు భాగాలు.. ఎన్నో ప్రత్యేకతలను కలిగి ఉంటాయి.. ఒక్కో పార్ట్.. ఒక్కో ప్రయోజనాన్ని కలిగి ఉంటుంది.. మటన్ తిల్లి, తలకాయ, లివర్, పాయా అన్ని స్పెషలే.. అయితే.. మేక మెదడు కూడా ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలను చేకూరుస్తుంది.. మేక మెదడులో ప్రోటీన్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ ః12, ఐరన్, భాస్వరం వంటి పోషకాలు అధికంగా ఉంటాయి.. ఇవి మెదడు ఆరోగ్యం, జ్ఞాపకశక్తి, రక్త ఉత్పత్తి, కండరాల బలానికి మేలు చేస్తాయి. కణాల మరమ్మత్తుకు సహాయపడటమే కాకుండా.. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. నాన్-వెజ్ ఆహారాన్ని ఇష్టపడేవారికి, ప్రత్యేకించి ఆరోగ్య ప్రయోజనాలను కోరుకునేవారికి మేక మెదడు కూర ఒక అద్భుతమైన ఎంపిక అని డైటీషియన్లు చెబుతున్నారు. ఈ వంటకం కేవలం రుచిని మాత్రమే కాకుండా, అనేక పోషక విలువలను కూడా అందిస్తుంది. ముఖ్యంగా, ఎదుగుతున్న పిల్లలకు, శారీరకంగా బలహీనంగా ఉన్నవారికి, ఇటీవల ఆపరేషన్ల నుండి లేదా గాయాల నుండి కోలుకుంటున్న వారికి, అలాగే కండరాల నిర్మాణాన్ని లక్ష్యంగా చేసుకుని వ్యాయామం చేసేవారికి ఈ కూర చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. మేక మెదడులో కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉంటాయి. అయితే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, ఐరన్, ప్రోటీన్ వంటి ముఖ్యమైన పోషకాలు అధికంగా ఉంటాయి. ఈ పదార్థాలు శరీరానికి శక్తిని అందించి, రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ మెదడు ఆరోగ్యానికి, హృదయ ఆరోగ్యానికి ఎంతో అవసరం. ఐరన్ శరీరంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి తోడ్పడుతుంది. తద్వారా రక్తహీనతను నివారిస్తుంది. ప్రోటీన్ కండరాల మరమ్మత్తుకు, పెరుగుదలకు కీలకం. అంతేకాకుండా, మేక మెదడు రక్తం గడ్డకట్టకుండా చేసి, శరీరంలో రక్త ప్రవాహాన్ని సక్రమంగా నిర్వహించడానికి సహాయపడుతుంది. ఇది ఎర్ర రక్త కణాల ఉత్పత్తిని కూడా పెంచుతుంది. తద్వారా ఆక్సిజన్ రవాణాను మెరుగుపరుస్తుంది. జ్ఞాపకశక్తిని పెంచే గుణాలు కూడా దీనిలో ఉన్నాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే కొలెస్ట్రాల్, కొవ్వు ఎక్కువగా ఉండటం వల్ల గుండె జబ్బులు ఉన్నవారు మితంగా తీసుకోవాలి. ఈ రుచికరమైన కూరను తయారుచేయడానికి, ముందుగా తాజా మేక మెదళ్లను పసుపు, ఉప్పు వేసిన నీటిలో 2-3 నిమిషాలు ఉడికించి, శుభ్రం చేసుకోవాలి. ఆ తర్వాత, నూనెలో ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, కరివేపాకు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి వేయించాలి. శుభ్రం చేసిన మెదళ్లను వేసి, పసుపు, ఉప్పు, కారం కలిపి నిదానంగా వేయించుకోవాలి. లవంగాలు, దాల్చినచెక్క, యాలకులు, మరాఠీ మొగ్గ, అనాస పువ్వు, జీలకర్ర, ధనియాలు, గసగసాలతో తయారుచేసిన మసాలా పేస్ట్‌ను వేసి, తగినంత నీళ్లు పోసి ఉడికించాలి. మెదళ్లు మెత్తబడిన తర్వాత ముక్కలుగా కట్ చేసి, మూతపెట్టి పది నిమిషాలు ఉడికించి, చివరగా కొత్తిరతో గార్నిష్ చేస్తే సరిపోతుంది..

# పడకపోతే.. కలపకూడదట!



మన నిత్య జీవితంలో పెరుగును చాలా వంటకాల్లో భాగం చేస్తుంటాం. అయితే కొన్ని పదార్థాలతో పెరుగును కలిపి తీసుకోవడం వల్ల కొంతమందికి పడకపోవచ్చని, అలాంటి సందర్భాలలో అలాంటి వాటికి దూరంగా ఉండడమే మంచిదంటున్నారు నిపుణులు. చేపలు, పెరుగు.. ఈ రెండూ కలిపి తీసుకోకూడదన్న విషయం చాలామందికి తెలిసిందే! ఎందుకంటే ఈ రెండింటిలోనూ ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి. తద్వారా అజీర్తి సమస్య తలెత్తుతుంది. అంతే కాదు.. ప్రొటీన్లు ఎక్కువగా ఉండే ఇతర మాంసాహారంతోనూ దీన్ని కలపకపోవడమే మంచిదంటున్నారు నిపుణులు. మినపప్పుతో చేసిన పదార్థాలను పెరుగుతో కలిపి తీసుకుంటే కొంతమందిలో విరేచనాలు, కడుపుబ్బరం.. వంటి సమస్యలొస్తాయట! నూనె పదార్థాలు, పెరుగు కలిపి తీసుకోవడం వల్ల కొంతమందిలో జీర్ణ ప్రక్రియ నెమ్మదిస్తుందని చెబుతున్నారు నిపుణులు. అలాగే ఈ కాంబినేషన్ కొందరిలో బద్ధకం, మగత వంటి వాటికి కారణమవుతుందట. పెరుగుతో తయారుచేసే రైతాలో ఉల్లిపాయలు వేయడం చాలామందికి అలవాటే! అయితే ఈ కాంబినేషన్ కూడా కొందరికి పడకపోవచ్చంటున్నారు నిపుణులు. ఈ రెండూ కలవడం వల్ల కొంతమందిలో జీర్ణ సమస్యలు, చర్మ అలర్జీలు వంటివి వచ్చే అవకాశాలున్నాయట!

# ఈ ఆహారాలు తింటే రోగనిరోధక శక్తి డబుల్

అది మన పొట్ట. పొట్ట ఆరోగ్యంగా ఉంటేనే మన మూడ్ బాగుంటుంది. అన్ని పనులు సజావుగా చేయడానికి శరీరం కూడా సహకరిస్తుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. చివరికి చర్మం కూడా కాంతివంతంగా మెరుస్తుంది. కానీ ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలు ప్రతి ఒక్కరినీ వేధిస్తున్నాయి. వీటన్నింటికీ ప్రధాన కారణం మనం తీసుకునే ఆహారంలో ఒక ముఖ్యమైన అంశం తగ్గిపోవడమే. అదే 'ఫైబర్' (పీచు పదార్థం). ప్రముఖ గ్యాస్ట్రో స్పెషలిస్ట్ డాక్టర్ పాల్, మన వంటింట్లో దొరికే సాధారణ పదార్థాలతోనే పొట్టను ఎలా క్లీన్ చేసుకోవచ్చో వివరించారు.



ఆయన సూచించిన ఆ ఐదు సూపర్ ఫుడ్స్ ఏంటి? ఫైబర్ అనేది జీర్ణవ్యవస్థకు ఒక క్లీనర్ లాగా పనిచేస్తుంది. ఇది మనం తిన్న ఆహారం సాఫీగా కదలడానికి సహాయపడటమే కాకుండా, మన పొట్టలో ఉండే మంచి బ్యాక్టీరియాకు ఆహారాన్ని అందిస్తుంది. ఫైబర్ అందించడంలో వేయించిన శనగలు అగ్రస్థానంలో నిలుస్తాయి. ప్రతి 100 గ్రాముల శనగలలో సుమారు 17 గ్రాముల ఫైబర్ ఉంటుంది. ఇందులో ఉండే ఇన్‌సోల్యూబుల్ ఫైబర్, ప్రోటీన్ మిమ్మల్ని ఎక్కువ సేపు ఆకలి వేయకుండా ఉంచుతాయి. వీటిని చిరుతిండిగా నేరుగా తీసుకోవచ్చు లేదా సలాడ్లలో కలుపుకోవచ్చు. మన ఇళ్లలో సాధారణంగా వాడే నల్ల మినుములలో ఒక కప్పుకు 16 గ్రాముల ఫైబర్ లభిస్తుంది. ఇందులో కరిగే, కరగని ఫైబర్స్ రెండూ ఉంటాయి. ఇవి జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా, మన పొట్టలోని మంచి బ్యాక్టీరియాను పోషిస్తాయి. పప్పు మఖానీ లేదా అన్నంలో కలిపి తీసుకోవడం వల్ల గుండెకు కూడా మేలు జరుగుతుంది. చియా విత్తనాలు ఇప్పుడు సూపర్ ఫుడ్‌గా ప్రాచుర్యం పొందాయి. కేవలం రెండు టేబుల్ స్పూన్ల చియా విత్తనాల్లో 10 గ్రాముల ఫైబర్ ఉంటుంది. ఇవి పొట్టలోకి వెళ్ళగానే జెల్ లాగా మారి జీర్ణక్రియను సులభతరం చేస్తాయి. బ్లడ్ షుగర్ లెవల్స్ స్థిరంగా ఉండటానికి కూడా ఇవి తోడ్పడతాయి. డాక్టర్ పాల్ వీటిని పెరుగుతో కలిపి తీసుకోవాలని సూచిస్తున్నారు. చూడటానికి చాలా చిన్నవిగా ఉన్నా, రాస్ప్‌బెర్రీస్ ఫైబర్ పవర్‌హౌస్‌లు. ఒక కప్పు రాస్ప్‌బెర్రీస్‌లో 8 గ్రాముల ఫైబర్ లభిస్తుంది. ఇవి మంచి బ్యాక్టీరియాకు మద్దతు ఇవ్వడమే కాకుండా, శరీరానికి కావాల్సిన యాంటీ ఆక్సిడెంట్లను అందిస్తాయి. వీటిని స్మూతీలలో లేదా ఓట్స్‌లో కలిపి తీసుకోవచ్చు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆరోగ్యాన్ని ఇచ్చే పండు జామ. ఇందులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. మలబద్ధకంతో బాధపడేవారికి ఇది ఒక దివ్యౌషధంలా పనిచేస్తుంది. రోజూ ఒక జామ పండు తినడం వల్ల జీర్ణవ్యవస్థ మొత్తం శుభ్రపడుతుంది. ఆరోగ్యకరమైన పొట్టే సంతోషకరమైన జీవితానికి ఆధారం. డాక్టర్ పాల్ సూచించిన ఈ ఐదు పదార్థాలను రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల జీర్ణ సమస్యల నుండి శాశ్వత ఉపశమనం పొందవచ్చు. ఇవి కేవలం పొట్టనే కాకుండా, పూర్తి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.



# చక్కని ఆరోగ్యం

## ప్యాకేజీ ఫుడ్‌తో క్యాన్సర్ ముప్పు!

ఆధునిక జీవనశైలిలో మనకు సమయం దొరకడమే కష్టమవుతోంది. అందుకే త్వరగా తయారయ్యే ఇన్స్టంట్ ఫుడ్స్, ప్యాక్ చేసిన పానీయాలు, ఎక్కువ కాలం నిల్వ ఉండే ఆహార పదార్థాల వైపు అందరం మొగ్గు చూపుతున్నాం. కానీ మనం సౌకర్యవంతంగా భావిస్తున్న ఈ ఆహారమే మన ప్రాణాల దకు తెచ్చే ప్రమాదం ఉందని కు తెలుసా?ఆహారం పాడవకుండా, ఎక్కువ కాలం తాజాగా ఉంచేందుకు కంపెనీలు వాడే కొన్ని కెమికల్స్.. నిశ్శబ్దంగా మన శరీరంలో క్యాన్సర్ కణాలను పెంచుతున్నాయని తాజా అంతర్జాతీయ పరిశోధనలో తేలింది. ముఖ్యంగా మహిళల్లో వచ్చే రొమ్ము క్యాన్సర్, పురుషుల్లో వచ్చే ప్రోస్టేట్ క్యాన్సర్‌లకు ఈ నిల్వ కారకాలే ప్రధాన శత్రువులని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అసలు ఆ ప్రమాదకరమైన ప్రిజర్వేటివ్స్ ఏంటి? ఫ్రాన్స్‌లోని 'యూనివర్సిటీ పారిస్ సిటీ' పరిశోధకులు సుమారు 1,05,260 మందిపై సుదీర్ఘ కాలం పాటు జరిపిన అధ్యయన ఫలితాలను 'ది బిఎమ్?జె (ఃఓఎ)' జర్నల్‌లో ప్రచురించారు.



ప్యాక్ చేసిన ఆహారాల్లో వాడే 17 రకాల ప్రిజర్వేటివ్స్ గురించి వారు పరిశీలించగా, అందులో కొన్ని సాధారణ కెమికల్స్ క్యాన్సర్ రిస్క్‌ను విపరీతంగా పెంచుతున్నట్లు గుర్తించారు. పొటాషియం సోర్బేట్: ఇది మొత్తం క్యాన్సర్ ముప్పును 14 శాతం, రొమ్ము క్యాన్సర్ ముప్పును 26 శాతం పెంచుతున్నట్లు తేలింది.సోడియం నైట్: మాంసం నిల్వ ఉంచేందుకు వాడే ఈ కెమికల్ వల్ల ప్రోస్టేట్ క్యాన్సర్ వచ్చే అవకాశం 32 శాతం ఎక్కువగా ఉంది.పొటాషియం నైట్రేట్: దీని వల్ల రొమ్ము క్యాన్సర్ ముప్పు 22 శాతం పెరుగుతోంది.సల్ఫేట్లు: ఆహారంలో వీటి పరిమాణం ఎక్కువైతే సాధారణ క్యాన్సర్ రిస్క్ 12 శాతం పెరుగుతుంది.అసిటేట్లు: ఇవి రొమ్ము క్యాన్సర్ ముప్పును 25 శాతం పెంచుతాయని పరిశోధనలో వెల్లడైంది. ఆహారం నిల్వ ఉండటానికి వాడే ఈ రసాయనాలు మన శరీరంలోని రోగనిరోధక శక్తిని దెబ్బతీస్తాయి. ఇవి శరీరంలో ఇన్ఫ్లమేషన్ (వాపు)ను పెంచి, క్యాన్సర్ కణాలు వృద్ధి చెందడానికి అనువైన వాతావరణాన్ని కల్పిస్తాయి. సహజమైన యాంటీ ఆక్సిడెంట్ ప్రిజర్వేటివ్స్ పెద్దగా నష్టం చేయకపోయినా.. సోడియం ఎరిథోర్బేట్ వంటి కొన్ని రసాయనాలు మాత్రం అనారోగ్యానికి కారణమవుతున్నాయి.

## రాత్రి భోజనానికి ఏది ప్రయోజనకరం

రాత్రి పూట అన్నం తింటే బాగుంటుందా? లేదా రోటీ తింటే బాగుంటుందా? అనే ప్రశ్న తలెత్తుతుంటుంది. రాత్రి పూట ఈ రెండింటిలో ఏదీ తీసుకుంటే మంచిది? వీటి శరీరానికి ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయి? దీనిపై నిపుణులు కీలక విషయాలు వెల్లడించారు. రాత్రి భోజనంలో అన్నం తినాలా లేక రోటీ తినాలా అనేది తరచుగా ప్రజలను కలవరపెట్టే ప్రశ్న. నిపుణులు సమాధానం జీవనశైలి, జీర్ణ సామర్థ్యం, ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుందని అంటున్నారు. రెండూ పోషకమైనవి. కానీ కొన్ని తేడాలు ఏ విందు ఎంపిక ఉత్తమమో నిర్ణయిస్తాయి. పోషకాహార నిపుణుల అభిప్రాయం ప్రకారం.. రోటీ కంటే బియ్యం వేగంగా జీర్ణమవుతాయి. రాత్రిపూట జీర్ణశక్తి బలహీనంగా ఉంటుంది. అందుకే బియ్యం శరీరంపై ఎక్కువ ఒత్తిడిని కలిగించదు. తెల్ల బియ్యం తేలికగా ఉంటుంది. అలాగే కడుపు, ప్రేగులపై ఒత్తిడిని కలిగించదు. ఇది నిద్రకు కూడా సహాయపడుతుంది. కానీ జాగ్రత్తగా ఉండండి. వడ్డించే పరిమాణాలను అదుపులో ఉంచండి. ఎల్లప్పుడూ పప్పుధాన్యాలు, కూరగాయలను పక్కన పెట్టుకోండి. బ్రెడ్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ముఖ్యంగా గోధుమ, జొన్న లేదా మల్టీగ్రెయిన్ పిండి అయితే. రాత్రిపూట రోటీ తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులకు, బరువును నియంత్రించుకోవాలనుకునే వారికి రోటీ మంచిదని నిపుణులు భావిస్తున్నారు. ఇక రోటీలో ఫైబర్ పుష్కలంగా ఉండటం వల్ల మిమ్మల్ని ఎక్కువసేపు కడుపు నిండి ఉండేలా చేస్తుంది. అన్నం త్వరగా జీర్ణమవుతుంది. అందుకే రాత్రిపూట ఆకలిగా ఉన్నవారికి 1-2 రోటీలు మంచి ఎంపిక. బియ్యంలో ఉండే ట్రిప్టోఫాన్ తేలికపాటి విశ్రాంతినిస్తుంది. అందువల్ల రాత్రిపూట తేలికపాటి భోజనాన్ని ఇష్టపడేవారు కొంచెం అన్నం తినవచ్చు. బరువు తగ్గాలనుకుంటున్నారా ? అయితే రాత్రిపూట రోటీ మంచిది. జీర్ణశక్తి బలహీనంగా ఉందా లేదా తేలికైన భోజనం కావాలనుకునేవారికి అన్నంమంచి ఎంపిక.నిపుణుల అభిప్రాయం ప్రకారం.. రోటీ- అన్నం రెండూ రాత్రిపూట మంచివి. అది ఆరోగ్యం, అవసరాన్ని బట్టి ఉంటుంది.



## కురులకేం కావాలి?

జుట్టు గడ్డిలా మారినా, ఊడుతోందన్నా... బోలెడు సలహాలు వచ్చేస్తాయి కదూ! ఒకరు ప్రొటీన్ అందట్లేదు అంటారు. మరొకరు లేదు లేదు తేమ సరిపోవట్లేదు అందుకే ఇలా అని చెబుతారు. మన వెంట్రుకలు కెరటిన్ అనే ప్రొటీన్‌తోనే తయారవుతాయి. కాలుష్యం, వేసే రంగులు, స్టైలింగ్ అంతెందుకు, మనం దాన్ని గట్టిగా లాగడం వంటివి ఏం చేసినా ప్రభావం పడేది ఆ ప్రొటీన్ మీదే! కురులు ఊరికే తెగిపో



తున్నా, మందం తగ్గినా ప్రొటీన్ తగ్గిందనే అర్థం. కురులు మృదువుగా, మెత్తగా ఆరోగ్యంగా కనిపించాలంటే వాటికి తేమ తప్పనిసరి. పొడి వాతావరణం, తరచూ తలంటడం, రసాయనాలున్న షాంపూలు వాడటం... వంటివి సహజ నూనెల్ని తొలగించి జుట్టుని గడ్డిలా బరకగా మారుస్తాయి. అప్పుడు వాటి నిర్వహణా కష్టమే. మృదువుగా ఉంటే చిక్కులుండవు. దాంతో కుదుళ్లపై దుష్ప్రభావాలు ఉండవు. కొద్దిగా లాగినా ఊడి వస్తోంటే తేమ తగ్గిందనే! ఆరోగ్యకరమైన జుట్టుకు ప్రొటీన్, తేమ రెండూ కావాలి. కాబట్టి, రెండూ దొరికేలా చూసుకోవాలి. అలాగే, పై పూతలకే పరిమితం కావొద్దు. కురుల నిర్వహణ దీర్ఘకాలం సాగే ప్రక్రియ. కాబట్టి, జాగ్రత్తగా కొనసాగించాలి. ఆహారం ద్వారానూ తగినంత ప్రొటీన్ అందేలా చూసుకోండి. మీ కురుల తీరుకు తగ్గ షాంపూ, కండిషనర్లు వాడండి.

## అందంగా ఉండాలంటే.. ఒత్తిడి వద్దు!



దీర్ఘకాలిక ఒత్తిడి, ఆందోళనలు మన అందంపై ప్రతికూల ప్రభావం చూపుతాయంటున్నారు సౌందర్య నిపుణులు. టెన్షన్ పడినప్పుడు మన శరీరంలో హార్మోన్ల అసమతుల్యత ఏర్పడుతుంది. తద్వారా జరిగే శారీరక మార్పుల వల్ల చర్మంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. అలాగే ఒత్తిడికి గురైనప్పుడు ఏది పడితే అది తినడం వల్ల జీవనశైలిలో సైతం మార్పులొస్తాయి. ఇదీ ఒక రకంగా సౌందర్యంపై ప్రభావం చూపుతుంది. ఈ క్రమంలో ఒత్తిడి, ఆందోళనలకు గురైనప్పుడు ముఖ సౌందర్యం విషయంలో కొన్ని మార్పులు గమనించచ్చంటున్నారు నిపుణులు. ఒత్తిడి, ఆందోళనలకు గురైనప్పుడు శరీరంలో ఎక్కువ మొత్తంలో కార్టిసాల్ (ఒత్తిడి హార్మోన్) విడుదలవుతుంది. ఇది చర్మంపై ఉండే నూనె గ్రంథుల్ని (సెబేషియస్ గ్రంథులు) ప్రేరేపించి ఎక్కువ మొత్తంలో నూనెలు విడుదలయ్యేలా చేస్తుంది. తద్వారా చర్మ గ్రంథులు మూసుకుపోయి మొటిమలొస్తాయంటున్నారు నిపుణులు. సాధారణంగా వయసు పైబడే కొద్దీ కళ్ల కింద వాపు (ఐ బ్యాగ్స్), కనురెప్పలు ఉబ్బడం.. వంటి సమస్యలొస్తాయి. అయితే ఒత్తిడి వల్ల నిద్ర లేకపోవడం కూడా ఈ సమస్యను తెచ్చిపెడుతుందని ఓ అధ్యయనంలో తేలింది. అంతేకాదు.. చర్మం స్థితిస్థాపకతను కోల్పోవడం, పిగ్మెంటేషన్, చిన్న వయసులోనే వృద్ధాప్య ఛాయలు దరిచేరడం.. ఇలా ఒత్తిడి అందంపై పలు రకాలుగా ప్రతికూల ప్రభావం చూపుతుందట! చర్మం కింద ఉండే ప్రొటీన్, లిపిడ్స్ చర్మ కణాలు తేమగా ఉండడంలో సహకరిస్తాయి. అయితే ఒత్తిడి కారణంగా వాటి పనితీరు దెబ్బ తింటుంది. ఫలితంగా చర్మం పొడిబారిపోవడం, దురద రావడం.. వంటి సమస్యలొస్తాయంటున్నారు నిపుణులు. మానసిక సమస్యలు ఎంత ఎక్కువైతే జుట్టు అంతగా నెరిసిపోయే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. జుట్టుకు సహజసిద్ధమైన నలుపు రంగును అందించే మెలనోసైట్స్ ఒత్తిడి కారణంగా క్రమంగా కనుమరుగవుతాయట! తద్వారా కొత్తగా పుట్టుకొచ్చే కణాలకు మెలనిన్ అందక జుట్టు నెరిసిపోవడం ప్రారంభమవుతుంది. దీర్ఘకాలిక మానసిక సమస్యలు జుట్టు పెరుగుదల ఆగిపోయేలా చేసి.. అది పూర్తిగా నిర్జీవమైపోయేలా చేస్తాయట! ఒత్తిడి కారణంగా సౌందర్యంపై ఇంతలా ప్రభా వం పడుతుంది కాబట్టే ఇలాంటి మానసిక సమస్యలకు సాధ్యమైనంత దూరంగా ఉండాలంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో కొన్ని చిన్న చిన్న చిట్కాల్ని పాటించాల్సి ఉంటుంది.

వంట ప్రక్రియ త్వరగా పూర్తవుతుందని కుక్కర్‌లో అన్ని రకాల ఆహారాలను వండటం సరైనది కాదు. అవును.. కుక్కర్‌లో కొన్ని ఆహార పదార్థాలను వండటం వల్ల వాటి పోషకాలు నాశనమవుతాయి. అలాంటి ఆహారాలు

## ఆహారాలు కుక్కర్‌లో ఉడికించి తింటే.. కిడ్నీలు మటాష్! జాగ్రత్త మరీ..

తీసుకోవడం వల్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఉంటాయి. దాదాపు ప్రతి ఇంట్లోనూ ప్రెషర్ కుక్కర్లు వాడుతారు. అన్నం వండటం నుంచి సాంబారు తయారీ వరకు త్వరగా వంట పూర్తి చేయడానికి, సమయం, గ్యాస్ ఆదా చేయడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. కానీ వంట ప్రక్రియ త్వరగా పూర్తవుతుందని కుక్కర్‌లో అన్ని రకాల ఆహారాలను వండటం సరైనది కాదు. అవును.. కుక్కర్‌లో కొన్ని ఆహార పదార్థాలను వండటం వల్ల వాటి పోషకాలు నాశనమవుతాయి. అలాంటి ఆహారాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఉంటాయి. అందువల్ల ఈ రకమైన ఆహారాలను ప్రెషర్ కుక్కర్‌లో వండకూడదు.సాధారణంగా చాలా మంది కుక్కర్‌లో బియ్యం వండుతారు. కానీ బియ్యాన్ని ఎప్పుడూ కుక్కర్‌లో వండకూడదు. ఎందుకంటే ఇలా కుక్కర్‌లో బియ్యం వండడం వల్ల ఆర్సెనిక్ అనే విష పదార్థం విడుదల అవుతుంది. ఇది మన ఆరోగ్యానికి హానికరం. కాబట్టి ఓపెన్ పాత్రలో మాత్రమే బియ్యం వండటం మంచిది. పాలకూర, మెంతులు, కొల్లార్డ్ ఆకుకూరలు వంటి ఆకుకూరలను ప్రెజర్ కుక్కర్‌లో ఉడికించడం వల్ల వాటి పోషకాలు నశించి, మూత్రపిండాల్లో రాళ్లు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. కాబట్టి వాటిని సాధారణ పాన్‌లో తక్కువ వేడి ద ఉడికించడం మంచిది. బీన్స్‌లో లెక్టిన్ అనే సహజంగా లభించే టాక్సిన్ ఉంటుంది. ఇది సరిగ్గా ఉడికించకపోతే జీర్ణ సమస్యలను కలిగిస్తుంది. ఫుడ్ పాయిజనింగ్‌కు కూడా కారణమవుతుంది. అలాగే, ప్రెషర్ కుకింగ్ బీన్స్‌లోని లెక్టిన్‌ను వేగంగా విచ్ఛిన్నం చేస్తుంది. ఇది జీర్ణ సమస్యలకు దారితీస్తుంది. కాబట్టి ఈ కూరగాయలను ప్రెజర్ కుక్కర్‌లో ఉడికించడం మంచిది కాదు. ప్రెషర్ కుక్కర్‌లో పాలు మరిగించడం వల్ల దాని సహజ నిర్మాణం మారి అది పెరుగులా మారుతుంది. తద్వారా దాని పోషక విలువలు తగ్గుతాయి. పాలు మరిగించడానికి స్టీల్ లేదా నాన్-స్టిక్ పాన్ ఉత్తమం. టమోటాలు, చింతపండు లేదా పుల్లని పదార్థాలను ప్రెషర్ కుక్కర్‌లో ఉడికించడం వల్ల అవి ఆమ్లంగా మారతాయి. ఇది శరీరానికి హానికరం. కాబట్టి వాటిని స్టీల్ లేదా మట్టి పాత్రలో ఉడికించడం మంచిది. బీన్స్, కొన్ని ధాన్యాలు సహజ విష పదార్థాలను కలిగి ఉంటాయి. వీటిని ప్రెజర్ కుక్కర్‌లో పూర్తిగా తొలగించలేం. కాబట్టి, వాటిని రాత్రంతా నానబెట్టి ఆపై తక్కువ వేడి ద ఓపెన్ పాత్రలో ఉడికించడం ఆరోగ్యకరమైనది.




## ఈ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం వద్దు!

ఒక్కోసారి ఉన్నట్లుండి మాట తడబడుతుంటుంది.. ఆ వెంటనే తిరిగి మామూలుగా అవడంతో పెద్దగా పట్టించుకోం.. అప్పుడప్పుడూ ఛాతీలో నొప్పి వస్తుంటుంది.. గ్యాస్ట్రిక్ సమస్యేమోనని నిర్లక్ష్యం చేస్తుంటాం.. సడన్‌గా బరువు తగ్గడం, జుట్టు ఎక్కువగా రాలడాన్ని అంత సీరియస్‌గా తీసుకోరు కొంతమంది.. అయితే ఇలాంటి లక్షణాలను ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకూడదంటున్నారు నిపుణులు. కొంతమంది జ్వరాన్ని తేలిగ్గా తీసుకుంటారు. ట్యాబ్లెట్స్, యాంటీ బయాటిక్స్‌తో ఈ సమస్య నుంచి బయటపడచ్చనుకుంటారు. కానీ జ్వరం ఎక్కువ రోజుల పాటు కొనసాగినా, 103 డిగ్రీల ఫారన్‌హీట్‌కు చేరినా.. ఇది ఒక్కోసారి వివిధ రకాల ఆటోఇమ్యూన్ వ్యాధులకు సూచన కావచ్చంటున్నారు నిపుణులు. కాబట్టి ఈ లక్షణాల్ని నిర్లక్ష్యం చేయకపోవడం మంచిదని చెబుతున్నారు. కొంతమందికి ఉన్నట్లుండి మాట తడబడుతుంటుంది.. ముద్దగా వస్తుంది. కాసేపటికి అదే సెట్ అవుతుందిలే అని దీన్ని నిర్లక్ష్యం చేస్తుంటారు. అయితే ఈ లక్షణం శరీరంలో కొన్ని అనారోగ్యాలకు సంకేతమని చెబుతున్నారు నిపుణులు. రక్తంలో సోడియం-చక్కెర స్థాయిలు పడిపోవడం, అమ్మోనియా స్థాయిలు పెరిగిపోవడం, కాలేయ సంబంధిత సమస్యలు, మెదడు సంబంధిత ఇన్ఫెక్షన్లు.. వంటి సమస్యలున్నప్పుడు ఇలా జరిగే అవకాశాలున్నాయంటున్నారు. కాబట్టి ఇలాంటి లక్షణాలు కనిపించిన వెంటనే ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రదించడం వల్ల అసలు సమస్యను గుర్తించవచ్చంటున్నారు. ఒక్కోసారి ఉన్నట్లుండి తీవ్ర గందరగోళానికి గురవుతుంటాం.. చేసే చేతలకు, మాటలకు పొంతన ఉండదు. ఇలాంటి లక్షణాలు దీర్ఘకాలంలో నాడీ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశాలు ఎక్కువంటున్నారు నిపుణులు. జీవక్రియల పనితీరు అదుపు తప్పడం, మెదడులో ఇన్ఫెక్షన్లు, అరుదుగా బ్రెయిన్ స్ట్రోక్‌కు కూడా ఈ లక్షణాలు కారణం కావచ్చని చెబుతున్నారు. కాబట్టి ఇలాంటి లక్షణాలు కనిపించిన వెంటనే అలర్ట్ అవ్వమని సలహా ఇస్తున్నారు. ఉదర సంబంధిత సమస్యలు, గ్యాస్ట్రిక్ సమస్యలున్న వారిలో ఒక్కోసారి ఛాతీలో నొప్పి వచ్చే అవకాశముంటుంది. అయితే ఈ నొప్పికి ప్రతిసారీ ఇవే సమస్యలు కారణం కాకపోవచ్చంటున్నారు నిపుణులు. నొప్పికి తోడు ఛాతీపై ఎక్కువ బరువు మోపినట్లుగా అనిపించడం, మంట.. అది క్రమంగా చేతుల్లోకి విస్తరించడం.. వంటి లక్షణాలు గమనిస్తే ఆలస్యం చేయకుండా డాక్టర్‌ని సంప్రదించడం మంచిదంటున్నారు. ఎందుకంటే ఈ తరహా లక్షణాలు ఒక్కోసారి గుండె సంబంధిత సమస్యలు, గుండెపోటుకు దారితీసే ప్రమాదం ఉందంటున్నారు.



## ఎలక్ట్రానిక్స్ దిగ్గజం సోనీ సంచలన నిర్ణయం

ప్రముఖ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం సోనీ సంచలన నిర్ణయం తీసుకుంది. తన ప్రఖ్యాత హోమ్ ఎంటర్‌న్‌మెంట్ వ్యాపారాన్ని చైనాకు చెందిన టీసీఎల్ ఎలక్ట్రానిక్స్ హోల్డింగ్స్ లిమిటెడ్‌కు అప్పగించనున్నట్లు మంగళవారం ప్రకటించింది.ఇందులో భాగంగా సోనీ బ్రావియా టీవీ




బ్రాండ్‌తో సహా, తన హోమ్ ఎంటర్‌న్‌మెంట్ విభాగంలో 51 శాతం మెజారిటీ వాటాను టీసీఎల్‌కు విక్రయించనుంది.ఈ ఒప్పందం ప్రకారం, ఇరు కంపెనీలు కలిసి ఒక జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేయనున్నాయి. ఇది 2027 ఏప్రిల్ నుంచి కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉంది. భవిష్యత్తులో టీవీలు సోనీ, బ్రావియా బ్రాండింగ్‌తోనే మార్కెట్లోకి వస్తాయి. అయితే, వాటిలో ఉపయోగించే డిస్‌ప్లే టెక్నాలజీ మాత్రం టీసీఎల్‌కు చెందినదిగా ఉంటుంది. తక్కువ లాభదాయకత ఉన్న టెలివిజన్ తయారీ రంగం నుంచి వైదొలగడంలో భాగంగానే జపాన్ కంపెనీ అయిన సోనీ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ఏర్పాటు ద్వారా తయారీ ఖర్చులు, నష్టాలను తగ్గించుకుంటూనే, ప్రపంచవ్యాప్తంగా తమ బ్రాండ్‌కు ఉన్న గుర్తింపును నిలుపుకోవచ్చని సోనీ భావిస్తోంది. ప్లేస్టేషన్ వ్యాపారంతో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సోనీ, కొంతకాలంగా సంప్రదాయ ఎలక్ట్రానిక్స్ నుంచి అధిక లాభాలు వచ్చే విభాగాలపై దృష్టి సారిస్తోంది.మరోవైపు, చైనాకు చెందిన అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ సంస్థల్లో ఒకన టీసీఎల్, ఇటీవలి కాలంలో ప్రపంచ మార్కెట్లో వేగంగా విస్తరిస్తోంది. ఇప్పటికే అమెరికాలో బడ్జెట్ టీవీ బ్రాండ్‌గా ఎదిగిన ఈ సంస్థ, బ్లాక్‌బెర్రీ, ఆల్కాటెల్ వంటి బ్రాండ్లను కూడా లైసెన్స్ కింద నడుపుతోంది. ఈ ఒప్పందం ద్వారా సోనీ బ్రాండ్ ఇమేజ్‌ను ఉపయోగించుకుని ప్రీమియం టీవీ సెగ్మెంట్‌లో తమ స్థానాన్ని బలోపేతం చేసుకోవాలని టీసీఎల్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా వినియోగదారులకు మరింత మెరుగైన అనుభూతిని అందిస్తామని సోనీ, టీసీఎల్ ప్రతినిధులు తెలిపారు.

## రిపబ్లిక్ డే సేల్‌లో భారీ ఆఫర్లు ప్రకటించిన అమెజాన్



ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ఇటీవల గ్రేట్ రిపబ్లిచ్ డే సేల్‌ను ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సంస్థ అమెజాన్ బజార్ విభాగంలో కస్టమర్ల కోసం పెద్ద ఎత్తున ఫ్యాషన్, ఎలక్ట్రానిక్ యాక్సెసరీలు, ఇంకా అనేక విభాగాల్లో తక్కువ ధరలో ఉత్పత్తులను అందుబాటులో ఉంచింది. అమెజాన్ గ్రేట్ రిపబ్లిక్ డే సేల్ సందర్భంగా కస్టమర్లు డీల్స్, కొన్ని రకాల ప్రీమియం ఉత్పత్తులపై 80 శాతం వరకు ఆఫర్లను, రూ. 500 వరకు క్యాష్బ్యాక్ పొందవచ్చని తెలిపింది. ముఖ్యంగా రూ. 99 ప్రారంభ ధరలో లభించే వస్తువులపై అమెజాన్ బజార్లో మొదటి ఆర్డర్‌పై రూ.50 వరకు క్యాష్‌బ్యాక్ పొందవచ్చు. ఇదే సమయంలో ప్రైమ్ మెంబర్లకు 5 శాతం క్యాష్బ్యాక్, అమెజాన్ పే ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డ్‌పై నాన్-ప్రైమ్ మెంబర్లకు 3 శాతం, రూ. 2,500ల వరకు వెల్ గిఫ్ట్స్ సహా పేమెంట్, రివార్డులతో మరింత ఆదా చేసుకోవచ్చని కంపెనీ వెల్లడించింది. అర్హులైన కస్టమర్లు అమెజాన్ పే లేటర్ ద్వారా రూ. 60,000 వరకు తక్షణ క్రెడిట్ను కూడా యాక్సెస్ చేయవచ్చు. ప్రత్యేకమైన షాపింగ్ రివార్డులను కూడా ఆఫర్ చేస్తున్నట్టు కంపెనీ తెలిపింది. రోజుకు రూ. 99 ఈఎంఐ ద్వారా అమెజాన్ బజార్ నుంచి మొబైళ్లు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, ఇతర పరికరాలను కొనుగోలు చేయవచ్చు. అంతేకాకుండా ఎంపిక చేసిన బ్యాంక్ కార్డులు, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు, ఈఎంఐ లావాదేవీలపై 10 శాతం వరకు తక్షణ డిస్కౌంట్లను కూడా లభిస్తుంది. అదనంగా క్యాష్బ్యాక్, రివార్డ్స్ లభిస్తాయి. వాటిలో రూ. 799ల కన్నా ఎక్కువ ఆర్డర్లపై ప్రైమ్ మెంబర్లకు 5 శాతం తగ్గింపు, రూ. 499 కన్నా ఎక్కువ విలువ గల ఆర్డర్లపై అందరికీ 10 శాతం క్యాష్బ్యాక్ ఉంటుందని అమెజాన్ తెలిపింది. ఇవి మాత్రమే కాకుండా అనేక రకాల ఆఫర్లు, క్యాష్‌బ్యాక్, రివార్డులను అందిస్తున్నట్టు పేర్కొంది.

## భారీగా పతనమైన స్టాక్ మార్కెట్లు

భారతీయ ఈక్విటీ మార్కెట్లు దేశీయ, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో భారీ పతనాన్ని చూశాయి. పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, మార్కెట్‌లో కీలక రిలయన్స్, బజాజ్ ఫైనాన్స్, ఎంఅండ్ఎం లాంటి షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి కారణంగా మంగళవారం స్టాక్ మార్కెట్ బెంచ్‌మార్క్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ 1 శాతానికి పైగా పడిపోయాయి. అంతేకాకుండా, రూపాయి మారకంలో కొనసాగుతున్న బలహీనత, విదేశీ నిధుల ఉపసంహరణ పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ముఖ్యంగా ఐటీ షేర్లలో పెద్ద ఎత్తున అమ్మకాలు జరిగాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 2 శాతానికి పైగా పడిపోయింది. ఇటీవల కేంద్రం తెచ్చిన కొత్త లేబర్ కోడ్స్ వల్ల ఐటీ కంపెనీలు త్రైమాసిక ఫలితాలు తగ్గాయి. అందుకే ఐటీ స్టాక్స్‌పై ఒత్తిడి కనిపించింది. ట్రేడింగ్ సమయంలో కీలక సూచీ సెన్సెక్స్ ఓ దశలో 1,200 పాయింట్ల కంటే ఎక్కువ నష్టపోయినప్పటికీ, ఆ తర్వాత కోలుకున్నాయి. నిఫ్టీ సైతం 25,170 పాయింట్లకు చేరిన అనంతరం రికవరీ అయ్యాయి. ఫలితంగా మదుపర్ల సంపద ఒక్కరోజే రూ. 9.8 లక్షల కోట్లు కోల్పోయారు. బీఎస్ఈ మార్కెట్ క్యాప్ రూ. 455.4 లక్షల కోట్లకు చేరుకుంది. దీంతో మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స్ 1,065.71 పాయింట్లు




కుదేలై 82,180 వద్ద, నిఫ్టీ 353 పాయింట్లు క్షీణించి 25,232 వద్ద ముగిశాయి. సెన్సెక్స్ ఇండెక్స్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్ మాత్రమే లాభాలను దక్కించుకోగా, మిగిలిన అన్ని స్టాక్స్ దెబ్బతిన్నాయి. ఎటర్నల్, బజాజ్ ఫైనాన్స్, సన్‌ఫార్మా, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇండిగో షేర్లు 3 శాతానికి పైగా పడిపోయాయి.



# బిజినెస్



## మాపై పన్నులేయండి: 400 మంది సంపన్నుల డిమాండ్

భవిష్యత్ ప్రణాళికలు వేసుకుంటూ, కొత్త అవకాశాలను వెతుక్కుంటూ ప్రతిఏటా దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సుకు (డబ్ల్యూఈఎఫ్) వ్యాపారవేత్తలు వస్తుంటారు. ఈ నేపథ్యంలో 400 మంది సంపన్నులు వినూత్న డిమాండ్ చేశారు. తమపై



భారీగా పన్నులు విధించాలని ఇచ్చిన పిలుపు ఆశ్చర్యపరుస్తోంది. 24 దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తోన్న ఈ బృందం.. "Time to Win" పేరిట సంతకాలు చేసిన బహిరంగ లేఖను విడుదల చేశారు. సూపర్ రిచ్ వ్యక్తులకు, మిగతా మానవాళికి మధ్య అంతరం నానాటికీ పెరుగుతోందని హెచ్చరించారు. దానిని రూపుమాపాలంటే ధనవంతులపై అత్యధిక పన్నులు విధించాలన్నారు. ప్రజా జీవితం, రాజకీయ వ్యవస్థలను సంపన్నులు ప్రభావితం చేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ భారీ సంపద ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరుస్తోందని, ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తోందన్నారు. "భారీ సంపద కలిగిన కొందరు మన ప్రజాస్వామ్యాలను కొనుగోలు చేశారు. ప్రభుత్వాలను స్వాధీనం చేసుకున్నారు. మీడియా స్వేచ్ఛను హరించారు. ఆవిష్కరణలపై పట్టు బిగించారు" అంటూ ఆవేదన వ్యక్తంచేశారు."అసలుసిసలైన ప్రజాస్వామ్య వ్యవస్థలను తిరిగి కోరుకుంటున్నాం. ఆ దిశగా ప్రగతిశీల సంపద పన్నులు విధించాలి. ఈ పన్నులతో కుబేరుల జీవన ప్రమాణాలు ఏమాత్రం పడిపోవు. పైగా ఆరోగ్యం, విద్య వంటి ప్రజాసేవలకు మరిన్ని నిధులు అందుతాయి" అని ఆ లేఖలో పేర్కొన్నారు.

## ఒక ఛార్జింగ్‌తో 543 కి.. ప్రయాణం

తమ తొలి బ్యాటరీ విద్యుత్ ఎస్‌యూవీ 'అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా'ను టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) మంగళవారం ఆవిష్కరించింది. జపాన్‌కు చెందిన టయోటా




మోటార్ కార్పొరేషన్, కిర్లోస్కర్ గ్రూప్ సంయుక్త సంస్థే టయోటా కిర్లోస్కర్ మోటార్. జపాన్‌కే చెందిన సుజుకీ, టయోటా సంస్థల మధ్య ఉన్న అంతర్జాతీయ భాగస్వామ్యం నేపథ్యంలో, అర్బన్ క్రూయిజర్ ఎబెల్లాను టీకేఎంకు సుజుకీ మోటార్ గుజరాత్ సరఫరా చేస్తుంది.

## హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ఫాలో అప్ సదస్సు



స్విట్జర్లాండ్ లోని దావోస్ వేదికగా జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (చిఇఈ) సదస్సులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక వినూత్న ప్రతిపాదన ఉంచారు. ప్రతి సంవత్సరం జూలై - ఆగస్టు నెలల్లో హైదరాబాద్‌లో 'మినీ దావోస్' తరహాలో ఫోరమ్ ఫాలో-అప్ సదస్సును నిర్వహించాలని ఈ సందర్భంగా సీఎం సూచించారు. పెట్టుబడి ఒప్పందాలు, వాణిజ్య నిర్ణయాలకు ఏడాది కాలం చాలా ఎక్కువని, అందుకే ఆరు నెలలకోసారి సక్షా సమావేశం అవసరమని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ ప్రతిపాదనకు గ్లోబల్ బిజినెస్ లీడర్లు, పాలసీ నిర్ణేతలు ఏకగ్రీవంగా మద్దతు పలికారు. ఇదే వేదికపై సీఎం 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను ప్రదర్శిస్తూ, 30 వేల ఎకరాల్లో నిర్మిస్తున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ' మూసీ పునరుజ్జీవనం ద్వారా హైదరాబాద్‌ను 24 గంటలు పనిచేసే నగరంగా మారుస్తామని సీఎం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం 'తెలంగాణ ◌ంఎ ఇన్నోవేషన్ హబ్' (*◌ంఎఈ), 'నెక్స్ట్-జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-2030'లను అధికారికంగా ఆవిష్కరించింది. 2030 నాటికి లైఫ్ సైన్సెస్ రంగంలో ఏ250 బిలియన్ల ఆర్థిక వ్యవస్థను సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి మెట్రో రైలు విస్తరణ, కొత్త ఆర్థిక వృద్ధి జోన్ల ప్రణాళికలను వివరించగా, ప్రముఖ సినీ నటుడు చిరంజీవి ఈ సమావేశంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ముఖ్యమంత్రితో కలిసి విందులో పాల్గొన్నారు. ఇటీవల నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ద్వారా ఇప్పటికే రూ. 5.75 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని, రానున్న రోజుల్లో తెలంగాణను గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## ఏఐ ప్రయోజనాలు అందరికీ సమానంగా దక్కాలి



కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా కలిగే ప్రయోజనాలు అందరికీ సమానంగా దక్కాలని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల అభిప్రాయపడ్డారు. 'విద్య లేదంటే ప్రభుత్వ విధానాల ద్వారా కావచ్చు.. ప్రతి ఒక్కరి జీవన విధానాన్ని మెరుగుపర్చడమే కృత్రిమ మేధ లక్ష్యంగా ఉండాల'ని ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సదస్సులో నాదెళ్ల పేర్కొన్నారు. ఏఐపై చర్చంతా సాంకేతిక కంపెనీల కేంద్రంగానే జరిగితే.. అది గాలి బుడగ లాగా అవుతుందని అన్నారు. కీలక ఔషధాలను మార్కెట్లోకి తేవడంలో, క్లినికల్ ట్రయల్స్‌ను వేగవంతం చేయడంలో ఫార్మా కంపెనీలకు కృత్రిమ మేధ ఎలా ఉపయోగపడుతుందో చూడాలన్నారు. రోజువారీ జీవితాన్ని ఏఐ ఏ విధంగా మెరుగుపరుస్తుందో పరిశీలించాల్సిన అవసరం ఉందని నాదెళ్ల వివరించారు. కేవలం వినియోగాన్ని పెంచడం పైనే కాకుండా.. ఏఐ ఆధారిత ఆర్థిక వృద్ధిపైనా దృష్టి పెట్టాలని సూచించారు. ఉత్పాదకతను పెంచడంలో, పని విధానాల్లో మార్పులు తేవడంలో ఏఐ, ఇతర అధునాతన సాంకేతికతలు ఎలా ఉపయోగపడుతున్నాయో ఆయన వివరించారు. ప్రజలు, సమాజం, దేశాలు, పరిశ్రమలకు కొంతైనా ప్రయోజనం కలిగేలా మనం ఏఐను వాడుతున్నామా? లేదా? అనే విషయాన్ని గమనిస్తూ ఉండాలని తెలిపారు.

# క్రీడలు





వుతు



## రవీంద్ర జడేజాకి రవిచంద్రన్ అశ్విన్ పలు సూచనలు

టీమిండియా సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా వన్డే ఫార్మాట్‌లో ఆశించిన స్థాయిలో రాణించకపోవడం ఇప్పుడు పెద్ద చర్చగా మారింది. తాజాగా న్యూజిలాండ్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో ఒక్క వికెట్ కూడా తీయలేకపోవడంతో, అతడి వన్డే కెరీర్ ముగింపు దశకు వచ్చిందా? అన్న సందేహాలు వ్యక్తమన్నాయి. ఈ నేపథ్యంలో జడేజాపై అతని మాజీ సహచరుడు రవిచంద్రన్ అశ్విన్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. జడేజాకు తనదైన బలాలు ఉన్నాయని అశ్విన్ చెప్పాడు. కానీ అదే పాత పంథాలో కొనసాగడం వల్లే ఇబ్బందులు ఎదురవుతున్నాయని అభిప్రాయపడ్డాడు. కొత్తగా బౌలింగ్‌లో ప్రయోగాలు చేయాలని తాను ఎన్నిసార్లు సూచించినా జడేజా వినడంలేదని తెలిపాడు. బిషన్ సింగ్ బేడీ, మణీందర్ సింగ్, మిచెల్ శాంట్నర్ తరహాలో కొత్తగా ప్రయత్నించాలని చెప్పినప్పటికీ వినలేదని... అతడు తన సేఫ్ జోన్ నుంచి బయటకు రావడం లేదని పేర్కొన్నాడు.

## సూర్యకుమార్ యాదవ్‌కి అసలైన సవాల్

భారత్ - న్యూజిలాండ్ మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. మరో మూడు వారాల్లో జరగనున్న టీ20 వరల్డ్ కప్‌కు ఇది టీమిండియాకు చివరి రిహార్సల్ లాంటిదే.అయితే ఈ సిరీస్ కెప్టెన్ సూర్యకుమార్



యాదవ్‌కు అసలైన పరీక్ష అని చెప్పొచ్చు. కేవలం కెప్టెన్‌గానే కాకుండా బ్యాటర్‌గా కూడా స్కె తనను తాను నిరూపించుకోవాల్సి ఉంటుంది.2024 నుంచి భారత టీ20 జట్టుకు సారథిగా బాధ్యతలు చేపట్టిన సూర్యకుమార్ మంచి విజయ శాతంతో దూసుకెళ్తున్నాడు. అతని నాయకత్వంలో భారత్ 70 శాతం పైగా మ్యాచ్‌లు గెలిచింది. కానీ ఈ విజయాల వెనుక సూర్య వ్యక్తిగత బ్యాటింగ్ ఫామ్ పూర్తిగా కనుమరుగయింది. ఇప్పుడు వరల్డ్ కప్ సమీపిస్తున్న వేళ ఆ లోపమే పెద్ద ప్రశ్నగా మారింది. 2025లో సూర్యకుమార్ భారత్ తరఫున ఆడిన 19 టీ20 మ్యాచ్‌ల్లో కేవలం 218 పరుగులే చేశాడు. ఒక్క హాఫ్ సెంచరీ కూడా లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. గత రెండేళ్లుగా భారత టీ20 జట్టు టాప్ క్లాస్ ప్రదర్శన చేసింది. డిఫెండింగ్ ఛాంపియన్స్‌గా బరిలోకి దిగుతోన్న సూర్యకుమార్ యాదవ్ సేనకు స్వదేశంలో వరల్డ్ కప్ టైటిల్‌ను కాపాడాల్సిన బాధ్యత తమ భుజాలపై పడింది. న్యూజిలాండ్ జట్టు కూడా ఈ మధ్య కాలంలో భారత్‌పై చరిత్ర సృష్టించింది. టెస్టు సిరీస్ వైట్‌వాష్, వన్డే సిరీస్ విజయం వంటి ఘనతలు సాధించింది.

## ప్రపంచ కప్‌ను మేము బహిష్కరించడం లేదు




2026 టీ20 ప్రపంచ కప్‌ను తాము బహిష్కరించడం లేదని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు స్పష్టం చేసింది. భద్రతా కారణాలతో బంగ్లాదేశ్ టోర్నమెంట్ నుంచి వైదొలిగితే, ఆ జట్టుకు సంఘీభావంగా తాము కూడా ప్రపంచ కప్‌ను బాయ్‌కాట్ చేస్తామంటూ వస్తున్న వార్తలను కొట్టిపారేసింది. తమ మ్యాచ్‌లన్నీ శ్రీలంకలోనే జరగనున్నాయని, కాబట్టి ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని తేల్చిచెప్పింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నమెంట్‌లో భాగంగా, తమ గ్రూప్ మ్యాచ్‌లను కోల్‌కతా, ముంబయిలో ఆడేందుకు బంగ్లాదేశ్ భద్రతా కారణాల దృష్ట్యా విముఖత చూపుతోంది. ఈ నేపథ్యంలో, బంగ్లాదేశ్‌కు మద్దతుగా పాకిస్థాన్ కూడా టోర్నీ నుంచి వైదొలగుతుందని కొన్ని డియా సంస్థల్లో కథనాలు వచ్చాయి. ఈ ఊహాగానాలపై పీసీబీ వర్గాలు గట్టిగా స్పందించాయి. "2025 ఆరంభంలో కుదిరిన ఒప్పందం ప్రకారమే మా మ్యాచ్‌లన్నీ శ్రీలంకకు షెడ్యూల్ అయ్యాయి. అలాంటప్పుడు మేం టోర్నమెంట్ నుంచి ఎందుకు వైదొలగుతాం? కొందరు కావాలనే ఈ వివాదాన్ని పెద్దది చేసేందుకు ప్రయత్నిస్తున్నారు" అని ఓ క్రీడా వెబ్‌సైట్‌కు వెల్లడించాయి. మరోవైపు, భారత్‌లో ఆడేందుకు బంగ్లాదేశ్‌పై ఐసీసీ ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఒకవేళ బంగ్లాదేశ్ అంగీకరించకపోతే, ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌ను టోర్నీలోకి తీసుకునే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అయితే, ఐసీసీ నుంచి తమకు ఎలాంటి అధికారిక సమాచారం రాలేదని, ఒత్తిడి చేసి తమతో ఆడించలేరని బంగ్లాదేశ్ ప్రభుత్వ క్రీడా సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ స్పష్టం చేశారు. ఈ విషయంపై ఐసీసీ తమను సంప్రదించలేదని స్కాట్లాండ్ కూడా తెలిపింది.

## విరాట్ కోహ్లీ దేశవాళీల్లో ఆడాల్సిన అవసరం లేదు



భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో అతడు 240 పరుగులు సాధించాడు. ముఖ్యంగా ఇండోర్ వన్డేలో అతడు 108 బంతుల్లో 124 పరుగులు చేశాడు. ఇందులో పది ఫోర్లు, మూడు సిక్స్‌లున్నాయి. ఈ నేపథ్యంలో టీమ్ఇండియా మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ అతడినుద్దేశించి కీలకమైన వ్యాఖ్యలు చేశాడు. విరాట్ కోహ్లీ భారత్ తరఫున వన్డేలు ఆడితే చాలని, దేశవాళీల్లో పాల్గొనాల్సిన అవసరం లేదన్నాడు. 'విరాట్ కోహ్లీ.. లండన్ నుంచి వస్తున్నాడు. పరుగులు సాధిస్తున్నాడు. మళ్లీ వెళుతున్నాడు. రెగ్యులర్‌గా ఆడకున్నా.. ఇలా నిలకడగా పరుగులు రాబట్టడం అంత తేలిక కాదు. అతడి ఫిట్‌నెస్, క్రికెట్‌పై అతడి అంకితభావం, స్వీయ సన్నద్ధత అమోఘం' అని కైఫ్ తన యూట్యూబ్ ఛానెల్‌లో అన్నాడు. 'అతడు ప్రస్తుతం దేశవాళీ క్రికెట్ ఆడాల్సిన అవసరం లేదు. మ్యాచ్ ప్రాక్టీస్ ఎవరైనా పొందుతారు. కానీ ఆటపై అతడికున్న ఆ అభిరుచిని ఇతరులు పొందడం సాధ్యం కాదు. అది మార్కెట్లో దొరకదు. అతడు చివరి వన్డేలోనూ బ్యాట్‌తో అద్భుతంగా రాణించాడు' అని మహ్మద్ కైఫ్ విశ్లేషించాడు. విరాట్ కోహ్లీ సిడ్నీ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డే నుంచి అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. తన చివరి ఏడు ఇన్నింగ్స్‌ల్లో 123.2 యావరేజ్‌తో 616 సాధించాడు. ఇందులో మూడు సెంచరీలున్నాయి.

## కదం తొక్కిన శ్రీచరణి

మహిళల ప్రీమియర్ లీగ్‌లో తెలుగు తేజం, ఢిల్లీ బౌలర్ శ్రీచరణి అద్భుత బౌలింగ్‌కి తోడు బ్యాటింగ్‌లో రోడ్రిగ్స్, లీ రాణించడంతో ముంబయి ఇండియన్స్‌పై ఢిల్లీ క్యాపిటల్స్ ఘన విజయం సాధించింది. దీంతో ముంబయి నిర్దేశించిన లక్ష్యాన్ని ఢిల్లీ 19 ఓవర్లలోనే ఛేదించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ముంబయి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 154పరుగులు చేయగా.. అనంతరం ఢిల్లీ జట్టు 19 ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసి గెలిచింది. ఛేదనలో ఢిల్లీ కెప్టెన్ రోడ్రిగ్స్(51నాటౌట్), లీ(46)కి తోడు షెఫాలీ(29) బ్యాటింగ్‌లో రాణించారు. అంతకు ముందు ముంబయి ఇండియన్స్‌కు శుభారంభం దక్కలేదు. ఓపెనర్లు సజన(9), మాథ్యూస్(12) నిరాశపరిచారు. దీంతో ముంబయి 21 పరుగులకే 2వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్(41), స్కీవర్ బ్రంట్(65 నాటౌట్) కలిసి 2వ వికెటకు 78పరుగులు జతచేశారు. వీరిద్దరు మినహా.. మరే బ్యాటర్ ముంబయి జట్టులో రాణించలేదు. క్యారీ(12), అమన్‌జ్యోత్ కౌర్(3) స్వల్ప స్కోర్లకే పెవీలియన్‌కు చేరారు. సంస్కృతి గుప్తా(10నాటౌట్) క్రీజ్‌లో నిలిచింది. ఢిల్లీ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ముంబయి బ్యాటర్ల పరుగులు రాబట్టేందుకు చెమటోడ్చాల్సి వచ్చింది. శ్రీచరణి మూడు వికెట్లకు తోడు మారిజానే కాప్, నందిని శర్మ ఒక్కో వికెట్‌తో రాణించారు.



## విరాట్-రోహిత్‌కు భారీ షాక్!

భారత క్రికెట్‌లో కీలక మార్పులకు బీజం పడినట్టుగా కనిపిస్తోంది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ, బీసీసీఐకి కేంద్ర కాంట్రాక్టుల విషయంలో సంచలన ప్రతిపాదనలు చేసినట్టు సమాచారం. ప్రస్తుతం అమల్లో ఉన్న ఏ + కేటగిరీని పూర్తిగా తొలగించాలనే ఆలోచనలో సెలెక్టర్లు ఉన్నారని వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రతిపాదనకు బీసీసీఐ ఆమోదం లభిస్తే, ఇకపై భారత క్రికెట్‌లో కేవలం ఏ, బీ, సీ అనే మూడు కేటగిరీలే కొనసాగనున్నాయి. ప్రస్తుతం ఏ+ గ్రేడ్‌లో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ , జస్ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా ఉన్నారు. అయితే ఈ నలుగురిలో అన్ని ఫార్మాట్లలో కొనసాగుతున్న ఏకైక ఆటగాడు బుమ్రానే కావడం గమనార్హం. జడేజా ఇప్పటికే టీ20లకు గుడ్‌బై చెప్పగా, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ టెస్టులు, టీ20ల నుంచి తప్పుకున్నారు. ఈ నేపథ్యంలోనే ఏ+ కేటగిరీ కొనసాగించాల్సిన అవసరం లేదని సెలెక్షన్ కమిటీ అభిప్రాయపడినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఏ+ కేటగిరీలో ఉన్న ఆటగాళ్లకు ఏడాదికి రూ.7 కోట్లు చెల్లిస్తున్నారు. ఈ గ్రేడ్ తొలగితే, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ లాంటి స్టార్ ఆటగాళ్లు తక్కువ కేటగిరీకి దిగజారే అవకాశాలు ఉన్నాయి. అలా జరిగితే వారి వార్షిక కాంట్రాక్ట్ విలువ కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. ఏ కేటగిరీలో రూ.5 కోట్లు, బీ కేటగిరీలో రూ.3 కోట్లు, సీ కేటగిరీలో రూ.1 కోటి మాత్రమే చెల్లిస్తారు.వచ్చే బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఈ ప్రతిపాదనపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అదే సమయంలో కొన్ని కీలక మార్పులు కూడా చోటు చేసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. దీర్ఘకాలంగా జట్టుకు దూరంగా ఉన్న మొహమ్మద్ ష తన కేంద్ర కాంట్రాక్టును కోల్పోయే ప్రమాదం ఉంది. మరోవైపు, అర్షదీప్ సింగ్‌కి ప్రమోషన్ లభించే అవకాశం ఉంది. అతడు సి కేటగిరీ నుంచి బీ కేటగిరీకి ఎగబాకవచ్చని సమాచారం. అలాగే వైట్‌బాల్ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్న హర్షిత్ రాణాకు కూడా మెరుగైన గ్రేడ్ దక్కే ఛాన్స్ ఉంది. అత్యున్నత కేటగిరీలో కొనసాగేది ప్రధానంగా మూడు ఫార్మాట్లలో యాక్టివ్‌గా ఉన్న ఆటగాళ్లేనని సెలెక్టర్లు స్పష్టంగా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో జస్ప్రీత్ బుమ్రా టాప్ బ్రాకెట్‌లో కచ్చితంగా కొనసాగుతాడని అంచనా. అలాగే భారత క్రికెట్‌కు ముఖచిత్రంగా మారుతున్న శుభ్‌మన్ గిల్‌కు కూడా అత్యున్నత కేటగిరీ దక్కే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ మార్పులు అమలులోకి వస్తే, భారత క్రికెట్‌లో సెంట్రల్ కాంట్రాక్టుల వ్యవస్థలో ఇది అతిపెద్ద మార్పుగా నిలవనుంది.



# లక్కీ చాన్స్ కొట్టేసిన బేబమ్మ..

మెగాస్టార్ చిరంజీవి 'మన శంకర వరప్రసాద్ గారు' మూవీతో భారీ విజయాన్ని అందుకున్నారు. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా.. విడుదలైన ఈ చిత్రం ఏకంగా రూ. 300 కోట్ల గ్రాస్‌తో దూసుకెళ్తోంది. అంతేకాకుండా అత్యంత వేగంగా రూ.300 కోట్ల క్లబ్‌లో చేరిన ప్రాంతీయ సినిమాగా నిలిచింది. ఈ ఘన విజయం తర్వాత చిరంజీవి తదుపరి సినిమాలపై సోషల్ డియాలో ఆసక్తికరమైన చర్చలు మొదలయ్యాయి. ఆ జాబితాలో ముందుగా వినిపిస్తున్న ప్రాజెక్ట్.. దర్శకుడు బాబీ కొల్లి దర్శకత్వంలో రాబోతున్న 'మెగా-158'. ఇప్పటికే వీరిద్దరి కాంబోలో తెరకెక్కిన 'వాల్తేరు వీరయ్య' బ్లాక్‌బస్టర్ కావడంతో.. ఈ కొత్త సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. విడుదలకు ముందే ఈ మూవీకి సంబంధించిన అప్‌డేట్స్ నెట్టింట వైరల్ అవుతూ హైప్‌ను పెంచుతున్నాయి. ఇదిలా ఉండగా, తాజాగా 'మెగా-158'పై ఓ క్రేజీ న్యూస్ సోషల్ డియాలో చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలో యంగ్ హీరోయిన్ కృతి శెట్టి, క్రేజీ బ్యూటీ అనస్వర రాజన్ కీలక పాత్రల్లో నటించనున్నట్లు టాక్. అదీ చిరంజీవి కూతుళ్లుగా వీరిద్దరూ కనిపించబోతున్నారన్న ప్రచారం అభిమానుల్లో ఆసక్తిని రెట్టింపు చేసింది. వరుస పరాజయాలతో ఇబ్బంది పడుతున్న కృతి శెట్టికి ఈ అవకాశం పెద్ద బ్రేక్‌గా మారుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ తాజా వార్తతో 'మెగా-158'పై బజ్ ఒక్కసారిగా పెరిగింది. కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మించనుండగా.. మార్చి నెలలో షూటింగ్ ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని బలమైన ఎమోషన్, ఫ్యామిలీ సెంటిమెంట్‌తో పాటు పక్కా మాస్ ఎలిమెంట్స్‌తో తెర కెక్కించ నున్నట్లు తెలుస్తోంది.



# జెట్లీ ఫైనల్ షెడ్యూల్



టాలీవుడ్ ఫేవరేట్ ద్వయం సత్య, దర్శకుడు రితేష్ రానా 'జెట్లీ'తో అలరించబోతున్నారు. ప్రతిష్టాత్మక మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ చిరంజీవి (చెర్రీ), హేమలత పెద్దమల్లు నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ జెట్ స్పీడ్‌లో జరుగుతోంది. తాజాగా ఫైనల్ షూటింగ్ షెడ్యూల్‌ను ప్రారంభించారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్స్ పోస్టర్స్, గ్లింప్స్ కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రంతో మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా తెలుగులో పరిచయం కానుంది. మత్తు వదలరా వెనుక ఉన్న మెయిన్ టీం ఈ సినిమాకు పని చేస్తున్నారు. మ్యూజిక్ కాల భైరవ, సినిమాటోగ్రాఫర్ సురేష్ సారంగం, ఎడిటర్ కార్తీక శ్రీనివాస్, ప్రొడక్షన్ డిజైనర్ నార్ని శ్రీనివాస్ తో కలిసి రితేష్ రానా మరోసారి యూనిక్ సినిమాటిక్ యూనివర్స్ క్రియేట్ చేశారు. రితేష్ రాణా స్టైల్, సిగ్నేచర్ హ్యూమర్‌తో పాటు హై-ఎనర్జీ యాక్షన్ మేళవించిన జెట్లీ ఫన్-ప్యాక్డ్ ఎక్స్ పీరియన్స్ అందించబోతుంది.

తారాగణం: సత్య, రియా సింహ, వెన్నెల కిషోర్, అజయ్, సాంకేతిక సిబ్బంది: దర్శకత్వం: రితేష్ రానా, నిర్మాతలు: క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్, చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు, సమర్పణ: మైత్రి మూవీ మేకర్స్ (నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి), కథ - స్క్రీన్‌ప్లే: రితేష్ రానా & జయేంద్ర ఎరోలా, డైలాగ్స్: రితేష్ రానా, సంగీతం: కాల భైరవ, డీఓపీ : సురేష్ సారంగం, ఎడిటింగ్: కార్తీక శ్రీనివాస్, కాస్ట్యూమ్ డిజైనర్, స్టైలిస్ట్: తేజ ఆర్, ప్రొడక్షన్ డిజైనర్: నార్ని శ్రీనివాస్, యాక్షన్ కొరియోగ్రఫీ: వింగ్ చున్ అంజి, కో-డైరెక్టర్: చుక్కా విజయ్ కుమార్, డైరెక్షన్ గ్యాంగ్: ప్రభావ్ కర్రి, పి.వి.సాయి సోమయాజులు, విక్రమ్ రామిరెడ్డి, కౌశిక్ రాజు, పోస్టర్స్: శ్యామ్, పీఆర్ఓ: వంశీ - శేఖర్.

# తెలంగాణ సాయుధ పోరాటగాథకు దృశ్యరూపం

# దృశ్యరూపం గొల్ల రామవ్వ

## ఈనెల 25 నుంచి ఈటీవీ విన్‌'లో'!!

తెలుగుజాతి గర్వం, స్వర్గీయ భారత ప్రధాని - భారత రత్న పి.వి.నరసింహారావు రాసిన తెలంగాణ సాయుధ పోరాటగాథకు దృశ్యరూపం "గొల్ల రామవ్వ". ప్రఖ్యాత రచయిత ముళ్ళపూడి వెంకటరమణ తనయుడు ముళ్లపూడి వరా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ రోమాంఛిత వీరగాథను... సుచేత డ్రీమ్ వర్క్స్ ప్రొడక్షన్ - వర్మ డ్రీమ్ క్రియేషన్స్ పతాకాలపై... రామ్ విశ్వాస్ హనూర్కర్ - రాఘవేంద్రవర్మ (బుజ్జి) సంయుక్తంగా... అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. పేరొందిన పలు మీడియా సంస్థల్లో పనిచేసిన అనుభవం కలిగిన అజహర్ షేక్ ఈ చిత్రానికి కార్యనిర్వాహక నిర్మాతగా కీలక బాధ్యతలు నిర్వహించడంతోపాటు... సాహిత్యం సమకూర్చడం విశేషం!!

ఇంతకుముందు ఈటీవీ విన్ కోసం "మౌనమే నీ భాష" చిత్రాన్ని నిర్మించి వీక్షకుల నుంచి విశేష ఆదరణ పొందిన టీమ్ నుంచి వస్తున్న "గొల్ల రామవ్వ" ఈనెల 25 (జనవరి 25) నుంచి ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ కానుంది. "తెలుగు సీతామాలక్ష్మి" తాళ్ళూరి రామేశ్వరి టైటిల్ పాత్రలో.. చిరస్మరణీయంగా నిలిచిపోనున్న ఈ చిత్రానికి.. పి.ఆర్.ఓ: ధీరజ్-అప్పాజీ, సంగీతం: సాయి మధుకర్, ఛాయాగ్రహణం: గంగమోని శేఖర్, కూర్పు: రాఘవేంద్రవర్మ, రచన: బయ్యవరపు రవి, కార్యనిర్వాహక నిర్మాత - సాహిత్యం: అజహర్ షేక్, నిర్మాతలు: రామ్ విశ్వాస్ హనూర్కర్ - రాఘవేంద్రవర్మ (బుజ్జి), చిత్రనువాదం - దర్శకత్వం: ముళ్ళపూడి వరా!!



నిహాల్ కోధాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాధ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న యూనిక్ స్పై డ్రామా 'చైనా పీస్'. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్ లో తెరకెక్కిన ఈ చిత్రంలో కమల్ కామరాజు, రఘు బాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్ర పోషించారు. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్ ని క్రియేట్ చేసింది. యూనిక్ కాన్సెప్ట్, ప్రెజెంటేషన్, యాక్షన్, థ్రిల్ ,హ్యూమర్ ఎలిమెంట్స్ తో టీజర్ సినిమా పై అంచనాలు పెంచింది.

తాజాగా మేకర్స్ ఈ సినిమా నుంచి భగ భగ సాంగ్ రిలీజ్ చేశారు. కంపోజర్ కార్తిక్ దేశభక్తి రగిలించేలా ఈ పాటని స్వరపరిచారు. కాల భైరవ పవర్ ఫుల్ వోకల్స్ సాంగ్ ని నెక్స్ట్ లెవల్ కి తీసుకెళ్ళింది. తన పదాలని ఆయుధాలుగా మార్చి రెహమాన్ రాసిన లిరిక్స్ అందరినీ హత్తుకున్నాయి. ఈ చిత్రానికి సురేష్ రగుతు కెమరామ్యాన్. మార్తాండ్ కె. వెంకటేష్ ఎడిటర్.

# 'చైనా పీస్' నుంచి భగ భగ

ఫిబ్రవరి చివర్లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. నటీనటులు: నిహాల్ కోధాటి, సూర్య శ్రీనివాస్, హర్షిత బండ్కమూరి, కమల్ కామరాజు, తులసి, రఘు బాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్, టెక్నికల్ టీం: రచన, దర్శకత్వం: అక్కి విశ్వనాధ రెడ్డి, బ్యానర్: మూన్ లైట్ డ్రీమ్స్, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: సురేష్ రగుతు, సంగీతం: కార్తీక్ రోడ్రిగ్జ్, ఎడిటర్: మార్తాండ్ కె. వెంకటేష్, పీఆర్వో: తేజస్వీ సజ్జా



# హనీ టెర్రిఫిక్ టీజర్ రిలీజ్



నవీన్ చంద్ర, దివ్య పిళ్లై ప్రధాన పాత్రల్లో కరుణ కుమార్ రచన, దర్శకత్వం వహించిన సైకలాజికల్ హారర్ మూవీ హనీ. ఓవీఏ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని శేఖర్ స్టూడియోస్ సమర్పిస్తోంది. ఈ చిత్రం నిజ జీవిత సంఘటనల నుంచి ప్రేరణ తో మూఢనమ్మకాలు, అంధ విశ్వాసాలు, డార్క్ సైకలాజిక్ ఎలిమెంట్స్ తో ఉండబోతోంది. తాజాగా ఈ చిత్రం టీజర్ రిలీజ్ చేశారు. వెన్నులో వణుకు పుట్టించేలా వున్న టీజర్ సినిమాపై అమాంతం ఆసక్తిని పెంచింది. ఇప్పటివరకు మనం చూసిన హారర్ కు భిన్నంగా, హనీ టీజర్ పూర్తిగా రిటుల్ - బెస్డ్ హర్రర్‌తో.. నిశ్శబ్దం, చీకటి, మర్మమైన చూపులు, తెలియని శక్తులు-ఇవన్నీ కలిసి ఒక మార్మిక ప్రపంచాన్ని ఆవిష్కరిస్తున్నాయి. దర్శకుడు కరుణ కుమార్ ఇప్పటివరకు ఎన్నడూ చూడని కథను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాడనే సంకేతాలు టీజర్‌లో బలంగా వినిపిస్తున్నాయి. హారర్‌ను కేవలం భయపెట్టే అంశంగా కాకుండా ఊహకు అతీతంగా ప్రజెంట్ చేస్తున్న విధానం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రతి ఫ్రేమ్‌లోనూ "ఏదో పెద్ద రహస్యం దాగుంది" అన్న ఫీలింగ్ కలుగుతుంది. నవీన్ చంద్ర లుక్ పెర్ఫార్మెన్స్ స్టన్నింగ్ గా వుంది. దివి, రాజా రవీంద్ర పాత్రలు కూడా భిన్నంగా కనిపించాయి. అజయ్ అరసాడ సంగీతం బీజీఎం గూస్బంప్స్ తెప్పించింది. ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీమ్ పని చేస్తోంది. మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటింగ్, నాగేష్ బానెల్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. సైకాలజికల్ డెప్త్, సోషల్ రిలెవెన్స్, హారర్ అంశాల సమ్మేళనంతో రూపొందిన 'హనీ' ఫిబ్రవరి 6న ప్రేక్షకులకు అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించేందుకు సిద్ధంగా ఉంది. తారాగణం: నవీన్ చంద్ర, దివ్య పిళ్లై, దివి, రాజా రవీందర్, జయన్ని, జయత్రి, రచన, దర్శకత్వం: కరుణ కుమార్, నిర్మాతలు: రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి, బ్యానర్: ఓవీఏ ఎంటర్‌టైన్‌మెంట్స్, సంగీతం: అజయ్ అరసాడ, డీఓపీ : నగేష్ బన్నెల్, ఎడిటింగ్: మర్తాండ్ కె వెంకటేశ్, పీఆర్వో: తేజస్వీ సజ్జా.



# పల్లి చట్టంబి మోషన్ పోస్టర్ విడుదల

మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ నటిస్తున్న భారీ బడ్జెట్ మూవీ "పల్లి చట్టంబి". ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ ఫిలింస్, సి క్యూబ్ బ్రోస్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్ పై నౌఫల్, బ్రిజీష్, చాణుక్య చైతన్య చరణ్ నిర్మిస్తున్నారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కయదు లోహర్ హీరోయిన్ గా నటిస్తోంది. బుధవారం "పల్లి చట్టంబి" సినిమా మోషన్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ మోషన్ పోస్టర్ ద్వారా సినిమా రిలీజ్ డేట్‌ను కూడా వెల్లడించారు. ఏప్రిల్ 9న ఈ ప్రెస్టీజియస్ మూవీని హిందీ, తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ ఐదు భాషల్లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. 50, 60 దశకాల నేపథ్యంగా సాగే ఈ పీరియాడిక్ మూవీలో హీరో టొవినో థామస్ ఇప్పటిదాకా చూడని విధంగా సరికొత్తగా కనిపించనున్నారు. "పల్లి చట్టంబి" మోషన్ పోస్టర్ సినిమా మీద పాన్ ఇండియా స్థాయిలో అంచనాలు పెంచుతోంది. నటీనటులు - టొవినో థామస్, కయదు లోహర్, విజయరాఘవన్, సుధీర్ కరమన, బాబురాజ్, వినోద్ కేదమంగళం, ప్రశాంత్ అలెక్జాండర్, తదితరులున్నారు. కాస్ట్యూమ్స్ - మంజూష రాధకృష్ణన్, మేకప్ - రషీద్ అహ్మద్, ప్రొడక్షన్ డిజైన్ - దిలీప్ నాథ్, ఎడిటింగ్ - శ్రీజిత్ సరంగ్, సినిమాటోగ్రఫీ - టిజో టోమీ, మ్యూజిక్ - జేక్స్ బిజోయ్, స్క్రిప్ట్ - ఎస్ సురేష్ బాబు, అసోసియేట్ ప్రొడ్యూసర్స్ - మేఘశ్యామ్, తంజీర్, పీఆర్ఓ - జీఎస్ కే మీడియా (సురేష్ - శ్రీనివాస్), ప్రొడ్యూసర్స్ - నౌఫల్, బ్రిజీష్, చాణుక్య చైతన్య చరణ్, డైరెక్టర్ - డిజో జోస్ ఆంటోనీ.



# అందరికీ కనెక్ట్ అయ్యే కమర్షియల్ ఎంటర్‌నర్



తరుణ్ భాస్కర్ లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః'. ఈషా రెబ్బా హీరోయిన్. ఏ.ఆర్.సజీవ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఎస్ ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ బ్యానర్స్ పై సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనుప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్, నవీన్ సనివరపు ఈ వెంచర్‌ను నిర్మిస్తుండగా, కిషోర్ జాలాది, బాల సౌమిత్రి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా ఈనెల 23న వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు ఏఆర్ సజీవ్ డియాతో ముచ్చటించారు. ఇది ఒక రీమేక్ స్టోరీ. '35 చిన్న కథ' సినిమాకి డైరెక్టర్ నందకిశోర్‌తో కలిసి పని చేశాను. ఇదే ప్రొడక్షన్ హౌస్‌లో నా సొంత కథ అడిగారు. అయితే రెండు నెలల తర్వాత ఈ ప్రాజెక్టు గురించి చెప్పారు. తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా లాంటి ఒక పెద్ద టీంతో నా ఫస్ట్ సినిమా చేయటం అదృష్టంగా భావిస్తున్నాను. ఒరిజినల్ కథలోని కోర్ పాయింట్‌ని తీసుకుని తెలుగు సినిమాకి తగ్గట్టు మార్పులు చేశాను. ఇది యూనివర్సల్‌గా అందరికీ కనెక్ట్ అయ్యే కథ. అక్కడికి, ఇక్కడికి కల్చర్ విషయంలో చాలా డిఫరెన్స్ ఉంటుంది. బ్యాక్‌డ్రాప్‌ని గోదారి ప్రాంతానికి మార్చాం. దాదాపుగా 60% కథని మార్చాం. చివరి 30 నిమిషాలు కొత్త కథలాగే అనిపిస్తుంది. ఫైట్ ఒకటే కామన్‌గా ఉంటుంది. కానీ మిగతాదంతా కొత్తగా ఉంటుంది. తరుణ్ పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. మూవీ చూసి చాలా మెచ్చుకున్నారు. నాకంటే ఎక్కువగా ఆనందపడ్డారు. అలాగే ఈషా కూడా అద్భుతంగా నటించింది. వీరిద్దరితోపాటు అందరి పాత్రలు చాలా వైవిధ్యంగా ఉంటూ అలరిస్తాయి.

ఒరిజినల్ నుంచి ఒక్క ట్రాక్ కూడా వాడుకోలేదు. కంప్లీట్‌గా కొత్త మ్యూజిక్ చేయడం జరిగింది. ఒరిజినల్ కంటే తెలుగులో ఎక్కువ సాంగ్స్ ఉన్నాయి. మొత్తం ఏడు పాటలు. అన్ని పాటలు కూడా అద్భుతంగా వచ్చాయి. ఇవివి సత్యనారాయణ సినిమాల్లో భార్యాభర్తల మధ్య ఉండే ఎంటర్టైన్మెంట్, ఎమోషన్ ఏ విధంగా రన్ అవుతుందో ఈ సినిమాలో కూడా అంత చక్కని వినోదం కుదిరింది. ఇందులోని డ్రామా, ఎమోషన్స్ విషయంలో దర్శకుడిగా నాకు మంచి పేరు వస్తుందని నమ్ముతున్నాను.

# ఈ విజయం గొప్ప ఆనందాన్నిచ్చింది



హీరో శర్వా నటించిన చిత్రం 'నారీ నారీ నడుమ మురారి'. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో ఏకే ఎంటర్‌న్‌మెంట్స్ బ్యానర్‌పై అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రై. లిమిటెడ్‌తో కలిసి అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించారు. ఈనెల 14న విడుదలైన ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుని సంక్రాంతి విన్నర్‌గా కొనసాగుతూ, హౌస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా హీరో శర్వా డియాతో సంభాషించారు. సంక్రాంతికి బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టడం చాలా హ్యాపీగా ఉంది. అంతేకాదు అనుకున్న రిజల్ట్ రావడం కూడా చాలా ఆనందాన్నిచ్చింది. సినిమాకి చాలా అద్భుతమైన రెస్పాన్స్ ఉంది. అయితే సంక్రాంతికి చివరిలో రావడానికి కారణం ఒకటే..అప్పటికే నాలుగు సినిమాలు బుక్ అయ్యాయి. అయితే ఈ సంక్రాంతికి చాలా పెద్ద లాంగ్ వీకెండ్స్ కలిసి వచ్చాయి. ఈనెల 23 నుంచి 26 వరకు మళ్లీ పెద్ద వీకెండ్ ఉంది. మేము కంటెంట్‌ని బలంగా నమ్మాం. సంక్రాంతి సీజన్‌లో ఆదరిస్తారని నమ్మకం ఉంది. ఆ నమ్మకం మాకు నిజమైంది. ఇప్పుడు నెంబర్ ఆఫ్ థియేటర్స్ పెరుగుతున్నాయి. సినిమాకి చాలా మంచి లాంగ్ రన్ ఉంటుంది. ఈ సినిమా తొలి రోజు నుంచి చాలా నమ్మకం ఉంది. సినిమా ఎప్పుడు వచ్చినా సరే బ్లాక్ బస్టర్ అని మొదటి నుంచి చెప్తున్నాను. నిర్మాత అనిల్ బిగ్ బ్రదర్ లాంటివారు. ఒకరినొకరు హెల్ప్ చేసుకుంటూ వర్క్ చేసాం. ఆయన నాకు ఎక్కువ బలం ఇచ్చారు. ఇండిస్ట్రీకి రామ్ అబ్బరాజు లాంటి డైరెక్టర్స్ కావాలి. తనకు చాలా క్లారిటీ ఉంటుంది.

# హీరోయిన్ మెయిన్ రోల్‌లో ఉంటే.. నిర్మాతలు భయపడుతున్నారు

కోలీవుడ్ యంగ్ బ్యూటీ మాళవిక మోహనన్ కెరీర్ ప్రస్తుతం ఫుల్ ఫామ్‌లో ఉంది. తెలుగు, తమిళ సినిమాల్లో వరుస అవకాశాలు అందుకుంటూ గ్లామర్‌తో పాటు నటనకూ ప్రాధాన్యం ఇస్తోంది. గతేడాది మోహన్‌లాల్ సరసన నటించిన 'హృదయపూర్వం' సూపర్ హిట్ కావడంతో ఆమె క్రేజ్ అమాంతం పెరిగింది. ఆ జోష్‌లో భాగంగా పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ సినిమాలో నటించే ఛాన్స్ దక్కించుకుంది. మారుతి దర్శకత్వంలో వచ్చిన 'ది రాజా సాబ్'లో కీలక పాత్ర పోషించినప్పటికీ, సినిమా బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ టాక్‌తో ఆశించిన ఫలితం సాధించలేకపోయింది. ఇదిలా ఉంటే.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మాళవిక మోహనన్ షాకింగ్ కామెంట్స్ చేసింది. మన దగ్గర భారీ బడ్జెట్ సినిమాలంటే కేవలం హీరోలవే ఎందుకు ఉంటున్నాయి? హీరోయిన్ మెయిన్ రోల్‌లో ఉంటే కోట్లు పెట్టడానికి నిర్మాతలు భయపడుతున్నారు?'' అని మాళవిక ప్రశ్నించింది. చాలా మంది ప్రొడ్యూసర్లు, హీరోలు.. లేడీ ఓరియెంటెడ్ సినిమాలకి బాక్సాఫీస్ దగ్గర అంత సీన్ ఉండదని, అందుకే ఒక లిమిట్ దాటి ఖర్చు చేయకూడదని అనుకుంటారని తెలిపింది. మలయాళ సినిమా సక్సెస్‌ను చూపిస్తూ.. నిర్మాతలు ధైర్యం చేసి కంటెంట్‌ను నమ్మితే ఏదైనా సాధ్యమేనని చెప్పడానికి మలయాళ మూవీ 'లోకా:చాప్టర్1చంద్ర' ను ఉదాహరణగా చెప్పింది. కల్యాణి ప్రియదర్శన్ హీరోయిన్‌గా వచ్చిన ఆ సినిమాకు దుల్కర్ సల్మాన్ భారీగా ఖర్చు చేశారని, రిజల్ట్ చూస్తే ఏకంగా 300 కోట్లు వసూలు చేసిందని గుర్తు చేసింది. ప్రొడ్యూసర్లు దుల్కర్‌లా నమ్మి అవకాశం ఇస్తే హీరోయిన్లు కూడా బాక్సాఫీస్ రికార్డులు తిరగరాస్తారు'' అని మాళవిక చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట సంచలనం సృష్టిస్తున్నాయి.



Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sai Sree Offset Printers, # 7-17-166, 3rd line, Srinagar, Guntur - 522002 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Maria, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.